

రాజశేఖర చరిత్రము
రూ॥ 180/-
పేజీలు: 190
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★


జులై 31న 'స్వదేశీ' ఉగ్రవాదం గుట్టు రట్టు?

స్నేహం పేరుతో ట్రంప్‌కు మోదీ లొంగుబాటు

మరోవిడత వాణిజ్య చర్చల కోసం వచ్చేవారమే వాషింగ్టన్‌కు భారత్ బృందం

లోపలి పేజీల్లో


సంపుటి 08, సంచిక: 221 | శుక్రవారం | 11-07-2025 | ఖమ్మం    Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar    పేజీలు: 12+8 | వెల రూ. 5.00




# 42% కోటాతోనే స్థానిక ఎన్నికలకు

బిసిలకు రిజర్వేషన్ల పెంపునకు అనుగుణంగా ప్రస్తుత పంచాయతీరాజ్ చట్టానికి సవరణ

ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా పరిగణనలోకి అడ్వకేట్ జనరల్ సలహాలు సూచనలు : రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం



- మార్చి లోపు లక్ష ఉద్యోగాలు ఇవ్వడమే లక్ష్యం
- అమిటీ, సెంటినరీ రిహాబిలిటేషన్ విద్యాసంస్థలకు యూనివర్సిటీ హోదా
- ఈ విశ్వవిద్యాలయాల్లో రాష్ట్రానికి 50 శాతం సీట్ల కేటాయింపు
- అధునాతన గోశాలల ఏర్పాటుకు ముగ్గురు అధికారులతో కమిటీ
- పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ వేగవంతం చేయాలని నిర్ణయం

ప్రజాపక్షం/హైదరాబాద్

బిసిలకు 42 శాతం రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. రిజర్వేషన్ల పెంపునకు అనుగుణంగా ప్రస్తుం రాష్ట్రంలో అమలులో ఉన్న పంచాయతీరాజ్ చట్టం 2018 సవరణకు మంత్రివర్గం ఆమోదించింది. రిజర్వేషన్లను అమలు చేసే క్రమంలో ఎటువంటి న్యాయ పరమైన చిక్కులు రాకుండా రాష్ట్ర అడ్వకేట్ జనరల్ సూచనలు, సలహాలను కూడా మంత్రి వర్గం పరిగణలోకి తీసుకున్నది. మార్చి లోపు ఒక లక్ష ఉద్యోగాలను ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నది. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు చేసే అంశంలో న్యాయపరమైన చిక్కులు రాకుండా ఉండేందుకు మంత్రివర్గ సమావేశంలో ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్ర అడ్వకేట్ జనరల్‌ను ఆహ్వానించి చర్చించారు. కాగా గతంలో జరిగిన 18 మంత్రివర్గ సమావేశాలలో తీసుకున్న నిర్ణయాలు, వాటి అమలు తీరుపై చర్చించారు. ఇప్పటి వరకు జరిగిన 18 మంత్రివర్గ సమావేశాల్లో 23 డిపార్ట్‌మెంట్లకు సంబంధించి ఆమోదించిన సుమారు 327 అంశాలపై మంత్రివర్గం చర్చించింది. ఈనెల 25న మరోసారి మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, చర్చించిన అంశాలను మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్ల కృష్ణారావు, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొ ంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియాకు వివరాలను వెల్లడించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు జరిగిన 18 మంత్రివర్గ సమావేశంలో ఆమోదించిన 327 అంశాలలో 321 అంశాలను 96 శాతం అమలు చేస్తున్నామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలు ప్రజలకు అందుతున్నాయా? లేదా, అమలు తీరుపైన చర్చించామన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ తరువాయి 2లో





# ఓటు హక్కును హరించే కుట్ర

- భగ్నం చేయకపోతే ప్రజాస్వామ్యానికే ప్రమాదం
- పునర్నిర్మిత మఖ్దూంభవన్ ప్రారంభోత్సవంలో డి.రాజా హెచ్చరిక
- వర్గ దోపిడీ కొనసాగినంత కాలం కమ్యూనిస్టులు ఉంటారు : సురవరం సుధాకర్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పేరుతో ఒక వర్గానికి చెందిన ఓట్లను తొలగించేందుకు ఎన్నికల కమిషన్ ప్రయత్నం చేస్తున్నదని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. బిహార్ మాదిరిగానే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్, కేరళ తదితర ఏ రాష్ట్రంలోనైనా ఓటర్లను తొలగించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ విషయంలో ప్రజలు, ప్రజాస్వామ్య పార్టీలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లో పునర్ నిర్మితమైన సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్ ప్రారంభోత్సవం గురువారం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు అధ్యక్షతన జరిగిన సభలో రాజా ప్రసంగిస్తూ దేశంలో ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించి నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించాల్సిన రాజ్యాంగ బద్ధమైన ఎన్నికల కమిషన్ చర్యలు ఓటర్లకు ప్రమాదకరంగా మారాయన్నారు. అందుకే బిహార్‌లో ప్రత్యేక సవరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రాజ్యాంగాన్ని, దేశాన్ని కాపాడి ముందుకు తీసుకు వెళ్లడానికి లౌకిక, ప్రజాస్వామ్య పార్టీలు, శక్తులను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని డి.రాజా అన్నారు. 'భారతదేశం ప్రస్తుతం సంక్షోభంలో ఉంది. అనేక క్లిష్టమైన సవాళ్లను ఎదుర్కొంటుంది. కేంద్రంలో మతతత్వ శక్తులు అధికారాన్ని హస్తగతం చేసుకున్నాయి. ఆ శక్తులు తమ చేతుల్లో ఉన్న రాజకీయ శక్తిని, ప్రభుత్వ అధికారాన్ని ఉపయోగించి అంబేద్కర్ సహా మహనీయులు అందించిన రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నం చేస్తున్నాయి. రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు, రాజ్యాంగం ప్రకారం ఏర్పడిన లౌకిక, ప్రజాస్వామ్య, సంక్షేమ దేశాన్ని మతతత్వ, ఫాసిస్టు శక్తులు దేశాన్ని మతరాజ్యంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నాయి. అందులో భాగంగానే దేశాన్ని, దేశ చరిత్రను మార్చేందుకు రాజ్యాంగం నుంచి సెక్యులరిజం పదాన్ని తొలగించడమే లక్ష్యంగా పెట్టుకున్నాయి'' అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం ప్రకారం ఏర్పడిన లౌకిక, ప్రజాస్వామ్య, ఫెడరల్ వ్యవస్థలు మతతత్వ ఫ్యాసిస్టుల శక్తుల దాడికి గురవుతున్నాయని ఆందోళన తరువాయి 12లో





ఎర్రజెండాలు ఒక్కటైతే

## కమ్యూనిస్టులకు ఎదురే ఉండదు

ఎర్రజెండాలన్నీ ఒక్కటైతే కమ్యూనిస్టులకు ఎదురే ఉండబోదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు చెప్పారు. వందేళ్లు అయినా కమ్యూనిస్టు పార్టీ మరింత పెరగడమే తప్ప తగ్గిందిలేదని, కమ్యూనిస్టు నాయకుల నాలుగవ తరం కూడా వచ్చిందన్నారు. 'మగ్ధూంభవన్' అనేది ఒక వారసత్వం లాంటిదని, కమ్యూనిస్టులకు ఇదే తాజ్‌మహల్, తరువాయి 2లో

## హెచ్‌సిఎ అధ్యక్షుడు జగన్మోహన్‌రావుకు రిమాండ్

- ఆయనతోపాటు మరో నలుగురికి కూడా..
- నకిలీ పత్రాలు సృష్టించి అధ్యక్ష పదవి పొందారని ఇడి ఆరోపణలు
- మాజీ మంత్రి కృష్ణయాదవ్ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు గుర్తింపు

ప్రజాపక్షం/హైదరాబాద్



హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) అధ్యక్ష ఎన్నికలో అక్రమాల కేసులో అధ్యక్షుడు జగన్మోహన్‌రావుతో పాటు మరో నలుగురికి మల్కాజ్‌గిరి కోర్టు జ్యూడిషియల్ రిమాండ్ విధించింది. వారిని అరెస్టు చేసినట్లు సిఐడి గురువారం ఉదయం ప్రకటన విడుదల చేసింది. జగన్మోహన్‌రావు, శ్రీనివాసరావు, సునీల్, రాజేందర్‌రావు, కవితకు వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరు పరుచగా న్యాయస్థానం రిమాండ్ విధించింది. సిఐడి వెల్లడించిన వివరాల ప్రకారం, శ్రీచక్ర క్రికెట్ క్లబ్ పేరుతో జగన్మోహన్‌రావు నకిలీ పత్రాలు సృష్టించారు. ఈ క్లబ్ ప్రెసిడెంట్‌గా ఉన్న కవిత, గౌలిపురా క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు, మాజీ మంత్రి సి. కృష్ణయాదవ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి ఆ పత్రాలను జగన్మోహన్‌రావుకు అందజేశారు. వాటిని ఆధారంగా చేసుకుని ఆయన హెచ్‌సిఎ ఎన్నికల్లో పోటీ చేసి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత హెచ్‌సిఎలో నిధుల దుర్వినియోగం జరిగిందని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిసిఎ) ప్రధాన కార్యదర్శి గురువారెడ్డి ఫిర్యాదు చేయడంతో తరువాయి 2లో

ఆధార్, ఓటర్, రేషన్ కార్డులూ

# గుర్తింపు కార్డులే

- బిహార్ ఇసికి సుప్రీంకోర్టు ఆదేశం
- ఎస్ఐఆర్ నిర్ణయంపై స్టే విధించేందుకు నిరాకరణ




**న్యూఢిల్లీ :** బిహార్ ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ( ఎస్ఐఆర్)ను 'రాజ్యాంగ ఆదేశంగా' పేర్కొంటూ కొనసాగించడానికి గురువారం సుప్రీంకోర్టు ఎన్నికల సంఘానికి అనుమతించింది.జస్టిస్ సుధాంశు ధులియా, జోయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం బిహార్‌లో ఎస్ఐఆర్ సమయంలో ఆధార్‌కార్డు, ఓటర్ ఐడి కార్డు, రేషన్‌కార్డులను గుర్తింపు కార్డుగా పరిగణించవచ్చనే ప్రాథమిక అభిప్రాయాన్ని వ్యక్తీకరించింది. ఈ ప్రక్రియ సమయాన్ని ద్విసభ్య ధర్మాసనంప్రశ్నించింది. 10 ప్రతి పక్ష పార్టీల నాయకులు సహా పిటిషనర్లు ఎవరూ ఎన్నికల సంఘం కసరత్తు పై మధ్యంతర స్టే విధించాలని పేర్కొంటూ ప్రార్థించలేదని, ధర్మాసనం పిటిషనర్ల బ్యాచ్‌పై స్పందన కోరింది. అనంతరం ఈ పిటిషన్లపై విచారణను జులై 28కి వాయిదా వేసింది. జులై 21లోగా భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) కౌంటర్ అఫిడవిట్ పిటిషన్లు దాఖలు చేయాలని, జులై 28లోగా రీజాయిండర్లను తప్పకుండా దాఖలు తరువాయి 2లో

# ఎల్ఐసిలో మరోసారి వాటాల విక్రయం

- రెండేళ్ళలో దశలవారీగా పెట్టుబడుల ఉపసంహరణకు సిద్ధమైన కేంద్రం
- విషయం తెలియగానే మార్కెట్లో క్షీణించిన షేర్ల ధర




**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం వనరుల సేకరణలో భాగంగా ప్రభుత్వరంగ దిగ్గజం జీవిత బీమా సంస్థ (ఎల్ ఐ సి)లో పెట్టుబడుల ఉపసంహరణకు సిద్ధపడింది. మరోసారి ఎల్ ఐసి వాటాలు విక్రయించేందుకు ఆమోదం తెలిపింది. 2026 ఆర్థిక సంవత్సరంలో అతిపెద్ద పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియలో భాగంగా ఈ బృహత్తర ప్రణాళికకు కేంద్రం పచ్చజెండా ఊపింది. ప్రస్తుత మార్కెట్ విలువను దృష్టిలో పెట్టుకుని రాబోయే రెండు సంవత్సరాలలో దశలవారీగా ఈ పెట్టుబడుల ఉపసంహరణ కార్యక్రమం జరుగుతుంది. వాటాలు విక్రయిస్తారన్న వార్త బయటకు రాగానే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో గురువారం ఉదయం ఎల్ఐసి షేర్లు 1.23 శాతానికి పడిపోవడంతో స్టాక్ మార్కెట్‌లో ధర రూ.934.35కు తగ్గింది. ఇప్పటివరకూ బహిరంగ పెట్టుబడిదారుల వాటా ఐపిఓ ధర రూ.949లకు సమీపంలో ఉంది. 2025లో 5.5 శాతం మేరకు మాత్రమే లాభపడింది. కానీ గడచిన 52 వారాలలో ఈ ధర భారీగా రూ.1,222లుగా ఉండేది. ప్రభుత్వ ఆమోదం తర్వాత ఈ ధర పడిపోయి ఎల్ఐసి ఐసిఓ షేరు చిక్కిపోయింది. ఐతే ఎల్ ఐ సి లో ఎంత వాటా విక్రయిస్తారు? అందుకు ముహూర్తం ఎప్పుడు? అనే విషయాలను తదుపరి వారాలలో తెలియజేస్తారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఎల్ ఐ సి మార్కెట్ వాటా రూ.6,00,000 కోట్లుగా ఉంది. అంటే దీని అర్థం ప్రతి ఒక్క శాతం వాటా అమ్మకానికి ఆఫర్ ఆఫ్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద దాదాపు రూ.6000 కోట్లు వస్తాయి. ఈ లెక్కన వచ్చే ఆర్థిక సంవత్సరంలో భారీ ఎత్తున కేంద్ర ప్రభుత్వానికి ఈ పెట్టుబడుల ఉపసంహరణవల్ల అనేక తరువాయి 2లో

# సినీ సెలబ్రిటీలపై ఇడి కేసు

బెట్టింగ్ యాప్ వ్యవహారంలో 29 మందిపై చర్యలు

ప్రజాపక్షం/హైదరాబాద్



ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల ప్రచారానికి సంబంధించిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) రంగంలోకి దిగింది. ఏకంగా 29 మంది సినీ ప్రముఖులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, కంపెనీలపై మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) కింద కేసులు నమోదు చేసింది. ప్రముఖ నటులు విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి, ప్రకాశ్‌రాజ్, మంచు లక్ష్మి , నిధి అగర్వాల్, అనన్య నాగళ్ల మరికొందరిపై కేసు నమోదు చేశారు. ప్రముఖుల పేర్లు ఈ జాబితాలో ఉండటం టాలీవుడ్‌లో తరువాయి 2లో

## కాళేశ్వరం వద్ద ప్రాణహిత పరవళ్ళు

- గోదావరి ఉగ్రరూపం
- తీరంవద్ద 10.520 మీటర్లకు చేరిన నీటి మట్టం

ప్రజాపక్షం/కాళేశ్వరం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద గురువారం గోదావరి పరవళ్ళు తొక్కుతోంది.గత కొద్ది రోజులుగా ఎగువలోని మహారాష్ట్ర ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ నుండి ప్రవహిస్తున్న ప్రాణహిత వరద నీరు పోటెత్తి త్రివేణి సంగమం వద్ద గోదావరిలో చేరుతుండటంతో గోదావరి నిండుకుండలా మారి ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తోంది. పుష్కర ఘాట్ తీరం వద్ద వరద ఉధృతి తరువాయి 2లో

# ప్రైవేటు స్కూల్ బస్సు దగ్ధం

- విద్యార్థులకు తృటిలో తప్పిన ప్రమాదం
- సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో ఘటన

ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి



అమీన్‌పూర్‌లో స్కూల్ బస్సు దగ్ధం అయ్యింది. ఈ ఘటనలో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేటలో ఓ ప్రైవేటు స్కూల్ బస్సు అగ్ని ప్రమాదానికి గురై దగ్ధమైంది. ఉదయం బస్సు కిష్టారెడ్డి పేట కళ్యాణి ఎస్టేట్ వద్ద స్కూల్ పిల్లలను ఎక్కించుకోవడానికి అపార్ట్‌మెంట్ వద్దకు వెళ్లింది. అక్కడ తరువాయి 2లో

ఇప్పటికైనా మణిపూర్‌కు వెళ్లేందుకు

## సమయం దొరుకుతుందా?

ప్రధాని మోదీని నిలదీసిన కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** ఐదు దేశాల పర్యటన నుండి స్వదేశానికి తిరిగి వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ఇప్పుడు ఆయన విదేశాల నుంచి తిరిగి వచ్చారని, మణిపూర్‌ను సందర్శించడానికి, పహల్గామ్ ఉగ్రవాదులను ఇంకా ఎందుకు శిక్షించలేదో సమీక్షించడానికి, తన సొంత రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కూలిపోవడంపై ఆలోచించడానికి సమయం దొరుకుతుందని భావిస్తున్నట్లు పేర్కొంది. రానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశానికి ఎజెండాను నిర్ణయించడానికి ప్రధాని అఖిలపక్ష సమావేశానికి కూడా అధ్యక్షత తరువాయి 12లో

10 మంది బందీల విడుదలకు

## హమాస్ అంగీకారం

- చర్చల్లో ఫలించిన మధ్యవర్తి దేశాల యత్నం
- సమస్యలు పూర్తిగా అధిగమించే ప్రయత్నం చేస్తున్నట్లు హమాస్ ప్రకటన



**జెరూసలెం:** గాజాలో కాల్పుల విరమణ ఒప్పంద చర్చల్లో భాగంగా పదిమంది బందీల విడుదలకు హమాస్ ఎట్టకేలకు అంగీకరించింది. నెలరోజులుగా జరుగుతున్న చర్చల ప్రక్రియలో మధ్యవర్తి దేశాల ప్రయత్నం ఫలించింది. శాంతియత్నాల్లో భాగంగా హమాస్ అయిష్టంగానే అంగీకరించింది. ఇజ్రాయెల్ రాజీపడకుండా మొండితనంగా వ్యవహరిస్తోందని, ఈ పరిస్థితుల్లో చర్చలు కష్టంగా మారాయని చెప్పిన హమాస్, సమస్యలను పూర్తిగా అధిగమించే ప్రయత్నం చేస్తున్నామని ప్రకటించింది. ఐక్యరాజ్యసమితి, దాని భాగస్వామ్య సంస్థల ద్వారా ధారాళంగా ఆహార, ఇతర మానవతా సహాయం సరఫరాతోపాటు, ఇజ్రాయెల్ సైనికులు వైదొలగినప్పుడే గాజాలో నిజమైన తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## క్యూ లైన్లో నిలబడితే చంపేశారు

**గాజా:** గాజాలో పాలస్తీనియన్ల పరిస్థితి అత్యంత దయనీయస్థితికి దిగజారింది. పోషకాహార సప్లిమెంట్స్ తీసుకోవడానికి న్యూట్రిషన్ క్లినిక్ వద్ద క్యూ లైన్‌లో నిలబడిన అమాయక సామాన్య ప్రజలు 15 మందిని ఇజ్రాయెల్ సైనికులు కాల్చి చంపేశారు. వీరిలో ఇద్దరు మహిళలు, ఎనిమిది మంది పిల్లలు ఉన్నారు.సెంట్రల్ గాజాలోని ఒక క్లినిక్ వద్ద గురువారంనాడు ఈ ఘటన జరిగింది. డైర్ అల్ బలాహ్ మార్టైర్స్ ఆసుపత్రివర్గాలు తీసిన ఒక వీడియోలో పిల్లలు, మహిళలు రక్తపు మడుగులో పడిఉన్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. అమెరికా కేంద్రంగా పనిచేసే ప్రాజెక్ట్ హోప్ ఎయిడ్ గ్రూపు ఈ పోషకాహార క్లినిక్‌ను నడుపుతోంది. ఈ కాల్పులు అంతర్జాతీయ చట్టాలను పూర్తిగా ఉల్లంఘించినట్టేనని మానవహక్కుల సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. అదేవిధంగా గాజాలో మరో చోట జరిగిన దాడుల్లో 37 మంది పాలస్తీనియన్లు మరణించారు.



## ఎర్రసముద్రంలో మరో నౌకను పేల్చేసిన హౌతీలు



### ముగ్గురు మృతి,అనేకమంది కిడ్నాప్

**సనా :** యెమెన్ కేంద్రంగా పనిచేస్తున్న హౌతీ ఉగ్రవాదులు వారం రోజుల వ్యవధిలో ఎర్ర సముద్రంలో మరో నౌకను పేల్చేశారు. ఆ నౌక మునిగిపోయింది. నౌకలో ఉన్న వారికోసం గాలింపు జరుగుతున్న తరుణంలోనే ఇజ్రాయెల్‌లో విమానాశ్రయంపై కూడా హౌతీలు దాడి చేశారు. ఎర్రసముద్రంలో మునిగిపోయిన నౌక నుండి పదిమంది సిబ్బంది సురక్షితంగా బయటకు వచ్చినట్లు యూరోపియన్ మిషన్ గురువారం ఉదయం ప్రకటించింది. ఇజ్రాయెల్‌కు సరుకులు తీసుకువెళుతున్న ఈ నౌకను పేల్చివేసి నీట ముంచేశామని, నౌకలో ఉన్న అనేకమందిని కిడ్నాప్ చేసి సురక్షితంగా గుర్తు తెలియని ప్రాంతానికితరలించినట్లు హౌతీలు ప్రకటించారు. వీరిలో రష్యా, అమెరికా, ఫిలిప్పీన్స్ దేశాల పౌరులు, సిబ్బంది ఉన్నారు. కిడ్నాప్ ఘటనపై యెమెన్‌లో అమెరికా దౌత్య కార్యాలయం తీవ్రంగా స్పందించింది. వెంటనే అందరినీ విడుదలచేయాలనిహెచ్చరించింది. బుధవారం రాత్రంగా సిబ్బందికోసం సముద్రంలో గాలించి అనేకమందిని కాపాడారు. అటుగా వెళుతున్న ఒక వాణిజ్య నౌక 22 మందిని కాపాడింది. ఈ నౌకను పేల్చివేసిన ఘటనలో ముగ్గురు నావికాదళ సిబ్బంది మరణించారు. 2023లో హౌతీలు ఎర్ర సముద్రంలో, గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌లో 70 వాణిజ్యనౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేశారు. అమెరికా దాడులవల్ల నష్టపోయిన యెమెన్‌లోని హౌతీలు, ఎర్ర సముద్రంలో దాడులు ఆపేస్తామని, కాల్పుల విమరణ పాటిస్తామని ఈ ఏడాది మే నెలలో ప్రకటించారు. కానీ ఇరాన్‌పై అమెరికా,ఇజ్రాయెల్ ఇటీవల దాడులు చేశాక, ఎర్రసముద్రంలో దాడులు ఉధృతం చేస్తామని, ఎవ్వరినీ వదిలిపెట్టేదిలేదని శపథం చేశారు. ఇప్పటివరకూ హౌతీలు నాలుగు నౌకలను ధ్వంసం చేశారు. మరో నౌకను స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురు సిబ్బందిని హత్యచేశారు.పాలస్తీనియన్లకుమద్దతుగాతాము పోరాటం చేస్తున్నట్లు వారు ప్రకటించారు. ఈ నేపథ్యంలో లైబీరియా జెండా తగిలించుకుని వెళుతున్న గ్రీకుల నిర్వహణలో ఉన్న 'ఎటెర్నిటీ సి'సరుకు రవాణా నౌకపై చిన్న చిన్న బోట్లలో వచ్చిన ఉగ్రవాదులు రాకెట్ల ద్వారా గ్రెనేడ్స్‌ను నౌకపై ప్రయోగించారు. నౌక పూర్తిగా ధ్వంసమై పోయి ఎర్రసముద్రంలో మునిగిపోయింది. ఈ వీడియో దృశ్యాలు ఇప్పుడు అందరికీ అందుబాటులోనే ఉన్నాయి. సోమవారం, మంగళవారం రెండు రోజులు ఈ దాడులు కొనసాగాయని బ్రిటన్‌కు చెందిన మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ ఏజన్సీ (యుకెఎంటిఓ) తెలియజేసింది.

### విమానాశ్రయంపై దాడి

హౌతీ ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌లోని బెన్ గుయెన్ విమానాశ్రయంపై దాడి చేశారు. ఎర్ర సముద్రంలో ఒక్కవారంలోనే రెండు నౌకలను పేల్చేసిన హౌతీలు ఆ దేశానికి ఊపిరిసలకుండా వెంటనే విమానాశ్రయంపై కూడా దాడి చేశారు. గాజాలో అమాయకులైన పాలస్తీనియన్లపై ఐ డి ఎఫ్ చేస్తున్న హింసాకాండకు ప్రతీకారంగా ఈ దాడులు చేస్తున్నట్లు హౌతీ ఉగ్రవాదులు ప్రకటించారు. ఎంతో పక్కా ప్రణాళికతో ఎర్ర సముద్రంలో నౌకలపైనా, విమానాశ్రయంపైనా దాడులు చేసినట్లు హౌతీ ప్రతినిధి యాహ్యా శారీ గురువారంనాడు చెప్పారు.

## హసీనా నేరాలపై వచ్చేనెల ఐసిటి విచారణ

### ప్రభుత్వతరపుసాక్షిగా మారేందుకు ఐజిపి అంగీకారం



**ఢాకా:** పదవీచ్యుతురాలైన బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనా మరో ఇద్దరిపై ఆ దేశ ఇంటర్నేషనల్ క్రైమ్ ట్రైబ్యునల్–1 (ఐసిటి) తీవ్ర నేరాభియోగాలు మోపింది. ఈ నేరాలపై ఆగస్టు 3,4 తేదీలలో విచారణజరుగుతుంది. హసీనాతోపాటు మాజీ హోంమంత్రి అసదుజ్జామన్ ఖాన్ కమాల్, మాజీ ఇన్‌స్పెక్టర్ జనరల్ చౌధురి అబ్దుల్లా అల్ మామున్‌లపై కూడా ఐసిటి నేరాశభియోగాలు మోపింది. మానవాళికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడినందుకుగాను మొదటిసారి ఈ విచారణ ప్రారంభం కానున్నది. ఈ కేసులో మామున్ ఒక్కరే కోర్టు ఎదుట వ్యక్తిగతంగా హాజరై తాను తప్పు చేయలేదని వాదిస్తున్నారు. కాగా మామున్ ప్రభుత్వానికి అనుకూలంగా మారిపోయి సాక్ష్యం ఇచ్చేందుకు అంగీకరించారని ఆయన తరపు న్యాయవాది గురువారంనాడు పాత్రికేయులకు తెలిపారు. జస్టిస్ మహ్మద్ మోర్తూజా మొజుందర్ సారథ్యానగల ముగ్గురు సభ్యులుగల న్యాయమూర్తుల ట్రైబ్యునల్ ఈ విచారణ చేస్తుంది. హసీనాసహా ముగ్గురమీదా మొత్తం ఐదు రకాల తీవ్ర నేరాభియోగాలు మోపారు. ఉద్యమకాలంలో సామూహిక హత్యాకాండ, ఉద్యమ సమయంలో విద్యార్థులను చిత్రహింసలకు గురిచేయడం ఈ అభియోగాలలో ప్రధానమైనవి. ఈ నేరాభియోగాలు రుజువైతే ఈ ముగ్గురికీ ఉరిశిక్షలు పడతాయి. ఐక్యరాజ్యసమితి మానవహక్కుల సంస్థ సమర్పించిన నివేదిక ప్రకారం, గత ఏడాది జులై 15 నుండి ఆగస్టు 15 వరకూ 1400 మంది విద్యార్థులు, ప్రజలను హసీనా ప్రభుత్వం ఊచకోత కోసింది. ఆరోపణలను తిరస్కరిస్తూ డిఫెన్స్ లాయర్ కోర్టులో దాఖలు చేసిన విజ్ఞప్తిని జస్టిస్ మొజుందర్ తోసిపుచ్చారు. గత ఏడాది జులైలో జరిగిన విద్యార్థుల తిరుగుబాటులో 1400 మందిని నిర్దాక్షిణ్యంగా చంపారన్నది ప్రధాన నేరం. తమ ముందు హాజరుకావాలని బంగ్లాదేశ్ న్యాయస్థానం ఇప్పటికే రెండుసార్లు హసీనాకు నోటీసులు జారీ చేసింది. కోర్టు ఉల్లంఘన నేరం కింద ఇప్పటికే ఆమెకు ఆరునెలలు జైలుశిక్ష పడింది. బంగ్లాదేశ్ ప్రభుత్వం కూడా హసీనాను తమకు స్వాధీనం చేయాలని పదే పదే భారతదేశానికి విజ్ఞప్తులు చేస్తోంది. తాజాగా ఆ దేశ తాత్కాలిక అధిపతి యూనుస్ తన మీడియా కార్యదర్శి ద్వారా సోషల్ మీడియాలో మరోసారి ఒక ప్రకటన అప్‌లోడ్ చేశారు.

## దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడి అరెస్టుకు కోర్టు ఆదేశం



**సియోల్ :** దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌ను అరెస్టు చేయాలని ఆ దేశ ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. దేశంలో మార్షల్ లా విధించి కుట్రపూరిత చర్యలకు పాల్పడ్డారన్న అభియోగంపై దక్షిణ కొరియా పార్లమెంటు 204–96 మెజారిటీ తీర్మానం ద్వారా యూన్ సుక్ యోల్‌ను పదవీచ్యుతుణ్ణి చేసింది. తర్వాత కోర్టు కేసు ఎదుర్కొన్నారు. న్యా యస్థానం ఈ కేసు దర్యాప్తు చేసిన స్వతంత్ర ప్రత్యే క కౌన్సిల్ బృందం న్యాయవాది చో యున్ సుక్ చేసిన అభ్యర్థనను అంగీకరించిన సెంట్రల్ డిస్ట్రిక్ట్ కోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. కౌన్సిల్ బృం దం అధికార ప్రతినిధి గురువారం ఉదయమే ఆయనఅరెస్టువారెంటు విషయాన్ని ప్రకటించారు. న్యాయాన్నిఅడ్డుకోవడం,నకిలీ అధికార ఉత్తర్వుల తయారీ,అధికార దుర్వినియోగం వంటి అంశాలపై ఈ దర్యాప్తు జరిగింది. గత ఏడాది డిసెంబరు మూడో తేదీన మార్షల్ లా ప్రకటనకు ముందుగా జరిగిన సమావేశం నుండి మంత్రివర్గ సభ్యులను రాకుండాచేసివారి హక్కులను హరించారని, తప్పు డు ప్రచారాలు చేయాలని విదేశీ మీడియాకుఆ దేశాలిచ్చారన్న ఆరోపణలపై దర్యాప్తు జరిగింది. ఈ ఏడాది జనవరి నెలలో తన అరెస్టును అడ్డుకోవడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేయాలని, కాల్ రికార్డుల నుండి సమాచారాన్ని తొలగించాలన్న ఆదేశాలు వంటి అనేక అంశాలపై దర్యాప్తు జరిగింది. ఈ ఏడాది జూన్ 18న ప్రత్యేక బృందం దర్యాప్తు ప్రారంభించింది. దేశంలో ప్రతిపక్షాలు పొరుగున ఉత్తర కొరియాతో సంబంధాలు పెట్టుకుని దేశ ద్రోహానికి పా ల్పడుతున్నాయని ఆయన తొలుత ఆరోపించారు. తర్వాత దేశంలో మార్షల్ లా విధించారు. కానీ కొద్ది గంటల వ్యవధిలోనేఆ ఉత్తర్వులనువెనక్కు తీసుకున్నారు. దేశం లోను, కూటమి పార్టీలోనూ అంతర్గతంగా వ్యతిరేకత వచ్చింది. ప్రతిపక్షాలు కోర్టును ఆశ్రయించాయి.

## ట్యునీషియా ప్రతిపక్షనేత సహా 21 మంది ప్రముఖులకు జైలుశిక్ష

**ట్యునిస్:**దేశద్రోహనేరంపైట్యునీషియాలో సీనియర్ ప్రతిపక్ష నాయకుడు రాచెడ్ ఘనౌచీ, ఇతర రాజకీ్ర ప్రముఖులు 21 మందికి న్యాయస్థానం 14 నుండి 12 సంవత్సరాలుపాటుజైలుశిక్ష విధించింది. పరారీలో ఉన్న ఘనౌచీ కుమారుడు మోజ్ ఘనౌచీ సహా అనేకమంది ప్రముఖులకు 35సంవత్సరాలువంతున శిక్షలు ప్రకటించింది. టైమ్స్ పత్రిక 2012లో ఎంపిక చేసిన ప్రపంచంలో అత్యంత ప్రభావశీలమైన100మందివ్యక్తుల జాబితాలో ఘనౌచీని కూడా ఉన్నారు. ప్రస్తుతం ఆయన వయసు84సంవత్సరాలు. రాజకీయ స్వప్రయోజనాలకోసం, దురుద్దేశంతోనే అనేకమందికి కోర్టుశిక్షలు విధించిందని పలు పార్టీలనాయకులు,ప్రముఖులువిమర్శలు చేస్తున్నారు.దేశంలో సద్విమర్శలను, మానవహక్కుల వ్యతిరేక చర్యలను ప్రశ్నించేవారిని భయపెట్టి వారిగొంతు నొక్కడం కోసమే ఇలాంటి తీర్పులు చెప్పారని విమర్శలు వెల్లువెత్తాయి. అధికారులు ఈ విమర్శలను తిరస్కరించారు. దేశాధ్యక్షుడు సయీద్ పార్లమెంటును రద్దుచేసి కొత్త రాజ్యాంగం రాసేందుకు వరుస ప్రయత్నాలు జరిగాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఇదేవిధంగా 40 మందిపై విచారణలు జరిపి నాలుగు నుండి 66 సంవత్సరాల పాటుకోర్టు శిక్షలు విధించింది. ఎన్నాహ్దా పార్టీ సహ వ్యవస్థాపకుడు,జాతీయ అసెంబ్లీ మాజీ స్పీకర్ (2019–2021)గా పనిచేసినఘనౌచీతో సహ నిందితులుగా ఉన్న పలువురురాజకీయప్రముఖులకు, ప్రభుత్వ అధికారులకు రెండోవిడత తీర్పుల్లో 12 ఏళ్ళు వంతున జైలు శిక్షలు పడ్డాయి.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్‌రావుకు ఉచ్చు బిగిస్తున్న సిట్

### అరెస్ట్‌పై స్టే ఎత్తివేయాలని సుప్రీంకోర్టుకు సిట్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మరింత వేగవంతం చేసింది. ఈ కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎ1 నిందితుడు ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్ రావు విషయంలో సిట్ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆయనకు సుప్రీంకోర్టు ఇచ్చిన అరెస్టు మినహాయింపులను రద్దు చేయాలని కోరుతూ ఢిల్లీ బాట పట్టారు. ఈ కేసు విచారణలో భాగంగా వెస్ట్ జోన్ డిసిపి విజయ్ కుమార్, ఎసిపి వెంకటగిరితో కూడిన సిట్ బృందం ఢిల్లీకి చేరుకుంది. ప్రభాకర్ రావు విచారణకు ఏమాత్రం సహకరించడం లేదని, ఆయనను కస్టడీలోకి తీసుకుని విచారిస్తేనే కీలక వాస్తవాలు వెలుగులోకి వస్తాయని సిట్ భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆయన అరెస్ట్‌పై ఉన్న స్టేను ఎత్తివేయాలని కోరుతూ గురువారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసేందుకు సిద్ధమైంది. ఇప్పటికే ఐదుసార్లుగా దాదాపు 40 గంటల పాటు ప్రభాకర్ రావును సిట్ అధికారులు ప్రశ్నించారు. అయితే, ప్రతిసారీ ఆయన పొంతనలేని సమాధానాలు ఇస్తూ దర్యాప్తును తప్పుదోవ పట్టిస్తున్నారని అధికారులు పేర్కొంటున్నారు. పై అధికారుల ఆదేశాల ప్రకారమే తాను నడుచుకున్నానని ఆయన చెబుతుండగా, ఆయన ఆదేశాలతోనే తాము ఫోన్ ట్యాపింగ్ చేశామని ఇప్పటికే అరెస్టయిన ఇతర నిందితులు వాంగ్మూలం ఇచ్చారు.ఈ వైరుధ్యాల నేపథ్యంలో, ఆగస్టు 5 వరకు ప్రభాకర్ రావును అరెస్ట్ చేయరాదన్న సుప్రీంకోర్టు ఉత్తర్వులను రద్దు చేయించడం ద్వారా, కస్టోడియల్ విచారణకు మార్గం సుగమం చేసుకోవాలని సిట్ అధికారులు యోచిస్తున్నారు.

## కమ్యూనిస్టులకు ఎదురే ఉండదు

(మొదటి పేజీ తరువాయి)

ఇదే చార్మినార్ అన్నారు. పెద్దలు నిర్మించిన భవనంలో పురావాస్తు లాంటి జ్ఞాపకాలు ఉండాలనే ఉద్దేశంతోనే ఈ భవనాన్ని పునర్ నిర్మితం చేశామని కూనంనేని సాంబశివరావు వివరించారు. మఖ్దూంభవన్ పునర్ నిర్మితం పూర్తికావడంతో కమ్యూనిస్టు నాయకులు రాజ్‌బహదూర్ గౌర్ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించామని ఇందుకు సహాయ సహకారాలు అందజేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి కోరినట్లు తెలిపారు. ఇందుకు సహకరించాలని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌కు మరోసారి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మావోయిస్టులతో ప్రభుత్వం శాంతిపూర్వక చర్చలు నిర్వహిస్తే, దేశానికి ఒక మంచి సందేశాన్ని పంపించినట్టుగా ఉంటుందని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌కు సూచించారు. ఏమాత్రం అవకాశం ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపడం లేదని మండిపడ్డారు.

## స్థానిక ఎన్నికలకు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలోనే మొదటి సారి మంత్రివర్గ నిర్ణయాలపై సమీక్షిస్తున్నామని తెలిపారు. ప్రతి నెలకు రెండు సార్లు మంత్రివర్గ సమావేశాలు, ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆరు క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలు, వాటి అమలు తీరుపైన సమీక్షించాలని నిర్ణయం తీసుకున్నట్టు పొంగులేటి పునరుద్ఘాటించారు. బిసిరిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం సిఎం, మంత్రులు ఢిల్లీలో అధికారులును, మంత్రులతో చర్చించినట్టు వివరించారు. ఆ కమిటీ విద్యా సంస్థతో పాటు, సెంట్‌నరీ రియాబిలిటేషన్ విద్యా సంస్థను విశ్వవిద్యాలయంగా గుర్తింపు కల్పించామని, అమితి యూనివర్సిటీలో తెలంగాణ రాష్ట్రానికి 50 శాతం సీట్లను కేటాయించాలని యాజమాన్యాన్ని ఒప్పించామని వివరించారు. గత ప్రభుత్వం వ్యక్తిగత లబ్ధి, స్వార్థం కోసం ఆలోచించిందని, అందుకే పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులలో రెండు నుంచి నాలుగు శాతం పెండింగ్ ప్రాజెక్ట్ పనులను చేపట్టలేదని ఆరోపించారు.

**బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు చారిత్రాత్మక నిర్ణయం : మంత్రి పొన్నం**

బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బిసిలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేసేందుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నందుకు బలహీనవర్గాల తరపున మంత్రివర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. 42 శాతం రిజర్వేషన్ల అమలు నిర్ణయం చారిత్రాత్మకమన్నారు. ప్రజాప్రభుత్వం వచ్చిన తర్వాత 60 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, మార్చిలోపు లక్ష ఉద్యోగాలు ఇవ్వాలని ప్రభుత్వ ఆలోచన అని అన్నారు.

**రూ.122కోట్లతో 82కోట్ల చేపలు : మంత్రి శ్రీహరి...**

పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్రంలోని చెరువులలో 82కోట్ల చేపలను వేసేందుకు ప్రతేకంగా రూ.122 కోట్ల బడ్జెట్‌ను కేటాయించామన్నారు. ప్రతి చెరువులో చేప పిల్లలను వదిలే కార్యక్రమంలో అందరినీ బాగస్వాములు చేస్తామన్నారు.

మత్స్యశాఖను గత ప్రభు త్వం నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. ప్రభు త్వం గోశాల పాలసీని తీసుకొస్తుందని, ఇప్పటికే తాను రాష్ట్రంలోని ఐదు, ఆరు గోశాలలను సందర్శించి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేశానని వివరించారు. గోశాలలో అవులకు సరైన ఆహా రం, నీళ్ల కావాల్సిన స్థలాలు లేవని వివరించారు. కొన్ని అవులకు కొమ్ములు విరిగి ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో మొత్తంగా 300 గోశాలలను గుర్తించామని, మంత్రివర్గంలో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారని వివరించారు.

**మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయాలు...**

* స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అందుబాటులో ఉన్న ఎంపిరికల్ డేటా ఆధారంగా, జనాభా ప్రకారం బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసేందుకు తదుపరి చర్యలు చేపట్టాలని తీర్మానించింది. రిజర్వేషన్లను ఖరారుకుగాను గ్రామ పంచాయతీ సర్పంచ్, ఎంపిటిసిలకు మండలం యూనిట్‌గా, ఎంపిపి, జెడ్‌పిటిసిలకు జిల్లా యూనిట్‌గా, జెడ్‌పి చైర్మన్లకు రాష్ట్రం యూనిట్ గా పరిగణించాలని నిర్ణయం. రిజర్వేషన్ల పెంపునకు అనుగుణంగా రాష్ట్రంలో ప్రస్తుతం అమలులోఉన్న పంచాయతీరాజ్ చట్టం 2018 సవరణకు అవసరమైన చర్యలు చేపట్ట నుంది.

* రాష్ట్రంలో కొత్తగా ఎమిటీ యూనివర్సిటీ, సెయింట్ మేరీ రిహాబిలిటేషన్ యూనివర్సిటీలకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

* సంగారెడ్డి జిల్లాలో ఇటీవల కొత్తగా మున్సిపాలిటీగా ఏర్పడిన జిన్నారం, ఇంద్రీశం మున్సిపాలిటీల పరిధిలో చేర్చే 18 గ్రామ పంచాయతీలను డీ లిస్టింగ్ చేసేందుకు మంత్రివర్గం ఆమోదం.

* రాష్ట్రంలో అధునాతనంగా గోశాలల ఏర్పాటు, నిర్వహణపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ముగ్గురు అధికారులతో కమిటీ ఏర్పాటు. రానున్న మంత్రివర్గ సమావేశంలోపు కమిటీ తమ నివేదికను అందించాలని గడువు నిర్ణయించింది.

* రాష్ట్రంలో 306 గోశాలలు ఉన్నాయి. హైదరాబాద్‌లో ఎన్కేపల్లి, వెటర్నరీ యూనివర్సిటీ, వేములవాడ, యాదగిరిగుట్టలో అత్యాధునికంగా గోశాలలు నిర్మాణాలకు నిర్ణయం. అలాగే రాష్ట్రంలో ఉన్న గోశాలల రిజిస్ట్రేషన్లు, వాటి నిర్వహణపై సమగ్ర విధానపత్రం రూపొందించాలని నిర్ణయం.

* రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయం

* ఏ ఏడాదిన్నర వ్యవధిలో రాష్ట్ర ప్రభుత్వం 60 వేల ఉద్యోగాలను ఇప్పటికే భర్తీ చేసింది. వీటితో పాటు మరో 17084 ఉద్యోగాల నియామక ప్రక్రియ వివిధ దశల్లో ఉన్నందున, కొత్తగా 22, 033 ఉద్యోగాలకు త్వరలో నోటిఫికేషన్లు ఇవ్వాలని మంత్రివర్గంలో చర్చ.

* వివిధ విభాగాల్లో పని చేస్తున్న ప్రతి అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల పనితీరును సమీక్షించేందుకు వీలుగా వారి ఆధార్, పూర్తి వివరాలు సేకరించాలని ఆర్థికశాఖకు ఆదేశాలు.

* ప్రభుత్వ ఉద్యోగుల హాజరుతో పాటు విధినిర్వహణలో జవాబుదారీతనం పెంచేందుకు అవసరమైన సంస్కరణలు తీసుకురావాలని అధికారులను ఆదేశించిన సిఎం రేవంత్‌రెడ్డి. ఇప్పటికే ఉద్యోగులకు సంబంధించి నియమించిన అధికారుల కమిటీకి ఈ బాధ్యత అప్పగించాలని నిర్ణయం. రెండు నెలల్లో పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని ఆదేశాలు.

## ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం: టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలుపై టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో హర్షంవ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మకంగా 42 శాతం బిసి రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికల వైపు అడుగుపెట్టడం ఒక విప్లవాత్మక నిర్ణయం అని ఆయన పేర్కొన్నారు. గురువారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో బిసి రిజర్వేషన్ల అమలుకు అవసరమైన ఆర్డినెన్స్ తీసుకురావాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన స్వాగతించారు. 2018 చట్టాన్ని సవరించి బిసిలకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వం చేసిన ప్రకటనను ఆయన 'సామాజిక విప్లవానికి నాంది'గా అభివర్ణించారు. ఎఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో చేసిన 'జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచాలి' అన్న డిమాండ్‌ను దేశంలో తొలిసారిగా తెలంగాణ రాష్ట్రంలోనే అమలు చేస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని అమలు పరచేందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క కి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

## సెలబ్రిటీలపై ఇడి కేసు (మొదటి పేజీ తరువాయి)

కలకలం రేపుతోంది. గతంలో సైబరాబాద్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను ఆధారంగా చేసుకుని ఇడి ఈ దర్యాప్తును చేపట్టింది. ఈ సెలబ్రిటీలు భారీ మొత్తంలో పారితోషికాలు తీసుకుని, నిషేధిత బెట్టింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలంటూ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేశారన్నది ప్రధాన ఆరోపణ. వీరి ప్రచారం కారణంగా ఎంతోమంది యువత ఈ యాప్‌ల బారిన పడి, ఆర్థికంగా చితికిపోయి ఆత్మహత్యలకు పాల్పడ్డారని పోలీసుల ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఈ కేసులో యాంకర్లు శ్రీముఖి, వర్షిణి సౌందరరాజన్, సిరి హనుమంతుతో పాటు పలువురు బుల్లితెర నటులు, యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల పేర్లను కూడా చేర్చారు. తెలంగాణ గేమింగ్ చట్టం, ఐటీ చట్టంలోని వివిధ సెక్షన్ల కింద హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేయగా, ఇప్పుడు ఈడీ దర్యాప్తుతో ఈ కేసు మరింత తీవ్రరూపం దాల్చింది. త్వరలోనే వీరందరినీ విచారణకు పిలిచే అవకాశం ఉందని తెలుస్తోంది.

## ప్రాణహిత పరవళ్ళు (మొదటి పేజీ తరువాయి)

భారీగా పెరిగి స్నాన ఘట్టాలను ముంచెత్తి ప్రవాహ వేగం కొనసాగుతోంది.పుష్కర ఘాట్ తీరం వద్ద భారీ ఎత్తున వరద నీరు చేరి సరస్వతీ పుష్కర ఘాట్ తీరం జ్ఞాన దీపం గద్దెలను చుట్టు ముట్టి, పూర్తి స్థాయిలో స్నాన ఘట్టాలను ముంచెత్తి ప్రవహిస్తోంది. ప్రధాన పుష్కర ఘాట్ తీరం వద్ద గురువారం సాయంత్రానికల్లా నీటి మట్టం 10.520 మీటర్ల ఎత్తుకు చేరుకొని 6.36 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం దిగువకు తరలి పోతున్నాయి. ఎగువ నుండి ప్రాణహిత వరద ఉధృతి ఇలాగే కొనసాగితే తెల్లారేసరికి మొదటి ప్రమాద స్థాయికి చేరుకునే అవకాశాలు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రాణహిత వరద ఉధృతి భారీ స్థాయిలో పెరుగుతుండటంతో అధికార యంత్రాంగం గోదావరి పరివాహక లోతట్టు ప్రాంతాలను అప్రమత్తం చేస్తున్నారు.

## బస్సు దగ్ధం (మొదటి పేజీ తరువాయి)

పిల్లలను బస్సు ఎక్కించే సమయంలో బస్సు కింద మంటలు వచ్చినట్లు అక్కడ ఉన్న వాచ్‌మెన్ గమనించి డ్రైవర్‌కు సమాచారం అందించాడు. వెంటనే అప్రమత్తమైన బస్సు డ్రైవర్ అందులో ఉన్న పిల్లలందరిని కిందకు దింపివేశారు. డ్రైవర్ సహాయకుడి చాకచక్యంతో పెను ప్రమాదం తప్పినట్లు అయింది. ఫైర్ ఇంజన్ వచ్చి మంటలు ఆర్పివేసింది. ఎవరికి ఏలాంటి ప్రమాదం జరగక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## జగన్మోహన్‌రావుకు రిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ మోసంలో జగన్మోహన్‌రావుకు హెచ్‌సిఎ కోశాధికారి శ్రీనివాసరావు, సిఇఓ సునీల్ సహకరించినట్లు దర్యాప్తులో తేలిందని సిఐడి పేర్కొంది. దీంతో జగన్మోహన్‌రావు, శ్రీనివాసరావు, సునీల్, రాజేందర్ యాదవ్‌తో పాటు ఫోర్జరీకి పాల్పడిన కవితను కూడా అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు.

## వాటాల విక్రయం

(మొదటి పేజీ తరువాయి)

దశల్లో వేలకోట్ల రూపాయల ఆర్థిక వనరులు సమకూరుతాయి. ఆర్థిక వనరుల సేకరణ మాత్రమే కాకుండా, సెబీ (సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా) నిబంధనల లక్ష్యాన్ని పూర్తిచేయడం కూడా దీని వెనుక ఉద్దేశ్యమని కేంద్రం చెబుతున్నది. సెబీ ప్రకారం 75 శాతం వాటాకు మాత్రమే కేంద్రం పరిమితం కావాల్సి ఉంటుంది. దాన్ని తీసేస్తే రూ.1.28 లక్షలకోట్ల వాటా ఉంటుంది. వీటిని స్వేచ్ఛగా పెట్టుబడుల్లో సమకూరుస్తారు. వీటిల్లో 1.13 శాతం మ్యూచ్యువల్ ఫండ్స్‌లో ఉంటే, 1.67 శాతం వాటాతో 23 లక్షలమంది పైగా రిటైల్ షేర్ హోల్డర్లు ఉంటారు. ప్రస్తుతం ప్రభుత్వానికి జీవిత బీమా సంస్థలో 96.5 శాతం వాటా ఉంది. ప్రజలవాటా 3.5 శాతం ఉండగా 2027 నాటికి ప్రజల వాటాను కనీసం 10 శాతానికి పెంచాలని సెబీ ఇప్పటికే తన నిబంధనల నివేదికలో తెలియజేసింది. సెబీ నిబంధనల ప్రకారం ప్రజల వాటాను పదీ శాతానికి పెంచేందుకు వీలుగా పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియను త్వరలో ప్రారంభిస్తారు. ఇంతకుముందు మొదటిసారి ప్రభుత్వం 2022లో 3.5 శాతం వాటాను (ఎల్ ఐ సి–ఐపిఓ) విక్రయించి రూ.21,000 కోట్లు సేకరించింది. 2024–25 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో జీవిత బీమా సంస్థ అత్యంతబలమైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. మొత్తం ఆదాయం రూ.2.50 లక్షల కోట్ల నుండి రూ. 2.41లక్షల కోట్లకు తగ్గినప్పటికీ, నికర లాభాల్లో ఏడాదికి 38 శాతం మేరకు అంటే రూ.19,013 కోట్లు వృద్ధి సాధించింది. ఇన్వెస్టర్లకు ఎల్ ఐ సి బోర్డు రూ.12 లు షేరు ఫైనల్ డివిడెండ్‌ను ఇవ్వాలని ప్రతిపాదించింది. కేంద్ర ప్రభుత్వం జీవిత బీమా సంస్థలో భారీ వాటాను విక్రయించాలనుకోవడం భారత పెట్టుబడి ఉపసంహరణల ప్రయాణంలో ఒక కీలకమైన మైలురాయి. రిటైల్ భాగస్వామ్యాన్ని భారీ ఎత్తున పెంచాలని ప్రభుత్వం ఆశించిందని ప్రభుత్వ సానుకూల వర్గాలు విశ్లేషించాయి. మార్కెట్ నిబంధనలకు అనుగుణంగా ప్రభుత్వరంగం పనిచేయాలనే ఉద్దేశంతో కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం దలాల్ స్ట్రీట్‌లో ఉద్ధృత కార్యకలాపాలకు దారి తీస్తుందన్నది ప్రభుత్వ విశ్లేషకుల వాదన.

## గుర్తింపు కార్డులే

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని బెంచ్ సూచించింది. ఎన్నికల సంఘం అర్హతలను, ఈ కసరత్తును చేయడంలో ఎన్నికల సంఘం అధికారాలను అనుమానించడంలేదని ధర్మాసనం ఈ సందర్భంగా స్పష్టం చేసింది.ఇది రాజ్యాంగం ఆదేశం కానీ ప్రక్రియ సమయం సందేహాలను లేవనెత్తుతోందని బెంచ్ పేర్కొంది. 'మీ నిజాయితీని మేం అనుమానించడం లేదు కానీ కారణాలున్నాయి. ఇది రాజ్యాంగ బద్ధమైన విషయ కాబట్టి మిమ్మల్ని నిలువరించాలని మేం ఆలోచించడం లేదు' అని ఎన్నికల సంఘం తరుపున హాజరైన సీనియర్ న్యాయవాది రాకేష్ ద్వివేదీకి బెంచ్ తెలియజేసింది. ద్వివేదీ మాట్లాడుతూ 60శాతం మంది ఓటర్లు తమ అర్హతలను ధృవీకరించుకున్నారని చెప్పారు. విచారణకు హాజరు కాకుండా ఓటర్ల జాబితా నుంచి ఎవరి పేర్లను తొలగించబోమని న్యాయస్థానానికి హామీ ఇచ్చారని చెప్పారు. 'రాజ్యాంగం చేయాల్సిన పని చేయకుండా మేం ఆపలేం. అదే సమయంలో, వారు చేయకూడనిది ఏదైనా వారిని మేం చేయనివ్వం' అని ధర్మాసనం స్పష్టం చేసింది. పిటిషనర్ల వాదనను ప్రస్తావిస్తూ బిహార్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ కసరత్తు ప్రజాస్వామ్యానికి, ఓటు హక్కుకు మూలం కాబట్టి భారత ఎన్నికల సంఘం మూడు ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉన్నదని బెంచ్ పేర్కొంది. కాలక్రమేణా ఓటర్ల పేర్లను చేర్చడం లేదా తొలగించడం వంటి అంశాలను పరిశీలించడానికి ఓటర్ల జాబితాలను సవరించాల్సిన అవసరం ఉందని, దీన్ని చేయడానికి ప్రత్యేక సమగ్ర సవరణ మాత్రమే ఏకైక కసరత్తు' అని ఎన్నికల సంఘం తరుపు న్యాయవాది రాకేష్ ద్వివేదీ అన్నారు. ఎన్నికల జాబితాను సవరించడానికి భారత ఎన్నికల సంఘానికి లేకపోతే మరి ఎవరికి ఉందని ఆయన ప్రశ్నించారు. అయితే వాదనలు వినిపించే అవకాశం లేకుండా ఓటర్ల జాబితా నుంచి ఎవరినీ తొలగించబోమని ఎన్నికల సంఘం సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చింది. దీనికి ముందు, అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ అనే స్వచ్ఛంద సంస్థ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర్ నారాయణన్ తన వాదన వినిపిస్తూ ఓటర్ల జాబితాలను ప్రజా ప్రాతినిధ్యం కింద అనుమతించవచ్చని బెంచ్‌కు వివరించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS



మఖ్దూంభవన్ ను ప్రారంభిస్తున్న సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి





మఖ్దూం భవన్‌ను పరిశీలిస్తున్న సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



రీడింగ్ రూమ్‌లో సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శుల చిత్రాలను చూస్తున్న డి.రాజా



ఆధునీకరించిన సి. రాఘవాచారి గ్రంథాలయాన్ని పరిశీలన



ఆఫీస్ రూమ్‌లో రాష్ట్ర కార్యదర్శుల చిత్రాల వీక్షణ

సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరంకు స్వాగతం పలుకుతున్న డి.రాజా, కూనంనేని

# సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్ పునర్ నిర్మిత భవనం ఘనంగా ప్రారంభం

## ప్రారంభించిన సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర రెడ్డి

**ప్రజాపక్షం/స్టేట్ బ్యూరో :** సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్ పునర్ నిర్మిత భవనం ప్రారంభోత్సవం కనుల పండువగా జరిగింది. సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి పునర్ నిర్మిత భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా 4వ అంతస్తులోని తమ్మారెడ్డి సత్యనారాయణ సమావేశం హాల్‌ను ప్రారంభించారు. రాఘవాచారి పేరుతో ఏర్పాటు చేసిన లైబ్రరీ హాల్‌ను సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, మొదటి అంతస్తు ఏర్పాటు చేసిన కాన్ఫరెన్స్ హాల్‌ను సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా ప్రారంభించగా, డి.ఎస్.రామచంద్రరావు పేరుతో ఏర్పాటు చేసిన క్యాంటిన్ హాల్‌ను సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సిపిఐ అగ్రనేతలతోపాటు కాంగ్రెస్, వామపక్షాల నాయకులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గం, రాష్ట్ర కార్యవర్గం, కౌన్సిల్ సభ్యులతో పాటు పలువురు కమ్యూనిస్టు నాయకుల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, సిపిఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా, బాలచందర్ కాంగొ, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పశ్య పద్మ, అక్కినేని వనజ, జాతీయ కౌన్సిల్ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, సిపిఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, సిపిఐ (ఎంఎల్ ) న్యూడెమోక్రసీ నాయకులు వెంకటరామయ్య, సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హన్మేష్, ఆర్ఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి ఎ.జానకిరాములు తదితరులు ప్రసంగించారు. సభలో తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, ప్రముఖ సినీ నటులు ఆర్.నారాయణమూర్తి, మాదాల రవి, ప్రముఖ సినీ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, ప్రముఖ రచయిత సుద్దాల అశోక్ తేజ, కమ్యూనిస్టు సీనియర్ నాయకులు కందిమళ్ల ప్రతాపరెడ్డి, నవచేతన పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు ఏటూకురి ప్రసాద్, సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు కళవేణ శంకర్, వి.ఎస్. బోస్, ఇ.టి.నరసింహ, ఎం.బాలనరసింహా, బాగం హేమంతరావు, కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ ఆచార్య ఎస్.వి.సత్యనారాయణ, చంద్ర పూర్ణచందర్ రావు, మఖ్దూం మొహియుద్దీన్ తనయుడు జాఫర్ మొయినుద్దీన్ తదితరులు వేదికపై ఆశీనులయ్యారు.



**ఉత్సవ భరిత వాతావరణంలో..**

సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్ పునర్ నిర్మిత భవన ప్రారంభోత్సవం ఉత్సవ భరిత వాతావరణంలో జరిగింది. ప్రజలకోసం ప్రాణాలను అర్పించిన కమ్యూనిస్టు పార్టీ నాయకుల వారసులు, పార్టీ నేతల కుటుంబ సభ్యులు, గతంలో పార్టీలో ప్రజా సంఘాల్లో పనిచేసి వివిధ రంగాల్లో స్థిరపడిన పలువురు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. చాల కాలం తర్వాత కలుసుకోవడంతో ఒకరిని ఒకరు ఆత్మీయంగా పలికరించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మఖ్దూంభవన్‌తో ఉన్న గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. పార్టీ కోసం ప్రాణత్యాగం చేసిన పలువురి కమ్యూనిస్టు దిగ్గజాల ఫోటోలను ఏర్పాటు చేయడంతో వాటిని చూసిన వారి వారసులు వారిని గుర్తు చేసుకుని తీవ్రభావోద్వేగానికి గురయ్యారు.

### పలువురికి సన్మానం

మఖ్ధూంభవన్ పునర్ నిర్మిత భవనం ప్రారంభోత్సవం అనంతరం పలువురిని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా పునర్ నిర్మిత భవనాన్ని ప్రారంభించిన సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డిని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, జాతీయ కౌన్సిల్ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. అదే విధంగా ఇటీవల నూతనంగా తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి, ఎంఎల్‌సిగా ఎన్నికైన నెల్లికంటి సత్యం, కార్మికుల వేజ్ బోర్డు సభ్యులుగా ఎన్నికైన ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి.యూసుఫ్, తెలంగాణ సాంస్కృతిక, సామాజిక, అభివృద్ధి పథకాల సలహామండలి సభ్యులుగా నియమితులైన పల్లె నరసింహలను సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా మఖ్దూం భవన్ పునర్ నిర్మితంలో భాగస్వామ్యమైన పలువురిని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ ఘనంగా సన్మానించింది. భవన నిర్మాణానికి సమయం, సహకారాన్ని అందించిన చంద్ర పూర్ణచందర్ రావును సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, జాతీయ కౌన్సిల్ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావులు ఘనంగా సన్మానించారు. అదే విధంగా సురవరం కపిల్, ప్రజాపక్షం ఫోటో జర్నలిస్టు కర్నకోటి అనిల్ కుమార్, మఖ్దూంభవన్ కార్యాలయం స్టాఫ్ గోవింద్, శ్రీరాములు, దశరథ్, అంజయ్యలను సన్మానించారు. అదేవిధంగా భవనం పునర్ నిర్మితంలో సేవలందించిన ఆంజనేయులు, నారా శ్రీనివాస్, సురేష్, బాలకృష్ణ, సంజయ్‌లను శాలువతో సత్కరించారు.

### వెలుగు జిమ్ముతున్న మఖ్దూం భవన్

సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్ పునర్ నిర్మితంతో వెలుగులు జిమ్ముతోంది. కార్యాలయానికిఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ప్రవేశ మార్గంలో ఇరువైపులా ఏర్పాటు చేసిన పార్టీ గుర్తు సుత్తి కొడవలి ఆకట్టుకుంటున్నాయి. అదే విధంగా కార్యాలయం ముందు భాగంలోని పోర్ట్ కోపై ఏర్పాటు చేసిన కమ్యూనిస్టు సిద్ధాంతకర్తలు కారల్ మార్క్స్, ఎంగిల్స్, లెనిన్‌ల ఛాయా చిత్రాలు లైటింగ్‌లో జిగేలుమంటున్నాయి. అదేవిధంగా ప్రవేశ ద్వారం వద్ద ఇరువైపుల ఎరుపురంగులో ఏర్పాటుచేసిన డిజైన్ వాల్ ధగధగ మెరిసిపోతుండడంతో మఖ్దూంభవన్ సరికొత్త రూపు సంతరించుకుంది.

**ఆకట్టుకుంటున్న కమ్యూనిస్టు యోధుల చిత్ర పటాలు :**

మఖ్దూంభవన్ పునర్ నిర్మితంలో భాగంగా ఏర్పాటు చేసిన కమ్యూనిస్టు యోధుల చిత్రపటాలు ఆకట్టుకుంటున్నాయి. మఖ్దూంభవన్ ప్రవేశ ద్వారం బయట ఉన్న పోర్ట్‌కోకు మూడు వైపులా ఏర్పాటు చేసిన కమ్యూనిస్టు దిగ్గజాల ఫోటోలు స్ఫూర్తి రగిలిస్తున్నాయి. పోర్ట్‌కో పడమర దిశగా కె.ఎల్ మహేంద్ర, రాజ్ బహదూర్ గౌర్, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాంది పలికిన రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మొయినుద్దీన్‌ల చిత్ర పటాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా ముందు భాగంలో ఏర్పాటు చేసిన కమ్యూనిస్టు దిగ్గజాలు చంద్ర రాజేశ్వరరావు, బొమ్మగాని ధర్మబిక్షం, నల్లమల్ల గిరి ప్రసాద్, గురువారెడ్డి, నీలం రాజశేఖరరెడ్డి, కోరుట్ల రామచంద్రారెడ్డి దంపతులు, గుజ్జల ఎల్లామందారెడ్డి దంపతులు, తమ్మారెడ్డి సత్యనారాయణ, కంభంపాటి సీనియర్‌ల చిత్రపటాలు ఆకట్టుకుంటున్నాయి. పోర్ట్‌కో దక్షిణ దిశగా చే గువేరా, సర్దార్ భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల చిత్రపటాలు స్ఫూర్తిని రగిలిస్తున్నాయి. మఖ్దూంభవన్‌లో రీడింగ్ రూంలో సిపిఐ జాతీయ ప్రధానకార్యదర్శులు సింగారు వేలు మొదలుకొని ఎ.బి.బర్దన్ చిత్రపటాలను ఏర్పాటు చేశారు. ప్రముఖ సంపాదకులు సి.రాఘవాచారి లైబ్రరీ హాల్‌లో అభ్యుదయ కవులు శ్రీశ్రీ, డాక్టర్ సి.నారాయణరెడ్డి, ఆరుద్ర లాంటి పలువురు మహాకవుల చిత్రపటాలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా మెట్లమార్గంలో ఏర్పాటు చేసిన తెలంగాణ సాయుధ పోరాట యెధులు దొడ్డి కొమురయ్య, చిట్యాల ఐలమ్మ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ మహనీయుల చిత్రపటాలు ఆకట్టుకుంటున్నాయి. మొదటి అంతస్తులోని కార్యాలయం లో 1936 మొదల్కొని సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు బాధ్యతలను నిర్వహించి అమరులైన వారి చిత్రపటాలను ఏర్పా టు చేశారు. 4వ అంతస్తులోని తమ్మారెడ్డి సత్యనారాయణ సమావేశం హాల్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులతో పాటు వివిధ ప్రజా సంఘాల నాయకుల చిత్రపటాలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా భవనాన్ని పూర్తిగా ఆధునీకరించడంతోపాటు వివిధ జిల్లాల నుంచి వచ్చే పార్టీనేతలు ఉండేందుకు సౌకర్యవంతంగా తీర్చిదిద్దారు.

భారతదేశాన్ని కాపాడుకునేందుకు

# కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు కలిసి నడవాలి

## మహేష్‌కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** లౌకిక, ప్రజాస్వామిక భారతదేశాన్ని కాపాడుకునేందుకు కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు కలిసి ముందుకు సాగాలని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కమ్యూనిస్టు, కాంగ్రెస్ అనుబంధం విడదీయరానిదని, ఇది ఇలాగే కొనసాగిస్తూ ముందుకు సాగాలని, భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని కోరారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లో పునర్ నిర్మితమైన సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్ ప్రారంభోత్సవ సభ గురువారం జరిగింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభలో మహేష్‌కుమార్‌గౌడ్ సందేశమిస్తూ కాంగ్రెస్‌తో పాటు కమ్యూనిస్టులు కూడా బలపడాలని నేను కోరుకునే వ్యక్తిని అని అన్నారు. కమ్యూనిస్టు భావజాలానికి మరణం లేదని, సిద్ధాంతాలకు కొదవలేదని, నాయకత్వం వహిస్తూనే ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో శాసనససభ ఎన్నికల్లో కమ్యూనిస్టులు, కాంగ్రెస్‌ల కలయికను ప్రజలు కూడా విశ్వసించారని చెప్పారు. 1976లో జరిగిన మగ్ధూంభవన్ ప్రారంభోత్సవ సమయంలో నాడు కాంగ్రెస్ మంత్రులు పాల్గొన్నారని, ప్రస్తుతం పునర్ నిర్మిత మఖ్దూం భవన్ ప్రారంభోత్సవంలో తాను పాల్గొన్నానని మహేష్ కుమార్‌గౌడ్ గుర్తు చేసుకున్నారు. మఖ్దూం మొహియుద్దీన్ తన జీవితాంతం ప్రజల కోసమే పనిచేశారని కొనియాడారు. ప్రజా భవనాలు, కమ్యూనిస్టు ఆస్తులు ప్రజలకు ఉపయోగపడేవన్నారు.





**లౌకికవాదమంటే అర్బన్ నక్సలైట్‌గా ముద్ర వేస్తున్నారు**

దేశం బలపడి, మరింత ముందుకు సాగాలంటే లౌకికవాద శక్తులు బలపడాలని మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. దేశాన్ని పాలిస్తున్న ఫాసిస్టు ప్రభుత్వం లౌకికవాదం అంటే అర్బన్ నక్సలైట్లుగా, ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడితే దేశ ద్రోహులుగా ముద్ర వేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మావోయిస్టులు లొంగిపోయేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాల్పులు జరుపుతోందని విమర్శించారు. దీనికి సంబంధించిన చర్చలలో తాను పాల్గొంటే, తనను కూడా అర్బన్ నక్సలైట్‌గా చిత్రీకరిస్తున్నారన్నారు. అడవుల్లో ఉన్న విలువైన ఖనిజ సంపదను ప్రైవేటు వ్యక్తుల చేతిలో పెట్టేందుకు నరమేధానికి పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు. తాను కూడా హిందూవునేనని, కానీ హిందూ కార్డును ఉపయోగించుకోబోనని, కానీ కొందరు మేధావులు కూడా హిందువు కార్డులను వాడుకోవడం దురదృష్టకరమన్నారు. గత పాలకులు రాష్ట్రాన్ని అప్పులపాలు చేసినప్పటికీ కష్టనష్టాలను అధిగమిస్తూ తాము ముందుకు సాగుతున్నామన్నారు.

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తూ ముందుకు వెళుతున్నామని, మరింత చేయాల్సి ఉందని, ఇందుకు కమ్యూనిస్టుల సహకారం కావాలని కోరారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలకు కాంగ్రెస్, సిఎం రేవంత్‌రెడ్డి సహకరిస్తారన్నారు. డి.రాజా, సురవరం సుధాకర్ రెడ్డి జీవితాలు తమకు స్ఫూర్తి దాయకమని, వారు తమ జీవితం మొత్తం ప్రజలకు త్యాగం చేశారని మహేష్ కుమార్‌గౌడ్ కొనియాడారు. కేరళ రాష్ట్రంలో కమ్యూనిస్టులు, కాంగ్రెస్ వేర్వేరుగా ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ, జాతీయ, లౌకికవాదం, ప్రజాస్వామ్యవాదం విషయంలో జాతీయ స్థాయిలో అందరూ కలిసి ముందుకు సాగుతామని అన్నారు. బిజెపి ప్రభుత్వం తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు రాజ్యాంగబద్ధ సంస్థలను ఒక్కొక్కటిగా నిర్వీర్యం చేస్తోందన్న ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశాన్ని న్యాయవ్యవస్థను కాపాడాలని మహేష్ కుమార్ గౌడ్ కోరారు.



**ప్రభుత్వ వ్యతిరేక నిరసనలకు వేదికగా 'మఖ్దూంభవన్'**

సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ కెసిఆర్ పాలనలో ధర్నాలు నిషేధించారని, ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌ను ఎత్తివేసి, అనేక నిర్బాంధాలు విధిస్తే, అన్ని రాజకీయ పార్టీలకు 'మఖ్దూంభవన్' నిరసనలకు వేదికగా మారిందని గుర్తు చేశారు. లౌకిక, ప్రజాస్వామ్య, వామపక్షవాదులు ఒక వేదిక మీదకు వచ్చారన్నారు. మావోయిస్టులు కాల్పులను విరమించిన తర్వాత కూడా 'ఆపరేషన్ కగార్'లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా యుద్ధం ప్రకటించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం ఏకపక్ష యుద్ధం ప్రకటించడాన్ని నారాయణ ఖండించారు. మనుషులను,నక్సలైట్లను కేంద్ర ప్రభుత్వం చంపవచ్చని, కానీ నక్సలిజాన్ని మాత్రం చంపలేరని స్పష్టం చేశా రు.

సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ పేద, ధనిక, కుల, మత, స్త్రీ, పురుష అసమానతలు లేని, సమాజ నిర్మాణానికి, సోషలిస్టు భావాలను ముందుకు తీసుకెళ్లే విషయంలో దోపిడీ వర్గాలకు కమ్యూనిస్టులు, కమ్యూనిస్టు భావాలు కలిగిన వారే ప్రత్యామ్నాయం అవుతారని, ఆ దిశగా ప్రత్యామ్నాయ ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. మతోన్మాద, హిందూత్వ ఎజెండా పేరుతో కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన బిజెపి దోపిడీ వ్యవస్థకు, భావజాలానికి వ్యతిరేకంగా లౌకిక శక్తులతో కలిసి పోరాటం చేయాలని, బిజెపిని గద్దె దించేందుకు అందరూ కలిసి ముందుకు సాగాలన్నారు. సిపిఐ (న్యూడెమోక్రసీ) రాష్ట్ర నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య మాట్లాడుతూ హిందూత్వం, మదోన్మాదం, ఫాసిస్టు శక్తుల ప్రమాదాన్ని తక్కువ అంచనా వేయవద్దని, అది అందరినీ మింగేస్తుందన్నారు. వామపక్ష పార్టీలు, కాంగ్రెస్ రెండు కలిసి విద్యుత్ ఉద్యమం చేసి చరిత్ర సృష్టించామన్నారు.





ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో ఒక కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సిపిఐ జాతీయ కార్యదర్శి డి.రాజా చొరవ తీసుకోవాలని కోరారు. తద్వారా పార్లమెంట్ సమావేశంలో ప్రతిపక్ష ఎంపిలు ఆపరేషన్ కగార్ అంశాన్ని లేవనెత్తాలని విజ్ఞప్తి చేశారు. కమ్యూనిస్టు వాసనే ఉండకూడదనే పరిస్థితుల్లో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ముస్లిం, క్రైస్తవులు ఆ తర్వాత కమ్యూనిస్టులే లక్ష్యం చేసుకున్న నేపథ్యంలో ఒక విప్లవ కేంద్రంగా మఖ్దూంభవన్ పునర్ నిర్మాణం ఎంతో దోహదపడుతుందని సిపిఐ మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు హన్మేష్ చెప్పారు. ఆర్‌ఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు ఎ.జానకిరాములు మాట్లాడుతూ వామపక్ష ఉద్యమానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమ కేంద్రంగా మఖ్ధూంభవన్ అనేక సేవలను అందిస్తుందన్నారు.



తమ్మారెడ్డి సత్యనారాయణ హాల్ ప్రారంభం



కాన్ఫరెన్స్ హాల్‌ను ప్రారంభించిన అజీజ్ పాషా



సి.రాఘవాచారి గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న నారాయణ



డి.ఎస్. రాంచందర్ రావు క్యాంటిన్‌ను ప్రారంభిస్తున్న చాడ



రాజా, సురవరంతో ముచ్చటిస్తున్న మహేశ్‌కుమార్ గౌడ్



డి. రాజాను సన్మానిస్తున్న నారాయణ



తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌కు సన్మానం



సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యంకు సన్మానం



చంద్ర పూర్ణచంద్రరావుకు సన్మానం



ఈస్ట్ ఎఫెక్ట్స్ అధినేత కపిల్‌కు సన్మానం



తెలంగాణ ప్రజానాట్యమండలి కళాకారుల ఆట పాట



ప్రజాపక్షం ఫోటోగ్రాఫర్‌కు అనిల్ కుమార్‌కు



పల్లె నర్సింహ్మకు









మఖ్దుంభవన్ సిబ్బంది గోవింద్, శ్రీరాములు, దశరథ, నర్సింహ్మంకు సన్మానం



సిపిఐ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ శ్రీమాన్‌కు

**నాగారం మున్సిపాలిటీ కార్యాలయం**
మేడ్చల్ - మల్కాజిగిరి
No. E1/05/2025-26, ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు తేది: 11.07.2025
పనుల సంఖ్య: 4.00 (ఎలక్ట్రికల్ పనులు), అంచనా విలువ: రూ. 17.40 లక్షలు, బిడ్ దాఖలుకు ప్రారంభ తేది: 11.07.2025న ఉ.11.00గం.లకు, బిడ్స్ దాఖలుకు ఆఖరి తేది: 15.07.2025న సా.4.00గం.ల వరకు, బిడ్స్ ప్రారంభం: 15.07.2025న సా.4.10గం.లకు, మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన నెం. 7075596119, 8008066188, మరియు http://tender.eprocurement.gov.in లో చూడవచ్చు.
సం/- కమిషనర్, నాగారం మున్సిపాలిటీ.
DIPR R.O. No. : 4838-PP/CL/ADVT/1/2025-26, Date: 10-07-2025

ప్రజాపక్షం
శుక్రవారం, 11 జులై

## బిహార్‌లో ఇసికి సుప్రీం బంధనాలు

న్యాయస్థానాలు ఎన్ని పర్యాయాలు ఆక్షేపించినా... ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి వెన్నుపోటుపొడిచే కుట్రలు ఆగడం లేదు. నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్‌లో 'స్పెషల్ ఇన్‌టెన్సివ్ రివిజన్' పేరుతో ఓటర్ల జాబితాను సమూలంగా సవరించాలన్న ఎన్నికల కమిషన్ నిర్ణయం వెనుక మోదీ సర్కారు హస్తం ఉందనేది బహిరంగ రహస్యం. రాజ్యాంగం ద్వారా ఏర్పడిన యంత్రాంగాలను కేంద్రం తన చెప్పుచేతుల్లో పెట్టుకునే ప్రయత్నం చేస్తున్నదనడానికి ఇది తాజా నిదర్శనం. ప్రతిపక్ష 'ఇండియా' కూటమి నేతృత్వంలో 'మహాఘటబంధన్' బుధవారం బిహార్ బంద్‌కు భారీ స్పందన రావడం ఎన్నికల కమిషన్ నిర్ణయంపై హెచ్చరిక. ఓటర్ల జాబితా సవరణ ప్యానెల్ ఏర్పాటుకు 'ప్రజాప్రతినిధుల చట్టం'లో అవకాశం ఎక్కడ ఉంది'?, 'ఈ ప్యానెల్ చేసే సమీక్షకు చట్టబద్ధత ఎలా లభిస్తుంది?', 'ఆకస్మిక నిర్ణయానికి కారణం ఏమిటి?' అంటూ సుప్రీం కోర్టు గురువారం నిలదీయాల్సిన పరిస్థితి రావడం అటు ఎన్నికల కమిషన్‌కు, ఇటు మోదీ సర్కారుకు చెంపపెట్టు. బిహార్ అసెంబ్లీ గత ఎన్నికల ఫలితాల అనంతరం నితీష్ కుమార్‌ను అడ్డుపెట్టుకొని బిజెపి ఆడిన 'సైంధవ నాటకం' దాని పైశాచికత్వానికి పరాకాష్ట. కొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలుండగా ఓటర్ల జాబితాల సమగ్ర రివిజన్‌కు ఎన్నికల సంఘం ఉత్తర్వులు చేయటం అధికార కాంక్షతో, మరోసారి పౌరుల ప్రజాస్వామిక హక్కులపై ఉక్కుపాదం మోపే కుట్రకు తెరతీసింది. దళితులు, మైనారిటీలు, ఇతర పేదలకు ఓటు హక్కును సాధ్యమైనంతవరకు రద్దు చేయడం లక్ష్యంగా చేసుకొని సాగుతున్న దాడుల నేపథ్యంలో, సుప్రీం కోర్టు స్పందించిన తీరు ప్రశంసనీయం. ఓటర్ల జాబితా సమగ్ర రివిజన్‌కు ఎన్నికల సంఘం ప్రతి ఓటరుకు ఒక ఫారం ఇచ్చింది. జన్మతేదీ, నివాస ధ్రువీకరణకు 11 ఆధార పత్రాల్లో ఏదో ఒకటి జత చేయాలంది. కానీ, వాటిలో సర్వవ్యాప్త గుర్తింపుగా ఉన్న ఆధార్ లేదు. కాగా, ఓటర్లు అధికారులకు ధ్రువీకరణ పత్రాల కోసం చేసుకుంటున్న దరఖాస్తులకు ఆధార్‌ను రుజువుగా సమర్పిస్తున్నారు. అధికారులు అంగీకరిస్తున్నారు. కానీ, ఎన్నికల సంఘం ఆధార్‌ను అంగీకరించకపోవడమే పెద్ద కుట్ర. పేదరికం తాండవించే బిహార్‌లో కోట్లాది మందికి ఎన్నికల సంఘం పేర్కొన్న డాక్యుమెంట్లు లేవు. ఆధార్ ఉంది. రేషన్ కార్డు ఉంది. గ్రామీణ ఉపాధి కార్డులున్నాయి. వాటిని ఎన్నికల సంఘం గుర్తించకపోవడమంటే, పెద్ద సంఖ్యలో ఓటర్లను తొలగించి పాలక పార్టీకి సహాయం చేయటమే. రెండోవైపు, ప్రజల పౌరసత్వాన్ని నిర్ణయించే లేనిబాధ్యతను నెత్తికేసుకోవటంగా ఆరోపణకు గురైంది. ఓట్ల రివిజన్‌ను స్టే చేయాలన్న పిటిషనర్ల అభ్యర్థనను సుప్రీం కోర్టు నిరాకరించినప్పటికీ, పౌరసత్వ నిర్ణయ బాధ్యత ఎన్నికల సంఘానిది కాదని, ఆధార్‌ను ధ్రువీకరణ పత్రంగా ఆమోదించాలని సూచించింది. ఓటర్ల జాబితాలో దాదాపు కోటి మంది కొత్త ఓటర్లను చేర్చడం ద్వారా బిజెపి మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల తీర్పును దొంగలించిన పద్ధతిలోనే, పేదలు, మైనారిటీలు, పనులకై వలసపోయిన ప్రజల ఓట్లు తొలగించడం ద్వారా బిహార్ అసెంబ్లీ ఎన్నికలను సానుకూలం చేసుకోవాలన్న ఆ పార్టీ నీచమైన రాజకీయ కుట్రకు ఎన్నికల సంఘం సాధనంగా ఉపయోగపడడం రాజ్యాంగానికి వెన్నుపోటు పొడవడమే. ఆ కుట్రకు సుప్రీం కోర్టు చాలా వరకు అడ్డుకట్ట వేసిందనే భావించాలి. అయితే, ఓటర్ల నమోదుకు వ్యవధి ఈ నెలాఖరు వరకే ఉన్నందున, ప్రతిపక్ష రాజకీయ పార్టీలు అర్హులైన వారందరినీ ఓటర్లుగా చేర్చేందుకు ఉద్యమించాలి. మతపరమైన విభజనతో రాజకీయ సమీకరణలు చేయడం, మైనారిటీలకు ఓటు హక్కు హరించడానికి ప్రయత్నించడం బిజెపి విధానాలన్న విమర్శలు కొత్తవేం కావు. బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణ ప్రయత్నాలు మైనారిటీ ఓటర్లపై స్పష్టమైన దాడి, జాతీయ పౌర పట్టిక (ఎన్‌ఆర్‌సి)ని దొడ్డిదారిన అమలు చేసే దుష్ట ప్రయత్నం. 2003 ఓటర్ల జాబితాను సమీక్షించనున్నట్టు ఎన్నికల కమిషన్ ప్రకటించడం విడ్డూరం. రెండు దశాబ్దాలకుపైగా కొత్తగా జాబితాలో చేరిన ఓటర్లపై అనుమానాలు ఉంటే, ఇప్పటి వరకూ జరిగిన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల ఫలితాలకు అర్థం ఏమిటో ఎన్నికల కమిషన్ చెప్పితీరాలి. ఈ జాబితాను అనుమానాస్పదంగా ముద్ర వేయడం, ఎన్నికల కమిషన్ తన పనితీరును తానే అవమానించినట్టే కదా? లోపభూయిష్టమైన ఈ కమిషన్, ఆగమేఘాలపై చేసే పరిశీలనకు విలువెక్కడ? ఎన్నికల కమిషన్‌ను కీలుబొమ్మను చేసి, ప్రభుత్వమే ఈ తతంగం నడిపిస్తున్నదన్న ఆరోపణలను తప్పుపట్టగలమా? ఈ పరిస్థితుల్లో, రాజ్యాంగ వ్యవస్థలపై మోదీ ప్రభుత్వ నిరంకుశ దాడులపై ప్రతిఘటన వేదికలు రూపొందించడం అత్యవసరం. రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్యం, సమాఖ్యతత్వం కాపాడుకోవడం వంటి విషయాల్లో 'ఇండియా' కూటమి విధాయక నిర్ణయాలు తీసుకోవాలి. కార్యాచరణ సిద్ధం చేసుకోవాలి. అమలు పరచాలి. సుప్రీం కోర్టు జోక్యం చేసుకోకపోతే, బిజెపి ఎంతటికైనా తెగిస్తుందని, బిహార్‌లో మళ్లీ పాగా వేయడానికి రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేస్తుందని మరోసారి రుజువైంది. ఈ ధోరణికి తెరదించకపోతే, దేశంలో ప్రజాస్వామ్యం మనుగడ కష్టం.

## అధిక జనాభా మన దేశానికి వరమా? శాపమా?

నేడు ప్రపంచ జనాభా దినోత్సవం

చైనాను అధిగమించి, ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న దేశంగా భారత్ అవతరించింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం భారత్ జనాభా 144.17 కోట్లు. 2054 నాటికి ఇది 170 కోట్ల గరిష్ఠ స్థాయికి చేరుకుంటుందని,ఆ తర్వాత పన్నెండు శాతం సుమారు ఇరవై కోట్లు తగ్గుముఖం పడుతుందని అంచనాలున్నాయి. ఐక్యరాజ్యసమితి అంచనా ప్రకారం ప్రపంచ జనా భా 800 కోట్లను దాటింది. 2050 నాటికి 970 కోట్లకు చేరుకోవచ్చు. 2080 నాటికి 1040 కో ట్లకు పెరిగి, అక్కడ స్థిరంగా ఉండవచ్చని నిపుణులు భావిస్తున్నారు. భారతదేశ జనాభాలో సగం మంది 30 ఏండ్లలోపు వారు. అంటే, దాదా పు 72 కోట్ల మందితో కూడిన యువశక్తి ఉన్న దేశం మనది. ప్రపంచంలో ఏ దేశం వద్దా ఇంతటి యువశక్తి లేదు. సరైన విద్యను అందించటం ద్వారా, ఉద్యోగ నైపుణ్యాలకు సంబంధించి నిరంతర శిక్షణ ఇవ్వటం ద్వారా యువశక్తి ప్ర తిభ సామర్థ్యాలను దేశం ఉపయోగించుకోవచ్చు. ప్రస్తుతం వృద్ధి రేటు దాదాపు ఆరు శాతంగా నమోదవుతున్నది. ద్రవ్యోల్బణం, ప్రపంచవ్యాప్తంగా మాంద్యం, అంతర్జాతీయంగా భౌగోళికంగా, రాజకీయంగా నెలకొన్న ఉద్రిక్తతలు వంటి సమస్యలున్నా భారత్ తన జనాభాను ముఖ్యంగా యువతను సరైన విధంగా వినియోగించుకుంటే అద్భుతమైన ప్రగతిని నమోదు చేయవచ్చని అంతర్జాతీయ సంస్థలు, నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే, ఇది నాణేనికి ఒక వైపు మాత్రమే. అధిక జనాభా ఉండటం సానుకూలతే కానీ దానితో ఉండే సమస్యలు దానికున్నాయి. జనాభాను దేశానికి పరిమితమైన అంశంగా కాక, అంతర్జాతీయంగా ప్రభావం చూపే అంశంగా గుర్తించాలి. ముఖ్యంగా వాతావరణ మార్పులు కీలకమైనవి. భూమ్మీద జీవ వైవిధ్యానికి ఎదురవుతున్న సవాళ్లపై ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ యుఎన్ఎఫ్‌సిసిసి ఎప్పటికప్పుడు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నది. ప్రతికూల వాతావరణ మార్పుల వల్ల ప్రజల వలసలు రానున్న రోజుల్లో విపరీతంగా పెరిగిపోయే అవకాశం ఉన్నదని ఈ సంస్థ చెప్తున్నది. అధిక జనాభా వల్ల నివాసయోగ్యమైన ప్రాంతాలు కుదించుకుపోతున్నాయి. దీవులు, తీరప్రాంతాలు మునిగిపోతున్నాయి. మనుగడ కోసం వన్యప్రాణులకు, మనుషులకు మధ్య ఘర్షణ పెరిగే ప్రమాదం ఉన్నది. నాణ్యమైన నీళ్లు, గాలి తగ్గుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా తరచూ వెలువడుతున్న పరిశోధనల నివేదికలు, అధ్యయనాలు చేస్తున్న హెచ్చరికలు అత్యధిక జనాభా ఉన్న దేశంగా భారత్ వీటిని విస్మరించకూడదు. కచ్చితంగా వీటిపై అధ్యయనం జరిపి, తక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. జీవన పరిస్థితులు దుర్భరంగా ఉన్న ఆసియా, ఆఫ్రికాల్లోని పేద దేశాల్లో జనాభా పెరుగుదల ఎక్కువగా ఉంటున్నది. ఈ దేశాల్లో ప్రజలు ప్రకృతి కారణంగానే గాక ప్రభుత్వపరంగా ఎదురవుతున్న వివక్ష, నిర్లక్ష్యం వల్ల కూడా పెద్ద సంఖ్యలో ఇతర ప్రాంతాలకు వలస పోతున్నారు. దీనికి పూర్తి భిన్నంగా, అత్యాధునిక దేశాల్లో జనాభా క్రమంగా తగ్గుతూ వస్తున్నది. వృద్ధుల సంఖ్య పెరిగిపోయి శ్రామికుల సంఖ్య తగ్గటం ఈ దేశాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య. పెరిగిపోతున్న వృద్ధ జనాభాకు అవసరమైన వైద్య చికిత్సలను అందించటం చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. పలు ధనిక దేశాల్లో ఇప్పుడు ఈ సమస్య ఉన్నది. భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకైతే ఈ వ్యయాన్ని భరించటం దాదాపుగా అసాధ్యం. గత శతాబ్ద కాలంలో ఔషధ రంగంలో చోటుచేసుకుంటున్న అత్యాధునిక మార్పుల వల్ల మానవ జీవితకాలం దాదాపు రెట్టింపయ్యింది. ఆయుః ప్రమాణం మరింత పెరిగే అవకాశాలు కూడా ఉన్నాయి. తరచూ ఏదో ఒక చికిత్స తీసుకునే వృద్ధ జనాభాతోనే తమకు ఎక్కువ లాభం కాబట్టి, మానవ ఆయుః ప్రమాణం పెరుగుదలలో ఔషధరంగం (ఫార్మా ఇండస్ట్రీ) పాత్ర కూడా లేకపోలేదన్న వాదనలున్నాయి. అభివృద్ధి మార్గాన ఉన్న భారతదేశం, 100వ స్వాతంత్ర్య దినోత్సవాల నాటికి, అంటే 2047 నాటికి 'అభివృద్ధి చెందిన దేశం' హోదాను సంతరించుకోవచ్చు. ఈ లోపు జరిగే మార్పులను ఎలా ఎదుర్కొంటామన్నదే అసలు సమస్య. పెరుగుతున్న జనాభా వల్ల భూమి, అడవులు, జల వనరులు, గాలి వంటి సహజ వనరులపై తీవ్రమైన ఒత్తిడి పడుతుంది. 2019లో దేశ జనాభాలో అరవై ఏండ్లు లేదా అంతకన్నా ఎక్కువ వయసున్న వారు పది శాతమే. కానీ, 2050 నాటికి వారి సంఖ్య 19.6 శాతానికి పెరుగుతుంది. అంటే, మరో 25 ఏండ్లపాటు మన వద్ద తిరుగులేని యువశక్తి ఉన్నప్పటికీ, వృద్ధుల సంఖ్య కూడా తక్కువేమీ ఉండదు. వీరి సంఖ్య దాదాపు 30 కోట్లకు చేరుకుంటుంది. సంతానోత్పత్తి రేటు తక్కువగా ఉన్న కేరళలో గత 30ఏండ్ల వ్యవధిలో 65 ఏండ్ల వయసు వారి సంఖ్య రెట్టింపయ్యింది. ఆ రాష్ట్ర జనాభాలో వారి వాటా 12 శాతానికి చేరుకున్నది. జనాభాని యంత్రణలో కేరళతో పోటీ పడుతున్న పలు రాష్ట్రాల్లోనూ ఈ ధోరణే కనిపించనున్నది. కాబట్టి, చైనాను అధిగమించి భూగోళం మీద అత్యధిక జనాభా రికార్డు సృష్టించామని చెప్పుకునేముందు దానితోపాటు వచ్చే సమస్యల పైనా దృష్టిపెట్టాలి. ఆ సమస్యల పరిష్కారానికి దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరమవుతాయి. జనాభాలో చైనాను అధిగమించినప్పటికీ, భారత జనాభా వృద్ధి రేటు నెమ్మదిస్తున్నది. 1971–81 మధ్య ఏటా సగటున 2.2 శాతం చొప్పున జనాభా పెరుగగా, 2001–11 నాటికి 1.5 శాతానికి తగ్గింది. ప్రస్తుతం దీనికంటే తక్కువగా ఉంది. భారతీయ మహిళల సగటు సంతానోత్పత్తి 1960లలో ఆరు ఉండగా, ప్రస్తుతం రెండుకు తగ్గింది.

**సుధాకర్, ఎస్‌టియు**
**9000674747**

## జులై 31న 'స్వదేశీ' ఉగ్రవాదం గుట్టు రట్టు?



ఎస్‌కె. జకీర్
సీనియర్ జర్నలిస్ట్

మరో 20 రోజుల్లో కాషాయ సన్యాసిని తదితరుల ఉగ్రవాదం గుట్టు రట్టు కానుందా? అనే అంశం ఆసక్తికరంగా మారింది. మాలెగావ్ తదితర పేలుళ్లతో సంబంధం ఉన్నట్టు ఆరోపణలున్న మాజీ ఎంపి ప్రజ్ఞా ఠాకూర్, మరో ఆరుగురిపై కేసును జులై 31న తుది తీర్పు వెల్లడించనున్నట్టు మే 8న ఎన్ఐఎ ప్రత్యేక కోర్టు తెలిపింది. మే 8న తీర్పు వెలువరించవల్సి ఉన్నప్పటికీ 'మాలేగావ్ పేలుళ్ల కేసులో రికార్డులు, ఆధారాలు భారీగా ఉన్నా యి. నాకు మరింత సమయం అవసరం' అని ప్ర త్యేక న్యాయమూర్తి ఎకె లాహోటి అన్నారు. 2008 మాలేగావ్ పేలుళ్ల కేసులో ముంబైలోని ప్రత్యేక జాతీయ దర్యాప్తు సంస్థ కోర్టు తన తీర్పును వాయి దా వేసింది. ఈ కేసులో వాదనలు గత ఏప్రిల్‌లోనే ముగిశాయి. డాక్యుమెంటేషన్ దాదాపు లక్ష పేజీలు ఉన్నాయి. 'జులై 31, నిందితులందరూ హాజరు కావాలని నేను కోరుకుంటున్నాను. ఎవరైనా నిందితులు గైర్హాజరైతే, వారిపై చట్టపరమైన చర్య లు తీసుకుంటాము' అని న్యాయమూర్తి లాహోటి అన్నారు. ఈ కేసుకు ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా ప్ర త్యేక న్యాయమూర్తి ఎకె లాహోటి పదవీకాలాన్ని ఈ ఏడాది ఆగస్టు 31 వరకు పొడిగించారు. న్యా యమూర్తుల సాధారణ బదిలీలలో భాగంగా వచ్చే జూన్‌లో బదిలీ చేయాలని నిర్ణయించారు. కానీ మాలేగావ్ పేలుడు తీర్పుకు మరింత సమయం కోరుతూ ఆయన బాంబే హైకోర్టును ఆశ్రయించా రు.హైకోర్టు ఆయనకు పొడిగింపు ఇచ్చింది.

పదిహేడు సంవత్సరాల కిందట 2008 సెప్టెంబర్ 29న, నాసిక్ సమీపంలోని మాలేగావ్‌లోని ఒక మసీదు సమీపంలో మోటార్ సైకిల్‌కు కట్టిన పేలుడు పదార్థాలు పేలి ఆరుగురు మృతి చెందగా, 100 మందికి పైగా గాయపడ్డారు.మాలేగావ్ పేలుళ్ల కేసును మొదట మహారాష్ట్ర ఉగ్రవాద నిరోధక దళం దర్యాప్తు చేసింది, తరువాత ఎన్ఐఎ దర్యాప్తు కొనసాగించింది.ఈ కేసులో మొదట 14 మందిపై అభియోగాలు మోపినప్పటికీ,వాదనలు ముగిసే సమయానికి ఏడుగురు నిందితులుగా మిగిలారు. బిజెపి మాజీ ఎంపి ప్రజ్ఞాసింగ్ ఠాకూర్, లెఫ్టినెంట్ కల్నల్ ప్రసాద్ పురోహిత్, మేజర్ (రిటైర్డ్) రమేష్ ఉపాధ్యాయ్,అజయ్ రాహిర్కర్,సమీర్ కులకర్ణి, సుధాకర్ చతుర్వేది, సుధాకర్ ధర్ ద్వివేది అనే ఏడుగురు నిందితులు ఉన్నారు. వారు నేరపూరిత కుట్ర,హత్య,ఇతర అభియోగాలు, ఐపిసి చట్టాలతో పాటు, చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం 'ఉపా' కింద ఉగ్రవాద చర్యకు కుట్ర పన్నడం, పాల్పడటం లేదా నిర్వహించడం వంటి అభియోగాలు,పేలుడు పదార్థాల చట్టం 1908 కింద అభియోగాలు ఎదుర్కొంటున్నారు.మాలేగావ్ పేలుళ్ల కేసులో మహారాష్ట్ర యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్ 2010 నాటికి రెండు చార్జిషీట్లు దాఖలు చేసింది. కానీ కొత్తగా ఏర్పడిన ఎన్ఐఎ 2011లో దర్యాప్తు చేపట్టింది. 2016లో ఎన్ఐఎ అనుబంధ చార్జిషీట్ దాఖలు చేసింది. కాగా మాలేగావ్ పేలుళ్ల కేసులో ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ సహ ఏడుగురు నిందితులకు ఉరి శిక్ష విధించాలని కోర్టును ఎన్ఐఎ కోరింది. గతంలో ఇదే ఎన్ఐఎ ప్రజ్ఞాసింగ్ ఠాకూర్‌కు క్లీన్ చిట్ ఇచ్చింది. అందుకు విరుద్ధంగా పూర్తిగా యూటర్న్ తీసుకుంది. 'ఉపా' సెక్షన్ 16 కింద మరణ శిక్ష విధించాలని కోర్టుకు ఎన్ఐఎ విజ్ఞప్తి చేసింది. 1389 పేజీలతో తన తుది వాదనలను సమర్పించిన ప్రాసిక్యూషన్.. నిందితులందరికీ మరణశిక్ష విధించాలని కోరింది. మహారాష్ట్ర యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ ప్రజ్ఞా ఠాకూర్, శివనారాయణ్ గోపాల్ సింగ్ కల్సంగ్రా,శ్యామ్ భవర్లాల్ సాహును అరెస్టు చేసింది. ఆ ముగ్గురితో సహా మొత్తం 16 మందిని నిందితులుగా పేర్కొంటూ మహారాష్ట్ర కంట్రోల్ ఆఫ్ ఆర్గనైజ్డ్ క్రైమ్ యాక్ట్ 'మోకా' కింద అభియోగాలు నమోదు చేయడంతో వారికి బెయిల్ దొరకలేదు.

2014లో బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చాక 2015లో ఎన్ఐఎ ఈ కేసులో సాక్షులను తిరిగి విచారించి,ప్రజ్ఞా ఠాకూర్ సహ మరికొందరికి క్లీన్‌చిట్ ఇస్తూ 2016లో చార్జిషీట్ దాఖలు చేసింది. ఇదే కేసులో లెఫ్టినెంట్ కర్నల్ పురోహిత్ సహ మరో 10 మందిపై 'మోకా' చట్టం కింద దాఖలు చేసిన అభియోగాలన్నింటినీ తొలగించింది.కానీ ప్రజ్ఞా ఠాకూర్ విచారణను ఎదుర్కోవాల్సిందేనని కోర్టు స్పష్టం చేసి విచారణను కొనసాగిస్తోంది. . దాదాపు 17 సంవత్సరాలపాటు సుదీర్ఘంగా కొనసాగిన ఈ కేసు విచారణ ఎట్టకేలకు 2025 ఏప్రిల్ 19న ముగిసింది. అయితే.. ఈ కేసులో నిందితులకు 2016లో క్లీన్‌చిట్ ఇచ్చిన అదే ఎన్ఐఎ ఆ తర్వాత యూటర్న్ తీసుకుని సాక్షులు 2015లో మాట మార్చారని, వారి వాంగ్మూలాలను విశ్వాసంలోకి తీసుకోలేమని ప్రజ్ఞాఠాకూర్, లెఫ్టినెంట్ కర్నల్ ప్ర



సాద్ పురోహిత్, సుధాకర్ ద్వివేది, రిటైర్డ్ మేజర్ రమేశ్ ఉపాధ్యాయ్, అజయ్ రహీర్కర్,సుధాకర్ చతుర్వేది, సమీర్ కులకర్ణికి మరణశిక్ష విధించాలని కోరింది. 2016 ఏప్రిల్ లో 'ఔట్ లుక్' వారపత్రిక కథనం ప్రకారం 'దాడులు చేయాల్సిన అవసరం గురించి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ నాకు చెప్పారు. మక్కా మసీదు పేలుడుకు ప్రణాళిక వేసినట్లు స్వామి అసీమానంద హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలులో ఉన్నప్పుడు షేక్ అబ్దుల్ కలీం అనే వ్యక్తికి చెప్పారు.2013లో ఎల్ఎల్‌బి పూర్తి చేసిన కలీంకు న్యాయ సంస్థల్లో ఉద్యోగం నిరాకరించబడింది. అతను మలక్‌పేట ఎంఐఎం ఎమ్మెల్యే అహ్మద్ భలాలా కార్యాలయంలో పనిచేస్తున్నాడు. అజ్మీర్ పేలుళ్ల కేసులో అసీమానంద్ నిర్దోషిగా విడుదలయ్యాడని విన్నప్పుడు కలీం నమ్మలేకపోయాడు. మక్కా మసీదు పేలుళ్ల కేసులో కూడా అతనికి బెయిల్ మంజూరు అయినప్పుడు కలీం నమ్మలేదు. హిందూ దేవాలయాలపై ఇస్లామిక్ ఉగ్రవాద దాడులకు ప్రతీకారం తీర్చుకోవడానికి పలు ప్రాంతాల్లో ఉగ్ర దాడులు జరిపినట్లు అసీమానంద్ చెప్పారని' కలీం అన్నాడు.

ఇస్లామిస్ట్, సిక్కు ఉగ్రవాదంపై మాత్రమే కేంద్రం తరచూ మాట్లాడుతోంది. అయితే ఆర్ఎస్ఎస్ లేదా,దాని మూలాలతో అనుబంధం ఉన్న వ్యక్తులు, ప్రజ్ఞా ఠాకూర్,అసీమానంద్‌లను వివిధ కేసుల లో అరెస్టు చేసి విచారించిన సందర్భంలో బిజెపిలో కొంత కలకలం రేగింది. ఉగ్రవాద చర్యలకు, హిందూ సంస్థలకు మధ్య ఉన్న సంబంధాలను ఆ పార్టీ తోసిపుచ్చడం గమనిస్తున్నాం. మాలేగావ్ పేలుళ్లలో చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టంలోని సెక్షన్ల కింద విచారణ ఎదుర్కొంటున్న ప్రజ్ఞా ఠాకూర్‌ను భోపాల్ నుంచి లోక్‌సభ అభ్యర్థిగా నిలబెట్టాలనే నిర్ణయంపై పార్టీ విమర్శలకు గురయింది. భోపాల్ నుంచి ఆమె 2019 లో ఎంపి అయ్యారు.2024 లో టికెట్టు తిరస్కరించక తప్పలేదు. 'హిందూ ఉగ్రవాదం' అనే పదబంధం కాంగ్రెస్ పార్టీ సృష్టిగా బిజెపి ఆరోపిస్తోంది.'మన గొప్ప మత వారసత్వాన్ని కించపరచడానికి కాంగ్రెస్ కుట్రలు చేస్తోంది' అని ఒక సందర్భంలో ప్రధాని మోడీ అన్నారు. 2007 ఫిబ్రవరి 18 రాత్రి, సంఝౌతా ఎక్స్‌ప్రెస్ ఢిల్లీ జంక్షన్ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్ 18 నుండి తన సాధారణ మార్గంలో బయలుదేరింది.సంఝౌతా భారతదేశం, పాకిస్తాన్ మధ్య ఉన్న రెండు రైలు మార్గాలలో ఇది ఒకటి. ఒకటి.ఆ రాత్రి, దానిలోని దాదాపు 750 మంది ప్రయాణికులలో దాదాపు మూడు వంతుల మంది పాకిస్తానీలు ఇంటికి తిరిగి వెళ్తున్నారు. అర్ధరాత్రికి కొన్ని నిమిషాల ముందు 16 బోగీల రైలులోని రెండు రిజర్వ్ చేయని కంపార్ట్‌మెంట్లలో అధునాతన పేలుడు పరికరాలు పేలాయి.రైలు మంటల్లో చిక్కుకుంది. పేలుళ్ల ధాటికి కంపార్ట్‌మెంట్ల తలుపులు మూసుకుపోయాయి, ప్రయాణికులు లోపలే మూసుకుపోయారు. ఇది చాలా భయంకర ఘటన. అని రైల్వే ఇన్‌స్పెక్టర్ హిందూస్తాన్ టైమ్స్‌తో అన్నారు. పూర్తిగా కాలిన,లేదా సగం కాలిన ప్రయాణీకుల మృతదేహాలు కోచ్‌లలో లభించాయి. సూట్‌కేసుల్లో ప్యాక్ చేసిన రెండు పేలని ఐఇడిలను తరువాత సంఘటనా స్థలంలో కనుగొన్నారు; ఆ పరికరాల్లో పిఇటిఎన్, టిఎన్టీ, ఆర్డి ఎక్స్, పెట్రోల్, డీజిల్, కిరోసిన్ వంటి రసాయనాల మిశ్రమం ఉంది. ఈ దాడిలో అరవై ఎనిమిది మంది మరణించారు. 2006–2008 మధ్య దేశవ్యాప్తంగా పౌరులపై అనేక ఉగ్రవాద దాడులకు కుట్ర పన్నినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అసీమానంద్ నిందితుడిగా ఉన్న ఐదు దాడుల్లో ఇది రెండవది. సంఝౌతా రైలు పేలుళ్లలో మొదటి నిందితుడిగా అసీమానంద్ ఉన్నాడు. 2007 మేలో 11 మంది మృతి చెందిన హైదరాబాద్ మక్కా మసీదు బాంబు దాడిలో మూడవ నిందితుడిగా; 2007 అక్టోబర్‌లో రాజస్థాన్‌లోని అజ్మీర్‌లోని దర్గాలో ముగ్గురు మృతి చెందిన పేలుడులో ఆరవ నిందితుడిగా ఉన్నాడు. మహారాష్ట్రలోని మాలేగావ్‌లో జరిగిన రెండు దాడుల్లో కూడా అతని పేరు మార్మోగింది.వీటిలో చాలా కేసులను ముంబై యాంటీటెర్రరిస్ట్ స్క్వాడ్ , రాజస్థాన్ యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్ సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీతో సహ వివిధ సమయాల్లో బహుళ సంస్థలు సంయుక్తంగానూ దర్యాప్తు చేశాయి.ఐదు కేసుల్లో కనీసం ఒక డజను చార్జిషీట్లు దాఖలు చేయబడ్డాయి. ముప్పై ఒక్క మందిపై అధికారికంగా ఆరోపణలు ఉన్నాయి. అసీమానందకు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జాతీయ కార్యనిర్వాహక సభ్యురాలు ప్రజ్ఞా సింగ్ ఠాకూర్; ఇండోర్‌లోని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ జిల్లా మాజీ నాయకుడు సునీల్ జోషి సహచరులని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి.దాడులకు కుట్ర పన్నడంలో అసీమానంద్ కీలక పాత్ర పోషించాడని అన్ని దర్యాప్తు సంస్థలు నిర్ధారించాయి. అసీమానంద్ తన సొంత ఖాతా ద్వారా ప్రణాళికా సమావేశాలను నిర్వహించాడు,లక్ష్యాలను ఎంచుకున్నాడు, ఐఇడి పేలుడు పదార్థాల సేకరణకు నిధులు అందించాడు. బాంబులు పెట్టిన వారికి ఆశ్రయం కల్పించాడు.ఇంకా ఇతరత్రా సహాయం చేశాడని అసీమానంద్‌పై ఆరోపణలున్నవి.

2011 మార్చి 28న అసీమానంద తన ఒప్పుకోలును ఉపసంహరించుకున్నాడు. వాటిని హింస ద్వారా బలవంతంగా చేయించారని పేర్కొన్నాడు. ట్రయల్ కోర్టుకు అతను సమర్పించిన దరఖాస్తులో 'నా ఒప్పుకోలును మీడియాకు లీక్ చేయడం, ఇది దిగ్భ్రాంతికరమైనది, ఉద్దేశపూర్వకంగా ఉంది,ఇది కేసును రాజకీయం చేయడానికి మాత్రమే.పాలక పార్టీ (యుపిఎ) రాజకీయ ప్రయోజనాల కోసం హిందూ ఉగ్రవాద భావనను సృష్టించడానికి కుట్రలో భాగం' అని అసీమానంద్ అన్నాడు.కాగా మాజీ ఎంపి ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ అనుచరునిగా గుర్తింపు పొందిన సునీల్ జోషిని 2007 డిసెంబర్‌లో 'గుర్తు తెలియని వ్యక్తులు' కాల్చి చంపారు. ఆ కేసు ఇప్పటికీ మిస్టరీగానే ఉన్నది. సంఘ్ సభ్యులు ప్రారంభించిన ఉగ్రవాద దాడులను ఖండిస్తూ,ప్రముఖ హిందూ సంస్కరణవాది స్వామి అగ్నివేష్, ఆర్ఎస్ఎస్ మిలిటెంట్ హిందుత్వం ' హిందూ సమాజంలోని ఇతరులకు హాని కలిగిస్తుంది' అని అన్నారు. 'ఇది దురదృష్టకరం' అని ఆయన అన్నారు.

'ఒక హిందువు ఉగ్రవాది కాలేడు... ఒక హిందువు ఎప్పుడూ ఉగ్రవాది కాలేడు మరియు హిందూ ఉగ్రవాదం అనే పదం ఉండకూడదు' 2021 లో హర్యానాకు చెందిన నాటి మంత్రి అనిల్ విజ్ అన్నారు. 'భారతదేశంలో హిందూ ఉగ్రవాదం ఉందనడం రాజకీయ కుట్ర' అని కూడా అన్నారు. చట్టవిరుద్ధమైన కార్యకలాపాల (నివారణ) చట్టం 1967 ప్రకారం దేశంలో 42 సంస్థలను 'టెర్రరిస్ట్ ఆర్గనైజేషన్'గా ప్రకటించినట్లు కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.భారతదేశంలో పనిచేస్తున్న ఉగ్రవాద సంస్థల వివరాలపై ప్రఫుల్ల పి సర్దా అనే ఆర్టీఐ కార్యకర్త దరఖాస్తుపై కేంద్ర ప్రభుత్వం పై సమాధానం ఇస్తూ దేశంలో హిందూ లేదా కాషాయ ఉగ్రవాద సంస్థలు లేవని స్పష్టం చేసింది. దేశంలో ఇస్లామిక్ ఉగ్రవాదం ఉనికిలో ఉందని కేంద్రం స్పష్టం చేసింది.భారతదేశంలో ఎన్ని ఉగ్రవాద సంస్థలు చురుకుగా ఉన్నాయి? హోం మంత్రిత్వ శాఖ రికార్డుల ప్రకారం 2006 మాలేగావ్ బాంబు పేలుళ్లలో లేదా, ఏదైనా మరే ఇతర బాంబు పేలుళ్లలో 'హిందూ లేదా కాషాయ' పేరుతో గానీ ఉగ్రవాద సంస్థల ప్రమేయం ఉందా అనే వివరాలు కోరాడు.దీనిపై స్పందించిన కేంద్ర హోం మంత్రిత్వశాఖ దేశంలోని బాంబు పేలుళ్లలో హిందూ లేదా కాషాయ ఉగ్రవాదానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. అలాంటి పదాలతో ఉగ్రవాద సంస్థలు లేవని సమాధానం ఇచ్చిందని పి సర్దా వెల్లడించారు. ఓ వర్గం ఓట్ల కోసం కొంత మంది రాజకీయ నాయకులు హిందూ లేదా కాషాయ ఉగ్రవాదం అనే తప్పుడు ప్రచారాన్ని ప్రస్తావిస్తున్నారని ఒక భారతీయుడిగా,హిందువుగా ఈ విషయం తనను బాధించిందని అందుకే ఈ విషయంలో కేంద్రం నుంచి వివరాలు తీసుకున్నారన్నారు.

## స్నేహం పేరుతో ట్రంప్‌కు మోదీ లొంగుబాటు



కల్లూరు ధర్మేంద్ర
ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి
9705309583

నరేంద్ర మోదీని డోనాల్డ్ ట్రంప్ మరోసారి ఆలింగనాలతో ముంచి తేల్చవచ్చు తప్ప అతగాడి అంతరంగం బయటపడకుండా ఉంటుందా ! మన దేశమన్నా, మన పౌరులన్నా విద్వేషం వెళ్లగక్కేవారు మార్కో ఎలెజ్ (25) అనే సాఫ్ట్వేర్ ఇంజనీరు అమెరికా మీడియాను ఆకర్షించాడు. సామాజిక మాధ్యమంలో అతగాడు పెట్టిన పోస్టుల్లో 'భారతీయుల మీద విద్వేషాన్ని సాధారణీకరించండి' అన్నది ఒకటి. శ్వేతజాతి దురహంకారులు ఇలాంటి పోస్టులు పెట్టటం సర్వసాధారణం, ప్రతిదాన్నీ పట్టించుకోనవసరం లేదు. మరి మార్కో ప్రత్యేకత ఏమిటి? అమెరికా అసలైన అధ్యక్షుడిగా మొన్నటి వరకు అధికారం చేలాయించిన ఎలన్ మస్క్, ఆంధ్రా అల్లుడు అంటూ మన జనాలు పొంగిపోయిన ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, చివరిగా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అందరూ వాడిని సమర్థించారు, ఉద్యోగానికి రాజీనామా చేసి ఇంటికి పోతే పిలిచి తిరిగి ఇవ్వాలని చెప్పారు. కొద్ది రోజుల్లో భారత ప్రధాని నరేంద్రమోదీ అమెరికా పర్యటనకు వస్తున్నాడని వారికి తెలుసు, అయినా భారత్ మీద విద్వేషం వెళ్లగక్కిన వ్యక్తిని సమర్థించటమేమిటి ? ఈ పరిణామం మీద ఆత్మగౌరవం గురించి కబుర్లు చెప్పే కాషాయ దళాలుగానీ, కేంద్ర ప్రభుత్వం గానీ నోరు మెదపలేదు. దీన్ని లొంగుబాటు అనాలా? బానిస మనస్తత్వం అనాలా.


నరేంద్రమోదీ విధానాలు దేశానికి ప్రమాదకరంగా మారాయి, దేశాన్ని తిరోగమన దిశలో తీసుకెళ్లే విధానాలను అనుసరిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు వత్తాసు పలుకుతూ దేశ సార్వభౌమత్వాన్ని, ప్రతిష్టను నష్టపరిచే చర్యలను దేశ పౌరులు తిప్పికొట్టాలి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల భారత్‌పాక్ యుద్ధాన్ని తానే ఆపానని చెప్పడం చూస్తే, మన దేశ ప్రతిష్టను మోడీ తాకట్టు పెట్టాడనడానికి ప్రత్యక్ష నిదర్శనంగా భావించివచ్చు. మోడీ, ట్రంప్ ఇటీవల మాట్లాడిన మాటలను సైతం ఖండించలేదు. భారత పౌరులపై అమెరికా దుర్మార్గంగా వ్యవహరించడాన్ని అభ్యంతరం చెప్పడంలో విఫలమవడం మరోసారి తన క్రూరమైన వైఖరిని బహిర్గతం చేసినా మోడీ ప్రభుత్వం మౌనం వహించడం సిగ్గుచేటు. ప్రపంచవ్యాప్తంగా భారతీయ ప్రయోజనాలను కాపాడతామని గొప్పలు చెప్పుకునే కేంద్ర ప్రభుత్వం వాస్తవానికి, ఇటువంటి కఠినమైన బహిష్కరణ చర్యల నేపథ్యంలో తన సొంత ప్రజలకు కనీస గౌరవాన్ని అందించడంలో మోదీ ప్రభుత్వం విఫలమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా ముందు లొంగిపోయారు. 'మోదీ అమెరికా సందర్శించినప్పుడల్లా కోట్లాది రూపాయలు ప్రచారం కోసం ఖర్చు చేస్తున్నారు. 'హౌడీ మోడీ', 'నమస్తే ట్రంప్' వంటి ప్రజా దుర్వినియోగ కార్యక్రమాలు చేపడుతున్నారే తప్ప, భారత దేశంలో యువతకు అవసరమైన నిర్దిష్ట ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించడం లేదు.



దివాళా కోరు ఉగ్రవాద ప్రేరేపిత దేశం పాకిస్తా న్‌కు అమెరికా రెడ్ కార్పెట్ వేస్తూ తన సామ్రాజ్యవాద విష పోకడలను అనుసరిస్తుంది. ఔర్ ఏక్ బార్ ట్రంప్ సర్కార్ అంటూ అమెరికాలో జరిగిన అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో మోదీ ట్రంప్ గెలుపు కోసం భారతీయులతో మీటింగ్ ఏర్పాటు చేసి ట్రంప్‌ను గెలిపించాలని మోదీ కోరారు. అనంతరం గెలిచిన ట్రంప్ భారతీయులపై తన కర్కశాన్ని ప్రదర్శించా డు. ఇటీవల భారత్, పాక్ యుద్ధాన్ని తానే ఆపాన ని ట్రంప్ మీడియాకు చెప్పినా, మోదీ ఖండించలే దు. వాస్తవానికి అమెరికాలోని వైట్ హౌస్‌లో పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసీమ్ మునీర్‌ను ఆహ్వానించిన నేపథ్యంలోనే, మన దేశ ప్రధానమంత్రిని అమెరికాకు ఆహ్వానించడం, ట్రంప్ 140కోట్ల ప్రజలను అవమానించడమే. ఐలవ్ పాకిస్తాన్ అంటూ ట్రంప్ పలుమార్లు అన్న సందర్భాలను మనం చూస్తే, వ్యా పార దృక్పథంతో మాత్రమే ట్రంప్ ఆలోచిస్తునాడు తప్ప, భారత్‌తో స్నేహ సంబంధం పచ్చి మోసం. ఇ టీవల కాలంలో పాకిస్తాన్‌కు ప్రపంచ బ్యాంకు నుండి15వేల కోట్లు రుణాలు ఇప్పించింది ట్రంప్ కాదా ? అమెరికా నీచ పోకడలను మోదీ వ్యతిరేకించాలి. మొన్నటి వరకు భారత్‌కు తిరిగొచ్చిన వారందరూ మెరుగైన ఉపాధికోసం అమెరికా బాటపట్టినవాళ్లే. ఆస్తులు తాకట్టుపెట్టి, అందిన చోటల్లా అప్పులు చేసి ఏజెంట్లకు డబ్బులు ధారపోసి మరీ అక్కడికి వెళ్లారు. అలాంటి వారిని తిప్పి పంపడంలో కర్కశత్వం ప్రదర్శించడమూ సమంజసం కాదు. యుద్ధఖైదీల పట్ల కూడా అమానుషంగా వ్యవహరించరాదన్నది నాగరిక ప్రపంచ కట్టుబాటు. ఈ కట్టుబాట్ల సంగతి అటుంచితే కనీస మానవత్వం కూడా చూపించని ట్రంప్ సర్కారు పోకడలు గర్హనీయమైనవి. కరడుగట్టిన నేరస్తుల్లా చేతులు, కాళ్లకు సంకెళ్లు., సరుకుల రవాణా చేసే సైనిక విమానాల్లో కుక్కేసిన మూటల్లా సుమారు ముప్పై గంటలకు పైగా ప్రయాణం.. ఇది మన దేశ వలసదారుల తరలింపుపై అమెరికా అమానుష వైఖరి. ఒక వైపు భారత్‌తో తమకు స్నేహ సంబంధాలున్నాయని చెబుతూనే మనవారి ని అవమానకరంగా, అమానవీయంగా మన దేశానికి పంపింది. అయినా 'మేరా భారత్ మహాన్' అని ఉపన్యాసాలు దంచే మోదీ గొంతు మాత్రం కనీసం గా కూడా పెగల్లేదు. పైగా, అక్రమ వలసలు కాబట్టి ఈ గెంటివేతను సగౌరవంగా స్వాగతిస్తున్నట్లు విదేశాంగ మంత్రి జైశంకర్ ఘనంగా పార్లమెంట్‌లోనే ప్రకటించారు. అమెరికా అమానవీయ వైఖరికి నిరసనగా ప్రతిపక్షాలు పార్లమెంటును స్తంభింపచేయడం భారత ప్రజల మనోభావాల వ్యక్తీకరణే. ట్రంప్ తన తలతిక్క నిర్ణయాలతో మన దేశ ప్రయోజనాలకు చిల్లు పెడుతున్నా సరే, చిన్నపాటి స్పందన కూడా చూపనిది మన ప్రధాని మోదీనే. అనేక దేశాలు వలసదారులైన తమ ప్రజల పట్ల అమెరికా అమానుష చర్యల్ని వ్యతిరేకించాయి. కానీ మన 'విశ్వగురు' మాత్రం ఆ సాహసం చేయలేకపోయారు. కొలంబియా లాంటి దేశాలకు ఉన్న తెగువ, ధైర్యం కూడా మన ప్రధానికి లేవా? ప్రశ్నించడం చేతకాదా? అన్న సందేహాలు కలుగుతున్నాయి.

అమెరికా అధ్యక్షుడి ఆలోచనలు, నిర్ణయాలు, చర్యలు అనాగరికం అనడానికి ఇదొక ఉదాహరణ మాత్రమే. ట్రంప్ నిర్ణయాలు ఆ దేశాన్ని గొప్పగా మారుస్తాయో లేదో గానీ ఇతర దేశాల రాజకీయ, ఆర్థిక, భౌగోళిక స్థితుల్ని తలకిందులు చేస్తున్నాయి. ఆ దేశం ఎదుర్కొంటున్న సమస్యపై అధ్యక్షుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపడం. ఒకప్పుడు వలసల్ని ప్రోత్సహించడం ద్వారా ప్రపంచ ఆర్థిక శక్తిగా మారిన దేశం అది. నేడు అదే వలసల్ని అరికట్టాలని అనుకోవడం కేవలం వారి స్వార్థమే. అక్రమంగా వచ్చిన వాళ్ళని ఆపడం, వెనక్కి పంపించడంలో ఎవరికీ ఆక్షేపణ, అభ్యంతరం ఉండనక్కరలేదు. కానీ వారిని పంపిన తీరే అమానవీయం. తాము కఠినంగా ఉన్నామని చెప్పుకోడానికి ఇంత తీవ్రంగా వ్యవహరించనక్కరలేదు. మన దేశం ఈ విషయమై అభ్యంతరం వెలిబుచ్చి, వారిని ఉన్నంతలో మర్యాదగా తీసుకురావడానికి కృషి చెయ్యాల్సింది. ఆ దిశగా మన ప్రభుత్వం ఆలోచన కూడా చేయకపోవడం శోచనీయం. స్వదేశీ దోపిడీ ప్రభుత్వ విధానాలపై ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం పోరాడడానికి బదులు విదేశీ వ్యామోహంతో లక్షలాది మంది భారతీయ విద్యాధిక యువతీ యువకులు అమెరికా, యూరోప్, కెనడా, ఆస్ట్రేలియా వంటి సుదూర దేశాలకు వెళ్లడం తెలిసిందే. దేశం విడిచి వెళ్ళడానికి ప్రధాన కారణం స్వదేశీ పాలక వర్గాల విధానాలే. అలా వెళ్లిన మన యువతకు పరాయి నేలపై ఎన్ని అవమానాలో, ఎన్నెన్ని పరాభవాలో. ట్రంప్ అధికారానికి రావడంతో అవి పరాకాష్టకు చేరాయి. అక్రమ వలసదార్ల వల్ల అమెరికన్ కార్పొరేట్లు ఇన్నాళ్లు భారీ లాభాలు గడించారు. వారి రంగు నలుపైనా, చట్టం ఆక్రమ వలసదార్లని చెప్పినా, వారి సాంకేతిక నైపుణ్యం అమెరికన్ కార్పొరేట్లకి అంటరానిది కాదు. ట్రంప్ సర్కార్ వచ్చాక మన వాళ్ళను క్రిమినల్స్ లా వేటాడి నిర్బంధించింది. సంకెళ్ళతో అమెరికా సైనిక విమానాల్లో కుక్కి భారత్ లో పడదోసి వెళ్ళింది. అది ఆ 504 మందిని కాదు, 140 కోట్ల భారత ప్రజల్ని అవమానించడమే.

మోడీ, బిజెపి వల్లె వేస్తున్న 'వికసిత భారత్'లో నిరుద్యోగం భయంకర స్థాయికి చేరుకుంది. ప్రధాని అభ్యర్థిగా 2014 ఎన్నికల్లో యువతకు మోడీ ఇచ్చిన ప్రధాన హామీ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇచ్చి ఉంటే నిరుద్యోగిత ఎందుకు కట్టలు తెంచుకుంటుంది? స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా నినాదాలు గాలిలో కలిశాయి. చివరికి ఎక్కడిదాకా వచ్చిందంటే, విధిలేక వీధుల వెంట పకోడీలు అమ్ముకునే పని కూడా ఉపాధి, ఉద్యోగం కిందికే వస్తుందనే స్థాయికి ప్రధాని, హోంమంత్రి భాష్యాలు చెప్తున్నారు. దేశాన్ని ముందుకు నడిపించాల్సిన యువత ఉపాధి లేక నిరాశ నిస్పృహలతో బలవన్మరణాలకు పాల్పడుతున్న ఘటనలనేకం. బిజెపి ప్రచారం చేసుకునే 'అచ్చేదిన్' వచ్చి ఉంటే ఇంత మంది యువత విదేశాలకు సక్రమంగానో, దొడ్డి దారినో వెళ్లాల్సిన పరిస్థితి వచ్చేది కాదు కదా? ఈ తర్కాన్ని యువత గ్రహించాలి.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## 89 పక్షి జాతులకు నిలయం అరుణాచల్ ప్రదేశ్ నామ్సాయ్

**ఇటానగర్ :** అరుణాచల్ ప్రదేశ్ నామ్సాయ్ జిల్లాలో రెండు రోజులపాటు చేసిన సర్వేలో 89పక్షి జాతులు ఉన్నట్లు తేలింది. ఈ ప్రాంతంలోని నామ్సాయ్ చెరువు భవిష్యత్తులో ప్రపంచ పర్యాటక కేంద్రంగా మారే అవకాశాలు కూడా ఉన్నాయని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. పక్షిజాతులను కాపాడటంలో ఈ చెరువు కీలకపాత్ర వహించనున్నది. జూనోలోని నాగ సాయి చెరువులో ఈ సర్వే చేశారు. నామ్సాయ్ పట్టణానికి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఈ చెరువు ఉంది. అరుణాచల్ ప్రదేశ్ బర్డ్ క్లబ్ (ఎబిసిఐ) సంయుక్త ఆధ్వర్యంలో ప్రజాపనుల శాఖ ఈ సర్వే నిర్వహించిందని పర్యావరణ సంరక్షకుడు కోజ్ మామ గురువారంనాడు చెప్పారు. చెరువు ప్రాంతాలు పర్యావరణ పరిరక్షణకు, ప్రకృతి సమతుల్యతను రక్షించడానికి ప్రధాన వనరులుగా ఉన్నాయన్న విషయాన్ని గుర్తించేందుకు ఈ సర్వే చేపట్టారు. కీలకమైన పక్షి జాతులను ఈ సర్వే సందర్భంగా కనుగొన్నారు. దారుచి పిట్ట, పెద్ద పెద్ద కేకలు పెట్టే పక్షులు, కోకిలస్వరంతో పాడే పక్షులు, విప్పారిన తలలతో అనేక రకాల జాతుల పక్షులు విహరిస్తున్నాయి.

## మరో విడత వాణిజ్య చర్చల కోసం
# వచ్చేవారమే వాషింగ్టన్‌కు భారత్ బృందం



**న్యూఢిల్లీ:** అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పంద చర్చల నిమిత్తం భారత బృందం త్వరలో మరోసారి అమెరికా పర్యటనకు వెళుతుంది. కేంద్ర ప్రభుత్వ అధికారులు గురువారంనాడు ఈ విషయం వెల్లడించారు. మళ్ళీ ఎప్పుడు పర్యటనకు వెళతారన్న తేదీని ఇంకా ఖరారు చేయలేదు. కానీ సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం బహుశ వచ్చేవారం మళ్ళీ వాషింగ్టన్‌లో చర్చలకు భారత బృందం వెళుతుంది. వ్యవసాయం, ఆటోమొబైల్స్ వంటిరంగాలలోచర్చల సందర్భంగా ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంపై ఏర్పడిన వైరుధ్యాలను పరిష్కరించుకునేందుకు మరో విడత చర్చలు జరుగుతాయి. వాణిజ్యశాఖలో ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ నాయకత్వంలో భారత ప్రభుత్వ బృందం జూన్ 26 నుండి జులై 2వ తేదీ వరకూ వాషింగ్టన్‌లో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం చేసుకునే విషయంపై చర్చలు జరిపి న్యూఢిల్లీకి తిరిగి వచ్చింది.వ్యవసాయం,పాల ఉత్పత్తులకు సంబంధించిన సుంకాలపై రాయితీలు ఇవ్వాలని అమెరికా ప్రభుత్వం డిమాండ్ చేస్తూ ఉండటంతో భారత ప్రభుత్వానికి సంకట పరిస్థితి ఎదురైంది. పశుసంవర్థక, క్షీర ఉత్పత్తులకు సంబంధించిన రంగంలో భారత ప్రభుత్వ వాణిజ్య ఒప్పందాలలో ఇప్పటివరకూ తన భాగస్వామ్యదేశాలకు ఎలాంటి ఉచిత వాణిజ్య ఒప్పందాలను, రాయితీలకు అవకాశం ఇవ్వలేదు. "మేం ఏదో తాత్కాలిక ఒప్పందం, మొదటిదశ ఒప్పందానికి మధ్య తేడా చూపించాలనుకోవడంలేదు. పూర్తిస్థాయి ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం చేసుకోవడం కోసం భారత ప్రభుత్వ సంప్రదింపులు చేస్తోంది. ప్యాకేజీ పూర్తయితే అది తాత్కాలిక ఒప్పందం అవుతుంది, తదుపరి చర్చలు మళ్ళీ ముందుకు కొనసాగుతాయి" అని పేరు చెప్పడానికి ఇష్టపడని సంబంధిత అధికారి చెప్పారు. ముఖాముఖి చర్చలతోపాటు డిజిటల్ మార్గాలలో కూడా సంభాషణలు జరుగుతున్నాయని చెప్పారు. భారత్‌పై అమెరికా విధించిన 26 శాతం అదనపు సుంకాల అమలు గడువు తేదీని ఆగస్టు ఒకటో తేదీ వరకూ పొడిగించిన నేపథ్యంలో చర్చల ద్వారా ఈ సుంకాలను తప్పించుకోవాలని భారత ప్రభుత్వం భావిస్తున్నది. స్టీల్, అల్యూమినియంలపై అమెరికా విధించిన 50 శాతం సుంకాలు, ఆటో రంగంపై విధించిన 25 శాతం సుంకాల నుండి కూడా ఉపశమనం పొందాలని భారత్ కోరుతున్నది. అదేవిధంగా ఒకవేళ ఈ ఉపశమనం లభించకపోతే ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనల ప్రకారం అమెరికాపై ఎదురు సుంకాలు విధించేందుకు సంబంధించిన ఒక ప్రత్యామ్నాయం గురించి కూడా కేంద్రం ఆలోచిస్తున్నది. గడువు తేదీన ప్రాతిపదికపై భారతదేశం సాధ్యమైనంత త్వరగా ఒప్పందాలు చేసుకోదని గతవారం కేంద్ర వాణిజ్య,పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. పూర్తిగా కుదిరిన ఒప్పందంపైనే భారత్ సంతకాలు చేస్తుందన్నారు. జాతీయ ప్రయోజనాలే కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమని ఆయన చెప్పారు. రెండు దేశాలు ప్రయోజనం పొందినప్పుడు మాత్రమే విదేశీ వాణిజ్య ఒప్పందం సాధ్యపడుతుంది. ఇది రెండు దేశాలకూ సమానంగా వర్తిస్తుంది. భారత్‌తో సహా అమెరికాతో వాణిజ్యం చేసే దేశాలపై భారీ ఎత్తున సుంకాలు విధిస్తున్నట్లు గడచిన ఏప్రిల్ రెండో తేదీన ట్రంప్ ప్రకటించారు.ఆ తర్వాత ఈ సుంకాల అమలును 90 రోజులు అంటే జులై 9 వ తేదీ వరకూ వాయిదా వేశారు. ఇప్పుడు మళ్ళీ మరో నెలరోజులు ఆగస్టు 1వ తేదీ వరకూ వాయిదా వేశారు. ఈనెల ఏడో తేదీన ట్రంప్ యంత్రాంగం అనేక దేశాలకు టారిఫ్ లేఖలు పంపింది. అధ్యక్షభవనం ఈ లేఖలు అందుకున్న దేశాలలో భారత ప్రభుత్వం లేకపోవడం పెద్ద ఊరట. మొత్తం 21 దేశాలు పైగా ఈ టారిఫ్ లేఖలు అందుకున్నాయి.

## యెమెన్‌లో భారతీయ నర్స్ నిమిషాప్రియ ఉరిశిక్షను నిలిపివేయించండి

### విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్‌కు సిపిఐ రాజ్యసభ ఎంపి సందోష్‌కుమార్ లేఖ
### ఉరిశిక్ష నిలిపివేతకు ప్రతీ దౌత్య, మానవతా మార్గాలను ఉపయోగించాలని విజ్ఞప్తి



**న్యూఢిల్లీ :** యెమెన్‌లో భారతీయురాలు నిమిషాప్రియ ఉరిశిక్షను నిలిపివేయడానికి ప్రతీ దౌత్య, మానవతా మార్గాలను ఉపయోగించాలని భారత కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ విషయమై గురువారం సిపిఐ రాజ్యసభ ఎంపి పి.సందోష్‌కుమార్ విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్‌కు రాసిన ఒక లేఖలో ఆయన విజ్ఞప్తి చేశారు. ఆయన రాసిన లేఖలో, కొన్ని రోజుల్లో ఉరిశిక్ష అమలు చేయబడే అవకాశం ఉందన్న నివేదికలు అందాయని సందోష్‌కుమార్ గుర్తుచేశారు. 'నిమిషా కేసు ప్రజల మనస్సాక్షిని కదిలించడమే కాకుండా, చట్టపరమైన రక్షణలు లేకపోవడం, ఆమె ఎదురైన కఠిన పరీక్షలోని మానవతా కోణాల గురించి తీవ్రమైన ఆందోళనలను కూడా లేవనెత్తింది' అని సందోష్‌కుమార్ అన్నారు. నిమిషా ప్రియ నర్సుగా పనిచేయడానికి యెమెన్‌కు వెళ్లిందని, చాలామంది ఇతరులు కూడా తమ మాతృభూమిని విడిచిపెట్టి విదేశాలలో జీవనోపాధి కోసం వెళ్లారని చెప్పారు. ఆమె అక్కడ గడిపిన సంవత్సరాలు చాలా బాధలతో నిండిఉన్నాయని, ఆమె తన వ్యాపార భాగస్వామి చేతిలో పదేపదే వేధింపులు, దుర్భాషలు, బలవంతంగా భరించిందని సూచిస్తున్నదన్నారు. 'ఆమె పాస్‌పోర్ట్ నిరాకరించబడి, తరచూ భయాలకు గురయ్యింది. నిరంతర దోపిడీ కారణంగా ఆమె మానసికంగా తీవ్ర ఒత్తిడికి లోకి నెట్టివేయబడిందనే విషయం అర్థమవుతోంది' అని ఆయన చెప్పారు. ఆ తర్వాత జరిగిన సంఘటనలు విషాధకరమైన మలుపు అని, ఇప్పుడు ఆమెకు మరణశిక్ష విధించబడిందని కుమార్ తెలిపారు. 'ఇటువంటి పరిస్థితులలో ప్రభుత్వ పాత్ర ముఖ్యంగా విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పాత్ర చాలా కీలకం అవుతుందన్నారు. న్యాయం, కరుణ కోసం నిమిషా కుటుంబం చేసిన విజ్ఞప్తిలో భారత కమ్యూనిస్టు పార్టీ నిరంతరం వారికి అండగా నిలుస్తోంది' అని సందోష్‌కుమార్ పేర్కొన్నారు. భారత ప్రభుత్వం చర్యలు సులభతరం చేస్తే యెమెన్ న్యాయవ్యవస్థ దియత్ (రక్త ధనం) పరిష్కారాన్ని అనుమతిస్తుందని వామపక్ష నేత, రాజ్యసభ ఎంపి సందోష్‌కుమార్ చెప్పారు. ఇది చర్చలకు ఒక అవకాశం అన్నారు. ఈ సందర్భంలో సాధ్యమైనంత దౌత్య, మానవతా మార్గాల ద్వారా ఉరిశిక్షను నిలిపివేయాలని, ఈ అన్యాయమైన శిక్షను నివారించడానికి అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను అనుసరించాలని నేను మిమ్మల్ని గట్టిగా కోరుతున్నానని, ఇది ఒకరి ప్రాణాలను నిలబెట్టడానికి ఉపకరించేదే కాకుండా ఒక దేశం విదేశాలలో ఉన్న తన పౌరులను రక్షించుకోవాల్సిన బాధ్యత అన్నారు. నిమిషా ప్రియ కేరళ రాష్ట్రంలోని పాలక్కాడ్ జిల్లా కొల్లెన్‌గోడ్‌కు చెందినవారు.

# సిఎం పదవి ఖాళీగా లేదు

### నాయకత్వమార్పుపై ఎలాంటి చర్చ జరగలేదు
### ఊహాగానాలను తోసిపుచ్చిన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య




**న్యూఢిల్లీ :** తనను పదవి నుంచి తొలగించే అవకాశం ఉందనే ఊహాగానాలను కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తోసిపుచ్చారు. కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కర్ణాటక ఇన్‌చార్జ్ రణ్‌దీప్ సింగ్ సుర్జేవాలా అలాంటి చర్యను తోసిపుచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. 'నాయకత్వంలో ఎటువంటి మార్పు లేదని సుర్జేవాలా స్పష్టంగా చెప్పారు. నాయకత్వ అంశం చర్చలో లేదు. ఆయన ఇలా చెప్పినప్పుడు, ఊహాగానాలు ఎందుకు వస్తున్నాయి? సుర్జేవాలా కర్ణాటకకు ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. ఎటువంటి ఊహాగానాలు ఉండకూడదని చెప్పినా మీడియా ఇప్పటికీ ఊహాగానాలు చేస్తోంది. పార్టీలో దీని గురించి ఎటువంటి చర్చ లేదు' అని సిద్ధరామయ్య గురువారం ఢిల్లీలో విలేకరులతో అన్నారు. పార్టీ హైకమాండ్‌దే నిర్ణయమని, దానికి కట్టుబడి ఉంటామని ముఖ్యమంత్రి అన్నారు. అధికార భాగస్వామ్య ఏర్పాటుకు సంబంధించిన ప్రశ్నలపై సిద్ధరామయ్య మాట్లాడుతూ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాలు పూర్తి చేస్తున్నప్పుడు అలాంటి అంశాలను లేవనెత్తడం సహజం, కానీ అలాంటి ఒప్పందం ఉందని కాదని అర్థం కాదన్నారు. అలాంటి ఒప్పందం ఉంటే తాను దు సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉంటానని ఇటీవల చెప్పనే చెప్పనన్నారు. తాను పదవిలో ఉండగానే పుకార్లు ఎందుకు వచ్చా యో ఆశ్చర్యం వేస్తుందన్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రి పదవి ఖాళీగా ఉందా? మరి అలాంటి ఊహాగానాలు ఎందుకు వస్తున్నాయి? ఎవరైనా వ్యక్తిగత అభిప్రాయాన్ని పంచుకుంటే, అది పార్టీ నిర్ణయం అవుతుందా? ఖర్గే, రాహుల్ గాంధీ దీని గురించి మాట్లాడుకోవాలి అని అన్నారు. ఈ విషయంపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తనను ఎటువంటి చర్చకు ఆహ్వానించలేదని, కానీ తానుసుర్జేవాలానుకలవాల్సి ఉందని సిద్ధరామయ్య అన్నారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై ఆయన మాట్లాడుతూ 'నాయకత్వ మార్పు, మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై ఎటువంటి చర్చ జరగలేదు. ముఖ్యమంత్రి పదవి ఖాళీ లేదని డికె శివకుమార్ (ఉప ముఖ్యమంత్రి) స్వయంగా చెప్పారు' అని అన్నారు. సిద్ధరామయ్య తన ప్రభుత్వ విధానాలను సమర్థించుకుంటూ, 'అణగారిన వర్గాలనుఉద్ధరించే కార్యక్రమాలపై చాలా చర్చల తర్వాత ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంది' అని అన్నారు.

## బ్రిడ్జి కూలిన ఘటనలో 16కు చేరిన మృతులు

**వడోదర :** గుజరాత్‌లోని వడోదర జిల్లాలో మహిసాగర్ నదిపై వంతెన కూలిపోయిన ఘటనలో మృతుల సంఖ్య 16కి చేరింది. ప్రస్తుతం గల్లంతైన ముగ్గురు నలుగురి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఆనంద్, వడోదర జిల్లాలను కలిపే నాలుగు దశాబ్దాల నాటి మహిసాగర్ వంతెనలో ఒక భాగం బుధవారం ఉదయం వడోదరలోని పద్రా పట్టణానికి సమీపంలోని గంభీర గ్రామం సమీపంలో మునిగిపోవడంతో అనేక వాహనాలు నదిలో పడిపోయాయి. 'ఇప్పటివరకు 16 మృతదేహాలను వెలికితీశారు. ఇంకా ముగ్గురు నుండి నలుగురు వ్యక్తులు కనిపించకుండా పోయారు' అని వడోదర జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రోహన్ ఆనంద్ తెలిపారు. గాలింపు, రక్షణ చర్యలు కొనసాగుతున్నాయన్నారు. జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డిఆర్‌ఎఫ్), రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డిఆర్‌ఎఫ్) బృందాలు నదిలో ప్రాణాలతో బయటపడిన వారిని లేదా బాధితుల మృతదేహాలను కనుగొనడానికి గాలింపు చర్యలు చేపడుతున్నాయని వడోదర కలెక్టర్ అనిల్ ధమేలియా గతంలో చెప్పారు. ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు నది దిగువన నాలుగు కిలోమీటర్ల వరకు గాలింపు చర్యలు చేపడుతున్నాయి... తప్పిపోయిన వ్యక్తుల గురించి ప్రజలు తమ కంట్రోల్ రూమ్‌కు కాల్ చేసి తెలియజేయవచ్చని విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. ఒకవైపు వర్షం, మరోవైపు నదిలో మందపాటి బురద పొర ఉండటం వల్ల రెస్క్యూ ఆపరేషన్ ఒక సవాలుతో కూడుకున్న పనిగా మారిందని, ఈ పరిస్థితిలో ఏ యంత్రం పనిచేయడం లేదని కలెక్టర్ తెలిపారు. నది మధ్యలో మునిగిపోయిన వాహనాల వద్దకు తీసుకెళ్లడానికి ఒడ్డున ప్రత్యేక వంతెన నిర్మిస్తున్నారన్నారు. మధ్య గుజరాత్‌ను రాష్ట్రంలోని సౌరాష్ట్ర ప్రాంతానికి కలిపే గంభీరముజ్‌పూర్ వంతెన స్లాబ్ బుధవారం ఉదయం 7గంటల ప్రాంతంలో కూలిపోయింది. వాహనాలు నదిలో పడిపోయాయని అధికారులు తెలిపారు. రక్షించబడిన తొమ్మిది మందిలో ఐదుగురు గాయపడి వడోదరలోని ఎస్‌ఎస్‌జి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, గాయపడిన వారి పరిస్థితి సాధారణంగా ఉందని జిల్లా ఎస్పీ తెలిపారు.

# హర్యానాలో భూకంపం

### రిక్టర్ స్కేలుపై తీవ్రత 4.4గా నమోదు
### ఢిల్లీ-ఎన్‌సిఆర్ ప్రాంతం అంతటా ప్రకంపనలు



**న్యూఢిల్లీ :** హర్యానాలో భూమి కంపించింది. గురువారం ఉదయం ఝజ్జర్ సమీపంలో 4.4 తీవ్రతతో భూ ప్రకంపనలు వచ్చాయి. దీంతో ఢిల్లీ-ఎన్‌సిఆర్ ప్రాంతం అంతటా ప్రకంపనలు సంభవించాయి. ఝజ్జర్‌కు ఈశాన్యంగా 3 కి.మీ.ష ఢిల్లీకి పశ్చిమాన 51 కి.మీ. దూరంలో భూకంప కేంద్రం నెలకొని ఉందని, ఉదయం 9.04 గంటలకు 10 కి.మీ. లోతులో భూకంపం సంభవించిందని జాతీయ భూకంపాల కేంద్రం తెలిపింది. ఝజ్జర్‌తో పాటు, పొరుగున ఉన్న రోహ్‌తక్, గురుగ్రామ్ జిల్లాలు, పానిపట్, హిసార్, మీరట్‌లో కూడా భూకంపం సంభవించింది. ఇది శక్తివంతమైన భూకంపమని, తన జీవితంలో ఇంత బలంగా రావడం ఇదే మొదటి సారి అని అనుకుంటున్నాను అని ఝజ్జర్‌లోని ఒక వృద్ధుడు చెప్పారు. ఝజ్జర్‌లో ప్రకంపనలు సంభవించినప్పుడు చాలా మంది తమ ఇళ్ల నుండి బయటకు పరుగులు తీశారని ఆయన అన్నారు. ఢిల్లీలో, ప్రకంపనలు వచ్చిన వెంటనే పొరుగు ప్రాంతాలు భయాందోళనకు గురయ్యాయి. ప్రజలు తమ ఇళ్ల నుండి బయటకు పరుగులు తీశారు. వారిలో చాలామంది చెప్పులు లేకుండా ఉండడం కనిపించింది. ఇప్పటికీ వారి నైట్‌వేర్‌లోనే ఉన్నారు. వికాస్‌పురి నివాసి సుల్తాన్ ఖాన్ ఈ అనుభవం భయానకంగా ఉందని అన్నారు. 'మేము అకస్మాత్తుగా భూమి కంపించినట్లు భావించి మా ఇంటి నుండి బయటకు పరిగెత్తాము. తరువాత అది భూకంపం అని గ్రహించాము. మొదట వేడి, తరువాత రాత్రిపూట వర్షం,, ఇప్పుడు ఈ మూడు కూడా మాకు చాలా అసౌకర్యాన్ని కలిగించాయి' అతను పిటిఐతో చెప్పాడు. మరో నివాసి అహ్మద్ అలీ మాట్లాడుతూ 'ఇది భయానక క్షణం. ప్రకంపనలు ఎక్కువసేపు ఉండలేదు కానీ మమ్మల్ని మేల్కొలిపేంత బలంగా ఉన్నాయి. నా పిల్లలు ఇప్పటికీ భయపడుతున్నారు. ప్రకంపనలు వచ్చిన తర్వాత చాలా మంది కొద్దిసేపు బయటే ఉండిపోయారు. మరో బలమైన భూకంపం వస్తుందేమోనని భయపడి గత 45 నిమిషాలుగా మేము బయట నిలబడి ఉన్నామని మరొక వికాస్పురి నివాసి చెప్పారు. రాత్రి భారీ వర్షం కురవడంతో తాము గాఢ నిద్రలో ఉన్నామని, ప్రకంపనలువచ్చిన వెంటనే భయంతో ఇంటి నుండి బయటకు పరుగెత్తామని చెప్పారు. నోయిడా, గ్రేటర్ నోయిడాలో ఇలాంటి దృశ్యాలు కనిపించాయి. గ్రేటర్ నో యిడాలోని కేంద్రీయ విహార్ నివాసి నీలం శర్మ, తన కుటుంబానికి అల్పాహారం వండేటప్పుడు తాను వంటగదిలో ఉన్నానని చెప్పింది. నేల కంపించిందని, కిటికీ నుండి బయటకు చూసేసరికి, పొరుగువారు అప్పటికే బయట నిలబడి భూకంపం గురించి మాట్లాడుకుంటున్నారని ఆమె చెప్పింది. యోగా చేస్తున్నప్పుడు అకస్మాత్తుగా గదిలోని సీలింగ్ ఫ్యాన్ కదులుతున్నట్లు చూశాను. గాలి కారణంగా అని అనుకున్నాను, కానీ ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లో భూకం పం వచ్చిందని నా కొడుకు నాకు చెప్పాడని మరొక నివాసి ఇందు శర్మ అన్నారు. చాలామంది భూకంపం గురించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఫోటోలు, వీడియోలను పంచుకున్నారు.

## స్థానిక ఎన్నికల కోసం కూటమి ఏర్పాటు అవసరం లేదు : రౌత్

**ముంబయి :** మహారాష్ట్రలో జరగనున్న స్థానిక, పురపాలక ఎన్నికలకు ఇండియా కూటమి లేదా మహా వికాస్ అఘాడి (ఎంవిఎ) వంటి ఏర్పాట్లు అవసరం లేదని శివసేన (యుబిటి) నాయకుడు సంజయ్ రౌత్ అభిప్రాయం వ్యక్తం చేశారు. గురువారం ఆయన ముంబయిలో విలేకరులతో మాట్లాడారు. ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని శివసేన (యుబిటి), రాజ్ థాక్రే మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్‌ఎస్) రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో సంయుక్తంగా పోటీ చేయాలని ప్రజల నుంచి ఒత్తిడి పెరుగుతోందని రౌత్ అన్నారు. అయితే, ఎన్నికల షెడ్యూల్ ఇంకా ప్రకటించనందున తాము తగిన సమయంలో నిర్ణయం తీసుకుంటామన్నారు.మహారాష్ట్రఅసెంబ్లీఎన్నికలకోసంఎంవిఎ,లోక్‌సభఎన్నికలకోసం ఇండియా కూటమి ఏర్పడ్డాయి. పురపాలక సంఘాల ఎన్నికల విషయానికి వస్తే అలాంటి పొత్తుల అవసరం లేదు అన్నారు. దేశవ్యాప్తంగా దాదాపు రెండు డజన్ల పార్టీలు ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయన్స్(ఇండియా)లో భాగంగా ఉన్నాయి. అయితే ఎంవిఎలో కాంగ్రెస్,సేన (యుబిటి), ఎన్‌సిపి (ఎస్‌పి) ఉన్నాయి. ఈ ఏడాది చివర్లో మహారాష్ట్రలో పురపాలికలకు ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ధనిక సంస్థ అయిన బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బిఎంసి)కూడా ఉంటుంది. 2022లో విడిపోయిన బాల్ థాక్రే స్థాపించిన శివసేన దాదాపు రెండు దశాబ్దాలుగాబిఎంసిని నియంత్రించింది. దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలోని ప్రభు త్వం మహారాష్ట్ర పాఠశాలల్లో 1వ తరగతి నుండి హిందీని మూడవ భాషగా ప్రవేశపెడుతూ జారీ చేసిన రెండు ప్రభుత్వ తీర్మానాలను రద్దు చేసినందుకు ఇటీవల ముంబయిలో జరిగిన అవాజ్ మరాఠీచా' అనే సమావేశంలో రాజ్ ఉద్ధవ్‌తో వేదికను పంచుకున్నారు. శివసేన, ఎంఎన్‌ఎస్ (స్థానిక సంస్థ) ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తున్నాయని నేను చెప్పలేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని శివసేన, ఎంఎన్‌ఎస్‌పై ప్రజల నుండి ఒత్తిడి, డిమాండ్ ఉందని చెప్పానన్నారు. 75 సంవత్సరాల వయస్సు తర్వాత పార్టీని వీడటం గురించి సంఘ్ సిద్ధాంతకర్త దివంగత మోరోపంత్ పింగ్లే చేసిన ప్రకటన గురించి ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ప్రస్తావించడాన్ని రౌత్ ప్రస్తావించారు. భగవత్ ప్రకటన ప్రధాని మోదీకి సెప్టెంబర్‌లో 75 ఏళ్లు నిండినప్పుడు ఆయన అత్యున్నత పదవి నుంచి వైదొలగాలని సూచిస్తుందన్నారు.

## జమ్ము బేస్ క్యాంపు నుంచి అమర్‌నాథ్‌కు 7 వేల మంది యాత్రీకులు



**జమ్ము:** దక్షిణ కశ్మీర్ హిమాలయాలలోని వార్షిక అమర్‌నాథ్ యాత్రకు గురువారం ఉదయం 7,300 మందికి పైగా యాత్రికుల బృందం భగవతి నగర్ బేస్ క్యాంప్ నుండి బయలుదేరిందని అధికారులు తెలిపారు. ఈనెల 3న అనంతనాగ్ జిల్లాలోని పహల్గామ్, గండేర్‌బాల్ జిల్లాలోని బాల్తాల్ జంట ట్రాక్‌ల నుండి 38 రోజుల వార్షిక యాత్ర ప్రారంభం కాగా, నాటి నుండి సుమారు 1.28 లక్షల మంది యాత్రికులు 3,880 మీటర్ల ఎత్తులో ఉన్న పవిత్ర శివలింగాన్ని సందర్శించారని అధికారులు తెలిపారు. అధికారుల తెలిపిన వివరాల ప్రకారం, 7,307 మంది యాత్రికుల్లో 5,534 మంది పురుషులు, 1,586 మంది మహిళలు, 25 మంది చిన్నారులు, 162 మంది సాధువులు,సాధ్వులు 284 వాహనాల్లో ఉదయం 3:15 నుండి 3:58 గంటల మధ్య గట్టి భద్రత మధ్య బయలుదేరారు. గండేర్‌బాల్ జిల్లాలోని 14 కిలోమీటర్ల బాల్తాల్ మార్గం కోసం 137 వాహనాల్లో 3,081 మంది యాత్రికులు బయలుదేరగా, అనంత్‌నాగ్ జిల్లాలోని 48 కిలోమీటర్ల సాంప్రదాయ పహల్గామ్ మార్గం ద్వారా 147 వాహనాల్లో 4,226 మంది యాత్రికులు బయలుదేరారు.దీంతో 2వ తేదీన లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా మొదటి బ్యాచ్‌ను జెండా ఊపి ప్రారంభించినప్పటి నుండి మొత్తం 62,788 మంది యాత్రికులు జమ్ము బేస్ క్యాంప్ నుండి లోయకు బయలుదేరారు. ఏప్రిల్ 22న పహల్గామ్ దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన తరువాత భగవతి నగర్ బేస్ క్యాంప్‌ను బహుళ అంచెల భద్రతా కవర్‌లో ఉంచారు. తీర్థయాత్ర కోసం ఇప్పటివరకు 4 లక్షలకు పైగా ప్రజలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. యాత్ర ఆగస్టు 9న ముగుస్తుంది. గత సంవత్సరం, సహజంగా ఏర్పడిన మంచు లింగం ఉన్న గుహ మందిరంలో 5.10 లక్షలకు పైగా యాత్రికులు పూజలు చేశారు.


**PUBLIC NOTICE**

**It is hereby informed to general public and to all the persons who are relating to the below "Schedule Property" that my Client ROMPIKKUNTLA TIRUPATHI RAMESH KUMAR S/O LATE R.VASUDEVA RAO, Age: 69 Years, Occ: Retd. Employee, R/o H.No. 8-56/22/S-1, Dwarakapuri Colony, Dammaiguda, Keesara Mandal, M.M.Dist., T.S-500083, (Cell No.9246540971) is the** absolute owner of all that the piece and parcel of the
1.) Plot Bearing No. 04, in Sy.No.389/2, admeasuring 300 yards, and is bounded by:- NORTH : Plot No.31, SOUTH : Owner's Land, EAST : 25'-0" WIDE ROAD, WEST : Plot No.3, (Here in after called as "Scheduled property-I"), **VIDE SALE DEED DOCUMENT NO. 656/1983, DT.09-02-1983, registered at SRO-Medchal and**
2.) Plot Bearing No. 02, admeasuring 285 yards, Situated at Rampally Village, Kapra (M), Medchal-Malkajgiri dist., Telangana, and is bounded by:- NORTH : Plot No.33, SOUTH : Plot No.01, EAST : 25'-0" WIDE ROAD, WEST : 30'-0" WIDE ROAD, (Here in after called as "Scheduled property-II"), **VIDE SALE DEED DOCUMENT NO. 7553/1984, DT.18-07-1984, registered at SRO-Medchal.**, above both are in Sy.No.389/2, Situated at Rampally Village, keesara Mandal, M.M.Dist., and all above purchased **from KANDAKATLA ACHIREDDY S/O RAJI REDDY**
That my client lost and misplaced the above Said related Schedule Property-I and II Documents i.e **SALE DEED DOCUMENT NO. 656/1983, DT.09-02-1983 and SALE DEED DOCUMENT NO. 7553/1984, DT.18-07-1984, both registered at SRO-Medchal, at about 11 A.M, while travelling from Mallapur to ECIL, Rampally by auto Taxi, along with other Plot Owners.**
Hence it is requested to general public that whoever found the above said Sale Deed Documents may contact to the undersigned Address and it is cautioned to all that not to deal any kind of transactions with false unknown persons, who are illegally possessing the above said lost original sale Deed Documents and whoever dealing except with my client are at their own risk and loss and also prosecuted legally. Also who ever found or in possession above said Sale deed document it is advised to the undersigned who ever found or in possession and suitably rewarded.
**Hence who ever having any legal right, interest or claim and having any objections over the above said "Scheduled Property" may raise their objections and contact along with their Legal Title Deeds, if any, to the undersigned address, within 07 days from this date.**

**DEPA GAYATHRI REDDY**
**ADVOCATE**
CELL No: 7386612288
OFF: H.NO. 5-13-51, Indiranagar, Meerpet, Kapra circle, Uppal (M), M.M Dist., HYD., T.S.
Enroll. No. T.S/622/2022

**PUBLIC NOTICE**

**It is hereby informed to general public and to all the persons who are relating to the below "Schedule Property" that my Client BALIJAPALLY CHANDRA MOULI S/O LATE RAMA RAO, Age: 69 Years, Occ: Retd. Employee, R/o 3-11-45/6/204, Gokhale Nagar, Ramanthapur, Amberpet, Hyd, T.S-500013, (Cell No.7286904456) is the** absolute owner of all that the piece and parcel of the Plot Bearing No. 33, in Sy.No.389/2, admeasuring 228 yards, Situated at Rampally Village, Kapra (M), Medchal-Malkajgiri dist., Telangana, and is bounded by:- NORTH : 30'-0" WIDE ROAD, SOUTH : Plot No.2, EAST : 25'-0" WIDE ROAD, WEST : 30'-0" WIDE ROAD, (Here in after called as "Scheduled property") purchased **from KANDAKATLA ACHIREDDY S/O RAJI REDDY, VIDE SALE DEED DOCUMENT NO. 651/1983, DT.09-02-1983, registered at SRO-Medchal.**
That my client lost and misplaced the above Said related Schedule Property Documents i.e **SALE DEED DOCUMENT NO. 651/1983, DT.09-02-1983, registered at SRO-Medchal, on 05-07-2025 at about 11 A.M, while travelling from Mallapur to ECIL, Rampally by auto Taxi, along with other Plot Owners.**
Hence it is requested to general public that whoever found the above said Sale Deed Documents may contact to the undersigned Address and it is cautioned to all that not to deal any kind of transactions with false unknown persons, who are illegally possessing the above said lost original sale Deed Documents and whoever dealing except with my client are at their own risk and loss and also prosecuted legally. Alsowho ever found or in possession above said Sale deed document it is advised to the undersigned who ever found or in possession and suitably rewarded.
**Hence who ever having any legal right, interest or claim and having any objections over the above said "Scheduled Property" may raise their objections and contact along with their Legal Title Deeds, if any, to the undersigned address, within 07 days from this date.**

**DEPA GAYATHRI REDDY**
**ADVOCATE**
CELL No: 7386612288
OFF: H.NO. 5-13-51, Indiranagar, Meerpet, Kapra circle, Uppal (M), M.M Dist., HYD., T.S.
Enroll. No. T.S/622/2022

**PUBLIC NOTICE**

**It is hereby informed to general public and to all the persons who are relating to the below "Schedule Property" that my Client SMT. ERROLLA PRAMEELA W/O LATE ERROLLA DEVADAS, Age: 65 Years, Occ: House Wife, R/o B-225, HCL Township, Mallapur, Medchal Malkajgiri, Hyd, T.S-500062, (Cell No.9705254555) and 4 others are the** absolute owners of all that the piece and parcel of the Plot Bearing No. 07, in Sy.No.389/2, admeasuring 300 yards, Situated at Rampally Village, Kapra (M), Medchal-Malkajgiri dist., Telangana, and is bounded by:- NORTH : Plot No. 28, SOUTH : Owner's Land, EAST : Plot No.8, WEST : 25'-0" WIDE ROAD, (Here in after called as "Scheduled property") purchased by **LATE E. DEVADAS S/O LATE BUCHAIAH, during his life time from KANDAKATLA ACHIREDDY S/O RAJI REDDY, VIDE SALE DEED DOCUMENT NO. 7551/1984, DT.16-10-1984, registered at SRO-Medchal. Whereas E. DEVADAS S/O LATE BUCHAIAH, was retired HCL Employee, died on 20-08-2011, leaving behind his wife SMT. ERROLLA PRAMEELA and 4 others as his Legal Heirs.**
That my client lost and misplaced the above Said related Schedule Property Documents i.e **SALE DEED DOCUMENT NO. 7551/1984, DT.16-10-1984, registered at SRO-Medchal, on 05-07-2025 at about 11 A.M, while travelling from Mallapur to ECIL, Rampally by auto Taxi, along with other Plot Owners.**
Hence it is requested to general public that whoever found the above said Sale Deed Documents may contact to the undersigned Address and it is cautioned to all that not to deal any kind of transactions with false unknown persons, who are illegally possessing the above said lost original sale Deed Documents and whoever dealing except with my client are at their own risk and loss and also prosecuted legally. Alsowho ever found or in possession above said Sale deed document it is advised to the undersigned who ever found or in possession and suitably rewarded.
**Hence who ever having any legal right, interest or claim and having any objections over the above said "Scheduled Property" may raise their objections and contact along with their Legal Title Deeds, if any, to the undersigned address, within 07 days from this date.**

**DEPA GAYATHRI REDDY**
**ADVOCATE**
CELL No: 7386612288
OFF: H.NO. 5-13-51, Indiranagar, Meerpet, Kapra circle, Uppal (M), M.M Dist., HYD., T.S.
Enroll. No. T.S/622/2022

**PUBLIC NOTICE**

**It is hereby informed to general public and to all the persons who are relating to the below "Schedule Property" that my Client BALIJAPALLI RAMA PRASAD S/O LATE RAMA RAO, Age: 70 Years, Occ: Retd. Employee, R/o Flat No.310, 3rd Floor, Block No.4, Daffodil, Near ZPH School, Krishnakunj Gardens, Quthbullahpur, R.R.Dist., Hyd, T.S-500055, (Cell No.7286904456) is the** absolute owner of all that the piece and parcel of the Plot Bearing No. 29, in Sy.No.389/2, admeasuring 300 yards, Situated at Rampally Village, Kapra (M), Medchal-Malkajgiri dist., Telangana, and is bounded by:- NORTH : 30'-0" WIDE ROAD, SOUTH : Plot No.6, EAST : 25'-0" WIDE ROAD, WEST : Plot No.30, (Here in after called as "Scheduled property") purchased **from KANDAKATLA ACHIREDDY S/O RAJI REDDY, VIDE SALE DEED DOCUMENT NO. 2121/1983, DT.02-04-1983, registered at SRO-Medchal.**
That my client lost and misplaced the above Said related Schedule Property Documents i.e **SALE DEED DOCUMENT NO. 2121/1983, DT.02-04-1983, registered at SRO-Medchal at about 11 A.M, while travelling from Mallapur to ECIL, Rampally by auto Taxi, along with other Plot Owners.**
Hence it is requested to general public that whoever found the above said Sale Deed Documents may contact to the undersigned Address and it is cautioned to all that not to deal any kind of transactions with false unknown persons, who are illegally possessing the above said lost original sale Deed Documents and whoever dealing except with my client are at their own risk and loss and also prosecuted legally. Alsowho ever found or in possession above said Sale deed document it is advised to the undersigned who ever found or in possession and suitably rewarded.
**Hence who ever having any legal right, interest or claim and having any objections over the above said "Scheduled Property" may raise their objections and contact along with their Legal Title Deeds, if any, to the undersigned address, within 07 days from this date.**

**DEPA GAYATHRI REDDY**
**ADVOCATE**
CELL No: 7386612288
OFF: H.NO. 5-13-51, Indiranagar, Meerpet, Kapra circle, Uppal (M), M.M Dist., HYD., T.S.
Enroll. No. T.S/622/2022

**PUBLIC NOTICE**

**It is hereby informed to general public and to all the persons who are relating to the below "Schedule Property" that my Client SRI. DAMERLA VENKATA RAMANA VIJITH S/O LATE DAMERLA VENKAT RATNAM, Age: 29 Years, Occ: Employee, R/o 30-276/13/25, P.B.Nagar, Old Safilguda, Ramakrishnapuram, Hyd, T.S-500056, (Cell No.8686898914) and 2 others are the** absolute owners of all that the piece and parcel of the Plot Bearing No. 32, in Sy.No.389/2, admeasuring 300 yards, Situated at Rampally Village, Kapra (M), Medchal-Malkajgiri dist., Telangana, and is bounded by:- NORTH : 30'-0" WIDE ROAD, SOUTH : Plot No.3, EAST : Plot No.31, WEST : 25'-0" WIDE ROAD, (Here in after called as "Scheduled property") purchased by **LATE DAMERLA VENKAT RATNAM S/O LATE SEETHA RAMAIAH, during his life time from KANDAKATLA ACHIREDDY S/O RAJI REDDY, VIDE SALE DEED DOCUMENT NO. 652/1984, DT. 09-02-1983, registered at SRO-Medchal. Whereas DAMERLA VENKAT RATNAM S/O LATE SEETHA RAMAIAH, was retired Employee, died on 02-02-1999, leaving behind his wife, Son and Daughter as his Legal Heirs.**
That my client lost and misplaced the above Said related Schedule Property Documents i.e **SALE DEED DOCUMENT NO. 652/1984, DT. 09-02-1983, registered at SRO-Medchal, on 05-07-2025 at about 11 A.M, while travelling from Mallapur to ECIL, Rampally by auto Taxi, along with other Plot Owners.**
Hence it is requested to general public that whoever found the above said Sale Deed Documents may contact to the undersigned Address and it is cautioned to all that not to deal any kind of transactions with false unknown persons, who are illegally possessing the above said lost original sale Deed Documents and whoever dealing except with my client are at their own risk and loss and also prosecuted legally. Alsowho ever found or in possession above said Sale deed document it is advised to the undersigned who ever found or in possession and suitably rewarded.
**Hence who ever having any legal right, interest or claim and having any objections over the above said "Scheduled Property" may raise their objections and contact along with their Legal Title Deeds, if any, to the undersigned address, within 07 days from this date.**

**DEPA GAYATHRI REDDY**
**ADVOCATE**
CELL No: 7386612288
OFF: H.NO. 5-13-51, Indiranagar, Meerpet, Kapra circle, Uppal (M), M.M Dist., HYD., T.S.
Enroll. No. T.S/622/2022

## తెలుగు, సరళ పదాల సాధన వాచకం ఆవిష్కరణ



ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు మామిడి వెంకటయ్య రచించిన తెలుగు, సరళ పదాల సాధన వాచకంను జిల్లా విద్యా శాఖ అధికారి కె.అశోక్ గురువారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా డిఈవో మాట్లాడుతూ మామిడి వెంకటయ్య రచించిన సరళ పదాల పుస్తకం కింద స్థాయి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, భాషను సులభంగా నేర్చుకోవడానికి వీలు కలుగుతుందని పుస్తకంలోని చిత్రాలు చాల ఆకర్షనీయంగా ఉన్నాయని, పిల్లల్లో చదివే సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఇది సహకరిస్తుందని అన్నారు. భాష సామర్థ్యాలను తేలికగా పెంపొందించడానికి సి గ్రూప్ పిల్లలను బి గ్రూప్‌లోకి తేవడానికి ఇది ఎంతో సహకరిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, సెక్టోరియల్ అధికారి దేవరశెట్టి జనార్ధన్, పూలమ్మ, విజయ్, ప్రకాశం, విమల పాల్గొన్నారు.

## అల్లంపూరు నియోజకవర్గం అభివృద్ధి చేస్తా



ప్రజాపక్షం/ఉండవెల్లి/ఎర్రవల్లి : అల్లంపూరు నియోజకవర్గంలోని వివిధ మండలాల్లోని మహిళలకు లక్ష్మి షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ వాహనాన్ని వంటి అభివృద్ధి కార్యక్రమాలు స్థానిక ఎమ్మెల్యే విజయుడు ప్రారంభించారు. గురువారం అల్లంపూరు చౌరస్తా లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉండవెల్లి , ఇటిక్యాల, రాజోలి, వడ్డేపల్లి, ఐజ మండలాల్లోని లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుని అందజేశారు. కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులు వందల ఎనభై తొమ్మిది మంది లబ్ధిదారులకు అందజేశారు. బిఆర్ఎస్ కార్యకర్త నూతన వాహనాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. అల్లంపూరు నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని వారు హామీ ఇచ్చారు.



## గత పాలకులు ఇల్లు , రేషన్ కార్డులు ఇచ్చిన పాపాన పోలేదు

### దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

ప్రజాపక్షం/దేవరకొండ: దేవరకొండ మండలంలోని తాటికోల్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి గురువారం దేవరకొండ ఎంఎల్‌ఏ బాలునాయక్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ దేశ చరిత్రలోనే కనివిని ఎరుగని విధంగా రైతన్నల సంక్షేమం కోసం 9 రోజుల్లో 9వేల కోట్లు పెట్టుబడి సాయాన్ని అందించింది మన ప్రజా ప్రభుత్వం అని పేర్కొన్నారు. పేద ప్రజలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వానికి ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఆశీర్వాదం మరింత ప్రోత్సాహాన్నిస్తుందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి గ్రామంలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందించడం కోసం కృషి చేస్తున్నామని అలాగే సంవత్సరంనర కాలంలోనే ఇచ్చిన హామీలను దశల వారిగా నెరవేరుస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో మహిళా సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షురాలు జూలూరు ధనలక్ష్మి బాల్‌నారాయణగౌడ్, మాజీ జెడ్పీటిసి అరుణసురేష్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, రాంసింగ్, కాటంగౌడ్, అశోక్, సుందర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్‌కు 25శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కృషి



ప్రజాపక్షం/సూర్యాపేట: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న యూత్ కాంగ్రెస్‌కు త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో 25 శాతం రిజర్వేషన్ కల్పించేలా అధిష్టానం దృష్టికి కృషి చేస్తామని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్‌రెడ్డి, ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి లు అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి వారు ముఖ్య అతిధులుగా హాజరై మాట్లాడారు. దేశ, రాష్ట్ర భవిష్యత్ యువతలోనే దాగి ఉందన్నారు. యువతకు యూత్ కాంగ్రెస్ బలమైన మద్దతుగా నిలుస్తోందని చెప్పారు. బిఆర్‌ఎస్, బిజేపి పార్టీలపై గత పది సంవత్సరాలుగా యూత్ కాంగ్రెస్ నిర్వహించిన పోరాటాల స్పూర్తితో నేడు ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో తీసుకెళ్లేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా కేంద్రంలో 1500 మోటార్ సైకిళ్లతో వైట్ హౌజ్ నుండి కొత్త బస్టాండ్, శంకర్‌విలాస్, పాత బస్టాండ్ మీదుగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కొమ్ము జవహర్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ మాదవరెడ్డి, గుర్రం శ్యాంచరణ్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రావ్యరెడ్డి, అంబేద్కర్, నవీన్‌చారి, పట్టణ అధ్యక్షులు అంజద్‌అలీ, మాజీ కౌన్సిలర్లు శైలేందర్, బాలుగౌడ్, రవి, రెబల్ శ్రీను, విజయభాస్కర్, ఏజాజ్, జావిద్, నరేష్, అజీం, కుక్కడపు మహేష్, బొడ్డు సాయి పాల్గొన్నారు.

## బిఎల్‌ఓలు కీలకపాత్ర పోషించాలి



ప్రజాపక్షం/తుంగతుర్తి(–అర్వపల్లి): బిఎల్‌వోలు ఓటర్ జాబితా తయారిలో కీలకపాత్ర పోషించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. గురువారం తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలోని జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో నిర్వహించిన బూత్ లెవల్ ఆఫీసర్‌లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటర్ జాబితాలో చేర్చాలని, ఇటీవల మరణించిన వారి వివరాలను సుమోటోగా తీసుకొని తొలగించాలని, అలాగే ఇప్పటికే ఓటర్ జాబితాలో పేరు ఉన్న వారి పేర్లు చిరునామ, ఫోటో జంబర్ మార్పుల లాంటివి ఏమైనా ఉంటే వెంటనే సరిచేయాలని సూచించారు. తదుపరి బిఎల్‌వోలకు ఓటర్ జాబితా పరిశీలన, దిద్దుబాట్లు నూతన ఓటర్ నమోదు లాంటి వాటికి సంబంధించిన విధి విధానాలను అధికారులు అవగాహన కల్పించారు. తహసీల్దార్ శ్రీకాంత్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: బిసి రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్ళాలని రాష్ట్ర సర్పంచుల సంఘం జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్,రాష్ట్ర ఎంపిటిసిల సంఘం అధ్యక్షుడు గడిల కుమార్ గౌడ్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని గడియారం సెంటర్లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాబినేట్ సమావేశంలో ఎన్నికల ముందు చెప్పిన కామారెడ్డి డిక్లరేషన్ లో స్థానిక సంస్థల ఎన్నికలలో 42 బిసిలకు రిజర్వేషన్ చట్టబద్ధత కల్పిస్తామని నమ్మపలికి బిసిలఓట్ల ద్వారా గద్దెనెక్కి నేడు కాలయాపన చేస్తున్నారని వారు ఆరోపించారు. అదేవిధంగా బిసి సామాజిక వర్గానికి మొత్తం జనాభా సర్వే నిర్వహించాలని 33 శాతం మహిళా రిజర్వేషన్లలో కూడా బిసి మహిళలకు అవకాశం ఇవ్వాలన్నారు. స్టేట్ కార్పొరేషన్ చైర్మన్లలో 42 బిసిలకుఅవకాశం ఇవ్వాలని కోరారు. ఈ నెల 15న హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే మహాధర్నకు పార్టీలకు అతీతంగా రాష్టం లోని బి.సి సామాజిక ప్రజాప్రతినిధుల బిసి సంఘాలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోవర్కింగ్ ప్రసిడెంట్ దేవి రవీందర్, రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్,సుప్ప ప్రకాష్,వల్లూరి వీరేష్,నవీన్ సాగర్,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.




# టిబి రహిత జిల్లాగా నల్లగొండ

### సవాలుగా తీసుకోవాలి : నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి




ప్రజాపక్షం/ మిర్యాలగూడ: సాంకేతికత అంతగా అభివృద్ధి చెందని రోజుల్లోనే మన దేశంలో కమ్యూనిటీ సహకారంతో అంటువ్యాధులను సమర్ధవంతంగా ఎదుర్కొని పారద్రోలిన ఘనత వైద్యారోగ్యశాఖకు ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకోని టీబీని సైతం జిల్లా నుంచి పూర్తిగా నిర్మూలించి టీబీ రహిత జిల్లాగా మార్చేందుకు సవాలుగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో 'టీబీ రహిత ముక్త్ భారత్ అభియాన్'పై ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. వైద్యారోగ్యశాఖలో పనిచేస్తున్న డాక్టర్లు, సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు విధులను సాధారణ పద్దతిలో నిర్వహించకుండా గుర్తింపు వచ్చేలా పనిచేయాలన్నారు. అక్టోబర్ 2 నాటికి టీబీ రహిత నల్లగొండ జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఇందులో భాగంగా ఆశాలు, ఏఎన్ఎంలు గ్రామాలకు వెళ్లి ప్రజలకు టీబీ పట్ల అవగాహన కల్పించాలన్నారు. రెండు వారాలకు మించి దగ్గు ఉండే వారిని గుర్తించి చైతన్యం చేసి పరీక్షలు చేయించుకునేలా చూడాలన్నారు. మిర్యాలగూడ ప్రాంతంలో రైస్ మిల్లులు ఎక్కువగా ఉండడం, దుమ్ము, ధూళి ఎక్కువగా ఉన్నందున ఈ ప్రాంతంలోని ప్రజలకు టీబీ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, దీన్ని దృష్టిలో పెట్టుకోని ఇక్కడి ప్రజలకు ప్రత్యేకించి రైస్ మిల్లుల్లో పనిచేసే వారు, డ్రైవర్లు, హమాలీలు, ఇతరులు అందరికి పరీక్షలు నిర్వహించేందుకు ఒక షెడ్యూల రూపొందించాలని సబ్ కలెక్టర్‌ను ఆమె ఆదేశించారు. వివరాలను ఎప్పటికప్పుడు డేటా ఎంట్రీ చేయాలన్నారు. అదే విధంగా ఆశా కార్యకర్తలు ప్రతి గ్రామపంచాయతీని సందర్శించి టీబీపై అవగాహన కల్పించాలన్నారు. బాగా పనిచేసిన ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను సన్మానించడం జరుగుతుందన్నారు. నల్లగొండ, మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తరుపున రూ.20లక్షల విలువ చేసే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎక్స్‌రే మిషన్‌ను వైద్యారోగ్యశాఖకు ఇస్తున్నందున ఆమె సంఘం ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, టీబీ నియంత్రణ అధికారి కల్యాణ్‌చక్రవర్తి, డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ మాతృనాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు వేణుగోపాల్‌రెడ్డి, రవి, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ హరీష్, డీఎస్‌వో వెంకటేశ్వర్లు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, సంఘం కార్యదర్శి బాబి, ప్రతినిధులు భద్రం, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఫర్టిలైజర్స్ గోదాం పరిశీలించిన కలెక్టర్

పట్టణ శివారులోని అవంతివేర్ హౌసింగ్ ఫర్టిలైజర్స్ గోదామ్‌ను గురువారం కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీంచి గోదాంలో ఎరువుల స్టాక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె గోదాం నుంచి ఎరువులు ఎక్కడెక్కడి సరఫరా అవుతాయో అడిగి తెలుసుకున్నారు. ఎరువుల కొరత లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎమ్మార్పీ ధరలకే యూరియాను అమ్మకాలు జరపాలని అధిక రేట్లకు విక్రయిస్తే యూరియా అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్, ఇన్‌చార్జి ఏడీఏ సైదానాయక్, మార్క్‌ఫెడ్ అధికారులు పాల్గొన్నారు.





## కష్టపడిన వారికి పదవులు దక్కుతాయి

### ఎమ్మెల్యే మందుల సామేలు

ప్రజాపక్షం/నూతన్‌కల్: ఈనెల 14న తిరుమల గిరి మండల కేంద్రంలో నిర్వహించే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు కోరారు. గురువారం మండల కేంద్రంలోని ఉమాదేవి ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. పార్టీలో కష్టపడిన వారికి పదవులు దక్కుతాయని, విభేదాలు లేకుండా కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్ని అమలవుతాయని ప్రతి కార్యకర్త ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని కోరారు. ముఖ్యమంత్రి బహిరంగ సభకు మండల నుండి మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నాగం సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్, మహిళ అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధ జన్నారెడ్డి, వివేక్‌రెడ్డి, తుంగతుర్తి మార్కెట్ కమిటి చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ నాయం జయసుధ సుధాకర్‌రెడ్డి, పాల్వాయి నాగరాజు, కందాల దామోదర్‌రెడ్డి, దరిపెల్లి వీరన్న, కట్టా మల్లారెడ్డి పాల్గొన్నారు.

## భూ భారతి రెవెన్యూ సదస్సులో దరఖాస్తులకు ప్రాధాన్యం

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు



ప్రజాపక్షం/యాదాద్రి : భూ భారతి రెవిన్యూ సదస్సులో ప్రజల నుండి వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు మండల తహసీల్దార్ లను ఆదేశించారు. గురువారం మినీ మీటింగ్ హాల్ మండల తహసీల్దార్ లతో భూ భారతి, రెవిన్యూ సదస్సు లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధించిన అన్ని దరఖాస్తులను క్లియర్ చేయాలని అన్నారు. భూభారతి రెవిన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను కేటగిరీల వారీగా విభజిస్తూ సత్వరమే వాటిని ఆన్లైన్లో అప్లోడ్ చేయాలన్నారు. ఆగస్టు 15 నాటికి అన్ని దరఖాస్తులు పరిష్కారం అయ్యేలా చొరవ చూపాలన్నారు. రెవిన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తులను నిశితంగా పరిశీలిస్తూ త్వరతగతిన వాటిని పరిష్కరించాలన్నారు. అన్ని మాడ్యుల్స్ లో దాఖలైన భూ భారతి దరఖాస్తులను పెండింగ్ ఉంచకుండా వెంటనే పరిష్కరించేందుకు చొరవ చూపాలి అన్నారు. భూ భారతి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను మండల తహసీల్దార్ లాగిన్‌లో ఉన్న దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ జరపాలన్నారు. అవసరమైన రికార్డులను కూడా క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. రెవిన్యూ పరంగా ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, రెవిన్యూ డివిజనల్ అధికారులు కృష్ణారెడ్డి, మండల తహసీల్దార్‌లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## పంద్రాగస్టు నాటికి భూ సమస్యలు పరిష్కారం

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్: పంద్రాగస్టు నాటికి భూ సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. గురువారం కలెక్టర్ చాంబర్ నందు జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి ఆర్డీవోలతో, తహసిల్దార్ లతో వెబ్ ఎక్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి సదస్సులలో ప్రజల నుండి స్వీకరించిన అర్జీలకు సంబంధించి భూ భారతి చట్టంలోని సెక్షన్స్ అమలు చేసుకుంటూ అర్జీదారులకు నోటీసులను అందజేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, తదుపరి రికార్డులు పరిశీలించి క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని ఆర్డీవోలు సమన్వయం చేసుకుంటూ తహసిల్దార్లచే వేగవంతంగా అర్జీలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని సూచించారు. తదుపరి అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రెవిన్యూ సదస్సులలో స్వీకరించిన అర్జిలను గ్రామాల వారిగా సిబ్బంది ద్వారా అర్జిదారులకు నోటీసులు అందజేయాలని సూచించారు. నూతన రేషన్‌కార్డు కోసం వచ్చిన దరఖాస్తులు వేగవంతంగా క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని తెలిపారు. ఈ వెబ్ ఎక్స్ సమావేశంలో ఆర్డీవోలు వేణుమాదవరావు, సూర్యానారాయణ, శ్రీనివాసులు, సెక్షన్ సూపరింటెండెంట్ సాయిగౌడ్, తహసిల్దార్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ధర్మచక్ర పరివర్తన మహోత్సవ వేడుకలు



ప్రజాపక్షం/నందికొండ: నాగార్జునసాగర్ లోని అంతర్జాతీయ పర్యాటక కేంద్రమైన బుద్ధ వనంలో ఘనంగా ధర్మచక్ర పరివర్తన మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.సిద్ధార్థుడు బుద్ధునిగా మారిన తర్వాత ఆషాడ పౌర్ణమి రోజున తన శిష్యులకి ఇచ్చే మొదటి ఉపన్యాసాన్ని ధర్మ చక్ర పరివర్త దినోత్సవంగా జరుపుకుంటారు. ఈవేడుకలను బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కుందూరు జానారెడ్డి బుద్ధవ నంలోని బుద్ధ చరిత వనములో ఉన్న బుద్ధపాదాల వద్ద స్థానిక శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, సిద్ధార్థుని పాత్రధారి, రామచంద్ర పాత్రధారి బాలీవుడ్ నటుడు గగన్ మాలిక్, వరల్డ్ బ్యాంక్ కన్సల్టెంట్ రవి బంకర్ లతో కలిసి పుష్పాంజలి ఘటించి వందనం సమర్పించారు. అనంతరం చారుసిన్హా ఐపీఎస్ అధికారి బహుకరించిన బుద్ధగయ నుండి తెచ్చిన బోధి మొక్కను బుద్ధ వనములోని ధ్యానవనములో వారు నాటి అనంతరం మహా స్తూపం లోని ధ్యాన మందిరంలో బుద్ధ జ్యోతిని వెలిగించి బౌద్ధ సాంప్రదాయ ప్రార్థన చేశారు.ఆ తర్వాత జనారెడ్డి గౌతమ బుద్ధుని గొప్పతనాన్ని,అతని సాధారణ జీవితాన్ని తెలియజేశారు. శాసనసభ్యులకు జయ్వీర్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో పేరు పొందుతున్న బుద్ధవనాన్ని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో బుద్ధవనం అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ బుద్ధవనంతో పాటు సాగర్ జలాశయంలో ఉన్న చాకలి గట్టును పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని, దానితో పాటు సాగర్ జలాశయం మధ్యలోఉన్న ఐలాండ్ పైన 150 అడుగుల బౌద్ధ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బాలీవుడ్ నటులు గగన్ మాలిక్ మాట్లాడుతూ బ్రాండ్ అంబాసిడర్ గా ప్రపంచ దేశాల బౌద్ధ కేంద్రాలతో బుద్ధ వనాన్ని సమన్వయం చేయడానికి కృషి చేస్తామన్నారు. వరల్డ్ బ్యాంకు కన్సల్టెంట్ రవి బంకర్ మాట్లాడుతూ నార్త్ ఇండియా నుండి బుద్ధవనానికి పర్యాటకులను ఆకర్షించే విధంగా ప్రపంచ స్థాయి బౌద్ధ కేంద్రాలను బుద్ధ వనములో నెలకొల్పడానికి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ ఆఫీసర్ రవిచంద్ర, ఆర్ట్, ప్రమోషన్స్ మేనేజర్ శ్యాంసుందర్రావు, ఇంజనీర్లు శ్రీనివాస్ రెడ్డి నజీష్,దైవజ్ఞ శర్మ, సాగర్ సిఐ శ్రీను నాయక్, ఎస్ఐ ముత్తయ్య, ఎస్‌పిఎఫ్ ఎస్ఐ రఘు, ఇంటలిజెన్స్ ఏఎస్ఐ వెంకటరెడ్డి, వెటర్నరీ డాక్టర్ కేశవ్ అజ్మీర, యోగ మాస్టర్ సైదయ్య, మహాత్మా గాంధీ యూనివర్సిటీ విద్యార్థులు, స్థానిక బీసీ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థులు బౌద్ధాభిమానులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వాడుతున్న దుకాణాలపై మున్సిపల్ అధికారుల దాడులు



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ వాడుతున్న దుకాణాలపై గురువారం మున్సిపల్ అధికారులు ఆకస్మికంగా దాడులు చేశారు. పట్టణంలోని ఆర్‌పి రోడ్ లోని పలు చికెన్ సెంటర్ తో పాటు కిరాణం దుకాణాలలో మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్ ఆదేశాల మేరకు సహాయపు కమిషనర్ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 120 మైక్రాలకు తక్కువగా ఉన్న ప్లాస్టిక్ కవర్లను వాడుతున్న రెండు దుకాణాలకు 2000 చొప్పున జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ రవీంద్ర రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ భూతం రోజురోజు పర్యావరణాన్ని కలుషితం చేస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వ నిబంధనల ప్రకారం 120 మైక్రాలకు పైబడిన ప్లాస్టిక్ నే వాడాలని సూచించారు. పట్టణంలో అన్ని దుకాణాలపై దాడులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్లాస్టిక్ రైతు సమాజ నిర్మాణం కోసం సాగే కార్యక్రమాలలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట శానిటరీ ఇన్స్పెక్టర్లు నంద్యాల ప్రదీప్ రెడ్డి గడ్డం శ్రీనివాస్ మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## తిరుపతి దేవస్థానంలో భజనలు చేసిన రామాపురం గ్రామ భక్త మండలి

ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండల పరిధిలోని రామాపురం గ్రామ శివకేశవ భజన మండలి భక్తులు గురువారము తిరుమల తిరుపతి దేవస్థానంలో భజనలు చేశారు. గురుపౌర్ణమి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానంలో అఖండ హరినామ సంకీర్తనలో భాగంగా శివ కేశవ భజన మండలి భక్తులు భజన చేసినట్లు తిరుమలలో జరిగే అఖండ హరినామ సంకీర్తనలు ప్రతి సంవత్సరము నియమ నిష్టతతో స్వామి వారి సన్నిధిలో భజనలు చే స్తామని అక్కడ భజనలు చేయడం వల్ల తమ జీవితం ధన్యమైనట్లు భా విస్తామని ఈ భజన మండలిలో రామాపురం గ్రామానికి చెంది 15 మంది భక్తమండలి భక్తులం భజన చేస్తామని స్వామి వారి దగ్గర భజన చేయడం వల్ల తమ మనసు పులకిస్తుందని ఈ సందర్భంగా భజన భక్తులు అన్నారు. రామాపురం గ్రామ శివ కేశవ భజన మండలి భక్తులు తిరుమల తిరుప తిలో భజనలో చేయడం వల్ల తమ గ్రామ కీర్తి ప్రతిష్టలు తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో కూడా పాగుతాయని భజన చేసిన బృందానికి ఈ సందర్భంగా గ్రామంలో ఉండే ప్రజలతో పాటు మండల తాలూకా జిల్లా స్థాయి ప్రజలు ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజల సహకారంతోనే శుభ్రత



ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్: ప్రజల సహకారంతోనే పరిశుభ్రత సాధ్యమవుతుందని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ హనుమంతరెడ్డి అన్నారు. గురువారం స్థానిక 35వ వార్డులో 100 రోజుల కార్యచరణ ప్రణాళిక లో భాగంగా ప్రజలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. వర్షకాలం వస్తున్న నేపథ్యంలో నివాస ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమల ఉత్పత్తిని అడ్డుకోవడం అత్యవసరమని సూచించారు. నిలిచిన నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని, తాగునీటి భద్రతలో ప్రజల భాగస్వామ్యం కీలకమని అన్నారు. తడి, పోడి, హానికర చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అప్పగించడం ద్వారా సమర్ధవంతమైన ముడి సమాచార నిర్వహణ సాధ్యమవుతుందన్నారు. వీధుల్లో సంచరించే మూక కుక్కల నియంత్రణకు టీకాలు, బెల్టులు తప్పనిసరి అని, పెంపుడు జంతువులకు టీకాలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఈ సత్యారావు, సానిటిరీ ఇన్స్‌పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఎఇ తరుమల్లయ్య, వార్డు ఆఫీసర్ ప్రశాంత్, ఎన్వీరాల్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, టిఎంసి శ్వేత, సయ్యద్ సమ్మి పాల్గొన్నారు.

## బధిర విద్యార్థులకు జాబ్ మేళా

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్పైడర్ ఎలక్ట్రిక్ కంపెనీ హైద్రాబాద్ వారు గురువారం జాబ్‌మేళా, అప్రెంటీస్‌షిప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన 16 మంది బదిర విద్యార్థులు అప్రెంటీస్‌షిప్‌కు ఎన్నికయ్యారు. వారికి 2 సంవత్సరాలు రూ.15వేలు స్టైఫండ్, భోజనం, రవాణా సౌకర్యాలు కల్పించడుతుందన్నారు. తరువాత కాలంలో అర్హులను రెగ్యులర్ జాబ్‌లోకి తీసుకుంటారు. హెచ్‌ఆర్ డిపార్ట్‌మెంట్ నాగభూషణం, ప్రిన్సిపాల్ రేపాల శ్రీనివాస్, సమన్వయకర్త నల్లగంటి రామకృష్ణ, కట్ల వెంకటేశ్వర్లు, ఇరుగు మధుకర్, గొల్ల స్వామి, బంటు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## గురు పౌర్ణమి వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**ప్రజాపక్షం/వేములవాడ టౌన్:** గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని మార్కండేయ నగర్, తిప్పాపూర్ లో గల శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. స్వామి వారికి అభిషేకం నిర్వహించి స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి దివ్య ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని



ప్రభుత్వ విప్ వేడుకున్నారు.

## బాలలతో పనులు చేయిస్తే కఠిన చర్యలు

దుబ్బాక సిఐ శ్రీనివాస్

**ప్రజాపక్షం/దుబ్బాక:** ఆటపాటలతో చదువుకోవాల్సిన వయస్సులో ఉన్న చిన్నారులను దుకాణాలలో, హోటల్లో, ఫ్యాక్టరీలలో , ప్రమాదకర ప్రాంతాల్లో పనులు చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దుబ్బాక సీఐ పాలపు శ్రీనివాస్ హెచ్చరించారు. గురువారం దుబ్బాక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ...కార్మిక చట్టం ప్రకారం 14 సంవత్సరాలలోపు పిల్లలను పనుల్లో నియమించుకోవద్దని, 14 18 సంవత్సరాల వయసు ఉన్న పిల్లల్ని ప్రమాదకరమైన పనుల్లో నియమించుకోవద్దని సూచించారు. బడి బయట ఉన్న పిల్లలను బడికి పంపాలని, బాల కార్మికులను పనిలో పెట్టుకున్న వారికి పనిలో పెట్టించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. బాలికల అక్రమ రవాణా బాల్య వివాహాల నిర్మూలనకు తల్లిదండ్రులతో పాటు స్థానికులు సహకరించాలని సూచించారు.




## ఎరువులు ,విత్తనాలు నిబంధనలు ప్రకారం విక్రయం: కలెక్టర్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** జిల్లాలో ఎరువులు , విత్తనాల స్టాక్, సేల్స్ రిజిస్టర్ లను పకడ్బందీగా నిర్వహించాలని విక్రయదారులను, అధికారులను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. గురువారం ముస్తాబాద్ మండలంలోని శ్రీనివాస్ ఎరువులు & విత్తనాలు, కోరమండల్ మన గ్రోమోర్, విక్రయ దుకాణాలను , గోదాములను, ఆవునూరులోని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రంలను ఆకస్మికంగా జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ,ఎరువులు & విత్తనాలు దుకాణాల్లో ఎరువులు, విత్తనాలను పరిశీలించి వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. శ్రీనివాస్ ఎరువులు & విత్తనాలు, కోరమండల్ మన గ్రోమోర్ విక్రయ దుకాణాలలో, ఆవునూరు లోని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రంలోని సేల్స్ రిజిస్టర్ మరియు స్టాక్ రిజిస్టర్ పరిశీలించి గోదాం ను తనిఖీ చేయగా కోరమండల్ మన గ్రోమోర్ గోదాములో యూరియా స్టాక్ లేనట్లు గమనించి సదరు దుకాణంకు నోటీసులు జారీ చేయవలసిందిగా తెలిపారు. సదరు నోటీసులకు సరైన సంజాయిషీ సమర్పించి యూరియా స్టాక్ వెంటనే తెప్పించాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ స్పష్టం చేశారు. నాణ్యమైన విత్తనాలు మాత్రమే రైతులకు అందజేయాలని , కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు ఉంటాయని విక్రయ యజమానులను కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జలి బేగం,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ద్వారా వచ్చే ప్రతి పైసా సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో 40 లక్షలతో డబల్ బెడ్ రూం ఇండ్ల మౌలిక సదుపాయాలకు శంకుస్థాపన చేసి,20 లక్షలతో నిర్మించనున్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ నిర్మాణ పనులు పరిశీలన చేసి అనంతరం25 లక్షలతో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో పలు కాలనీల్లో సీసీ రోడ్డు పనులకు జగిత్యాల శాసనసభ్యులు డా సంజయ్ కుమార్ భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే భవిష్యత్తు తరాల కోసం రాజకీయం చేయాలి. వచ్చే ఎన్నికల కోసం కాదు అని, రాజకీయాలకు అతీతంగా జగిత్యాల అభివృద్ధి చేస్తానని, ఇంకుడు గుంతల ఏర్పాటుతో భూగర్భ జలాలు పెరుగుతాయి.ప్రభుత్వం ద్వారా వచ్చే ప్రతి పైసా పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికే ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ దావఖానాలు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తాం అని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అన్నారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల రూరల్ ఎంపీడీవో రమాదేవి, రూరల్ ఎమ్మార్వో శ్రీనివాస్, డిఈ మిలింద్, రూరల్ ఎంపీఓ రవి బాబు, మాజీ జడ్పీటీసీ ఎల్లారెడ్డి, మాజీ సర్పంచ్లు చెరుకు జాన్, గర్వంధుల గంగన్న, గిద్ద శంకర్, మల్లారెడ్డి, నరేష్, బోనగిరి నారాయణ, నాయకులు గడ్డం నారాయణ రెడ్డి,పాల్గొన్నారు.

## కేజ్ వీల్స్ ట్రాక్టర్‌కు జరిమానా విధించిన కలెక్టర్, ఎస్ఐ

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సుల్తానాబాద్, మండలంలోని ఐతరాజుపల్లి గ్రామానికి చెందిన రమణారెడ్డి తన కేజీవిల్ ట్రాక్టర్ రోడ్డు పై తిప్పడంతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మొదటి తప్పుగా 5000 రూపాయల జరిమానా విధించినట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం పట్టణం తో పాటు గ్రామాలలో రోడ్లపై కేజ్ వీల్స్ ట్రాక్టర్లు తిరిగితే జరిమానాలతో పాటు ప్రభుత్వానిబంధనల ప్రకారం కేసులు నమోదు చేస్తామని తెలిపారు. మండలంలోని ఐతరాజు పల్లి గ్రామానికి చెందిన రమణారెడ్డి తన కేజీవీల్ ట్రాక్టర్ తో రోడ్డుపై వెళుతుండగా అదుపులోకి తీసుకున్నామని అదుపులో తీసుకున్న కేజీ వీల్ ట్రాక్టర్ ను తాసిల్దార్ బషీరుద్దీన్ కార్యాలయానికి బదిలీ చేయగా తహసిల్దార్ జిల్లా కలెక్టర్ కు పంపడంతో మొదటిసారి తప్పుగా 5000 రూపాయల జరిమానా విధించారని తెలిపారు.రోడ్ల పై తిరిగే కేజీ వీల్స్ ట్రాక్టర్ వాడకం నిషేధించడం జరిగిందనీ కేజ్ వీల్స్ ట్రాక్టర్ యజమానులు గ్రహించాలని కేజ్ వీల్స్ ట్రాక్టర్లతో రోడ్డు పై తిరగడం ద్వారా రోడ్లు శాశ్వతంగా చెడిపోతున్నాయని, గుంతలు అధికంగా ఏర్పడటం వల్ల ప్రమాదాలు సైతం జరుగుతున్నాయని వివరించారు, గ్రామాలలో రోడ్ల పై కేజీ వీల్స్ ట్రాక్టర్ లు తిరుగుతూ కనబడితే మొదటిసారి 5000 రూపాయలు, రెండవసారి 10,000 రూపాయలు జరిమానా విధించడం జరుగుతుందని, మూడవసారి దొరికిన వారికి 20 వేల రూపాయల జరిమానా విధించడంతో పాటు సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి కేజీ వీల్ ట్రాక్టర్ ను సీజ్ చేస్తామని తెలిపారు.

## కేజీ వీల్స్‌తో రోడ్డెక్కితే ట్రాక్టర్లుసీజ్ ఎస్ఐ కృష్ణ సాగర్ రెడ్డి

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల పరిధిలోని వివిధ గ్రామాల ట్రాక్టర్ యజమానులు ,డ్రైవర్లు కేజీ వీల్స్ తో ట్రాక్టర్లు రోడ్లపై నడిపితే కేసు నమోదు చేస్తామని ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు .ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలోని ట్రాక్టర్ యజమానులు ,డ్రైవర్లు వరి నాట్ల కోసం రోడ్డుపై కేజీ వీల్స్ ట్రాక్టర్లు నడుపుతున్నారని ,దీంతో ప్రభుత్వం కోట్ల రూపాయలతో నిర్మించిన బీటీ రోడ్లు ,తారు రోడ్లు ధ్వంసమవుతున్నాయని అన్నారు.ఈ వర్షాలకి రోడ్లు గుంతలు గుంతలుగా మారడంతో పాటు ప్రజా రవాణాకు ఇబ్బంది అవ్వడమే కాకుండా ,వాహనాలు అట్టి గుంతల వలన వర్షాలకి ప్రమాదానికి గురవుతున్నాయి .రోడ్డు పాడవకుండా ఉండాలంటే ట్రాక్టర్లు కేజీ వీల్స్ తో వచ్చేటప్పుడు వాటికి పట్టీలు అమర్చుకొని రోడ్డుపైకి రావాలని సూచించారు .ఇకపై కేజీ వీల్స్ తో టాక్టర్లు రోడ్డుపైకి వస్తే కేసులు నమోదు చేయడమే కాకుండా అట్టి ట్రాక్టర్లను సీజ్ చేయడం జరుగుతుందని ఎస్ఐ కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందించాలి

కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/ముత్తారం:** ప్రభుత్వ పాఠశాలల్లో చదివి విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ముత్తారం మండలంలో విస్తృతంగా పర్యటించారు.ముత్తారం మండలం మచ్చుపేట గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు, పల్లె దవాఖానా (సబ్ సెంటర్), మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, లక్కారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,అంగన్వాడీ కేంద్రం, పారుపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, చెంచుల శిథిలావస్థలో ఉన్న ఇండ్లు, అడవి శ్రీరాంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఖమ్మం పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల , ఓడేడు ఖమ్మం పల్లి బీటీ రోడ్డు నిర్మాణ పనులు, ముత్తారం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం, ఐకేపీ కేంద్రంలోని చిల్లి సెంటర్ ను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ మచ్చుపేట గ్రామం లోని ఇందిరమ్మ ఇండ్లు త్వరగా పూర్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పల్లె దవాఖాన ద్వారా గ్రామంలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ప్రాథమిక వైద్యానికి అవసరమైన అన్ని రకాల మందులు సిద్ధంగా పెట్టుకోవాలని కలెక్టర్ సూచించారు.పారుపల్లి గ్రామంలోని ఎం.పీ.పీ.ఎస్ పాఠశాలలో నూతన అడ్మిషన్లు కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థులు తీసుకున్నారు. పాఠశాలలో నూతన ప్రీ ప్రైమరీ క్లాసును ప్రారంభించారు. అభివృద్ధి కోసం అవసరమైన అదనపు నిధుల ప్రతిపాదనలు అందించాలని అన్నారు. పారుపల్లి ఎంపియూపిఎస్ పీఎం శ్రీ క్రింద ఎంపికైందని, దీని అభివృద్ధికి పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని అన్నారు. చెంచుల ఎస్టీ కాలనీలో శిథిలావస్థలో ఉన్న ఇండ్లను పరిశీలించిన కలెక్టర్ అర్హత ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. అడవి శ్రీరాంపూర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్ లను కలెక్టర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా గ్రామాలలోని డిజిటల్ క్లాసుల పనితీరు, ఉపాధ్యాయులు బోధించే బోధనా సరళిని పరిశీలించి విద్యార్థులతో డిజిటల్ క్లాసులపై విద్యార్థులు నేర్చుకున్న వాటిని డిజిటల్ క్లాసుల ద్వారా వివరించారు. ఐకేపి కార్యాలయంలో ఏర్పాటు చేసే చిల్లి సెంటర్ ను లాభసాటి గా నడపాలని, మహిళా సంఘాల ద్వారా కారం పొడి తయారు చేసి విక్రయించాలని కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో డిఆర్‌డిఓ కాళిందిని, ముత్తారం ఎంపిడిఓ సురేష్, ఐకెపి ఏపిఎం పద్మ, ఏఈ పంచాయతీ రాజ్ జగదీష్, సంబంధిత అధికారులతో పాటు పాల్గొన్నారు.

## కోమాలో ఉన్న అంగన్వాడీ టీచర్



**ప్రజాపక్షం/వీర్నపల్లి/ఎల్లారెడ్డిపేట:** మండల కేంద్రంలోని మద్దిమల్ల గ్రామం లొద్ది తండాలో అంగన్వాడీ టీచర్‌గా పని చేస్తున్న మారోజు స్వరూప గత నాలుగు రోజుల క్రితం ట్రాప్ చేయబడి,హత్యాయత్నంకు గురై కొన ఊపిరితో కోమాలో ఉన్న ఆమెను రాష్ట్ర అంగన్వాడీ అధ్యక్షురాలు బి సాయిఈశ్వరి గురువారం వారి బంధువులతో మాట్లాడి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధితురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, అలాగే నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఆమె వెంట ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కడారి రాములు, నాయకురాలు కె.వి. అనసూర్య, అజ్జ వేణు, అంగన్వాడీ టీచర్లు ,చొప్పరి అంజలి, పద్మ, జ్యోతి, వాణి, సులోచన ఉన్నారు.

## వేగంగా మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులు

కలెక్టర్ పమేలా సత్పతి




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** జిల్లాలో వివిధ ప్రభుత్వ భవనాల నిర్మాణం, మరమ్మత్తులు, పాఠశాలలు, అంగన్‌వాడీల్లో మౌలిక సదుపాయాల కల్పన తదితర పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భవనాల నిర్మాణం, మరమ్మత్తులు, మౌలిక సదుపాయాల కల్పనపై ఇంజనీరింగ్, జిల్లా అధికారులతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా పరిషత్, ఉపాధి హామీ, పంచాయతీరాజ్, తదితర శాఖ ద్వారా వివిధ ప్రభుత్వ భవనాల నిర్మాణం, మరమ్మత్తులకు మంజూరైన పనులు ఆగస్టులోగా పూర్తి చేయాలన్నారు. ఇంకా గ్రౌండింగ్ పూర్తి కాని పనులకు సంబంధించి రెవెన్యూ, ఇంజనీరింగ్ పంచాయతీరాజ్ అధికారులు సమన్వయంతో నూరు శాతం గ్రౌండింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో టాయిలెట్స్, ప్రహరీగోడ, కిచెన్ షెడ్ నిర్మాణం వంటి పనులు, పిఎం శ్రీలో ఎంపికైన పాఠశాలల్లో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాల అభివృద్ధి పనుల కోసం వెంటనే ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. వివిధ పాఠశాలల్లో మంజూరైన సైన్స్ ల్యాబ్ గదులు, కంప్యూటర్ గదులు, అదనపు తరగతి గదుల నిర్మాణంపై దృష్టి పెట్టాలన్నారు. కరీంనగర్ ప్రభుత్వ వైద్య కళాశాల హాస్టల్ బ్లాక్ త్వరగా పూర్తి చేసేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రభుత్వ భవనాల్లోకి మార్చిన 73 అంగన్‌వాడీ కేంద్రాలకు మరమ్మత్తులు అవసరమని, ఈ పనులను నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా పరిషత్ సీఈవో శ్రీనివాస్, ఇంజనీరింగ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యం

రూ.40 లక్షలతో చెత్త సేకరణ ఆటోలు కొనుగోలు



ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం

**ప్రజాపక్షం/చొప్పదండి:** మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. గురువారం చొప్పదండి మండలంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులతో కలిసి సుడిగాలి పర్యటన చేశారు. చొప్పదండి మున్సిపాలిటీ ద్వారా కొనుగోలు చేసిన ఇంటింటి నుంచి తడి, పొడి చెత్త సేకరించే రూ.40 లక్షల విలువైన ఐదు నూతన వాహనాలు ప్రారంభించడంతో పాటు జవహర్ నవోదయ విద్యాలయంలో రూ.15 లక్షల నిధులతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి ఆవరణలో వనమోహత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆర్నకొండ గ్రామంలో ఎమ్మెల్యే నిధులతో మడేలయ్య స్వామి గుడి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన బోర్‌మోటార్, రాజన్నల కులస్తుల గొర్రె మేకల సహకార మార్కెట్‌లో ఏర్పాటు చేసిన హైమాస్ లైటును ప్రారంభించి బస్టాండ్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. గురుపౌర్ణమి పురస్కరించుకుని మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.నాగరాజు, ఎస్సై నరేష్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్, డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, మాజీ చైర్మన్ గుర్రం నీరజ, కాంగ్రెస్ గంగయ్య, మాజీ కౌన్సిలర్ అశోక్, పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, కార్యకర్తలున్నారు.

## హన్మాజీపేటలో నూతన బ్రిడ్జిని త్వరలోనే ప్రారంభిస్తాం




గురు పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న విప్ ఆది శ్రీనివాస్

**ప్రజాపక్షం/వేములవాడ రూరల్:** వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట గ్రామంలోని నక్క వాగుపై నిర్మించిన నూతన బ్రిడ్జిని త్వరలోనే ప్రారంభించి ప్రజలకు అంకితం చేస్తానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గురు పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, స్థానిక నేతలతో కలిసి బాబాను దర్శించుకొని తరించారు. బాబా ఆశీస్సులు ప్రజల అందరిపై ఉండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, రూరల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వకులాభరణం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంఘ స్వామి యాదవ్, గోవర్ధన్ రెడ్డి, సామ తిరుపతిరెడ్డి, సోయినేని కరుణాకర్, బాలసాని శ్రీనివాస్ గౌడ్, చిలుక ప్రభాకర్, హరి నందన్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామస్తులు ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


## రూ.1.60 కోట్ల నిధులతో శంకుస్థాపనలు

ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా నిరంతరం పనిచేస్తున్నామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట్ల విజయ రమణారావు అన్నారు. గురువారంసుల్తానాబాద్ మండలంలోని సుద్దాల, రేగడి మద్దికుంట, అల్లిపూర్ గ్రామాల్లో గురువారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు స్థానిక నాయకులతో కలిసి పట్టాలను అందజేసి నూతన ఇండ్ల నిర్మాణాలకు ముగ్గులు పోసి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం ఆయా గ్రామాల్లో 1.60 కోట్ల అక్షరాల ఒక కోటి అరవై లక్షల రూపాయల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ రమణ రావు మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గంలో ప్రభుత్వం 3,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిందన్నారు. 17 నెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులు, ఇండ్లు, అభివృద్ధి విషయంలో ఎలాంటి రాజీ పడకుండా అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. గత 30 సంవత్సరాలుగా ఎన్నడు లేని విధంగా ఈ వేసంగి ఘనైనిమైన వరి పంట పండిందని రైతులకు 10 నుంచి 15 వేల రూపాయలు అదనపు లాభం వచ్చిందన్నారు. ఈ వేసవిలో సన్న ధాన్యం పండించిన రైతులకు 31కోట్లు ఆపైన రూపాయలు ఈ వారం రోజుల్లో ప్రభుత్వం బోనస్ వేస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో అంతటి అన్నయ్య గౌడ్, మినుపాల ప్రకాష్ రావు, మండల అధ్యక్షులు చిలుక సతీష్, అబ్బయ్య గౌడ్, దాన్నాయక దామోదర్ రావు, భాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు, పాల్గొన్నారు.

## సెల్ టవర్ నిర్మాణ పనులు ఆపాలని కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఎయిర్టెల్ 5జి టవర్ నిర్మాణ పనులు ఆపాలంటూ గురువారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష కి వినతి పత్రం అందించి గ్రామస్తులు కోరారు.టవర్ నిర్మాణం చేపడితే తము ఎవరి నుండి వచ్చే రేడియేషన్ ద్వారా క్యాన్సర్, నడుం నొప్పితో పాటు తదితర వ్యాధులు సోకి గ్రామస్తులందరం అనారోగ్యానికి గురికావలసిన పరిస్థితి నెలకొంటుందని వినతి పత్రం ద్వారా కలెక్టర్ కి విన్నవించారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

కలెక్టర్ హైమావతి ఆకస్మిక తనిఖీలు

ఆరోగ్య కేంద్రం, పాఠశాలల పనితీరుపై అసంతృప్తి



**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** జగదేవ్‌పూర్ మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడి సెంటర్లను సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలల పనితీరుపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ చేయగా డ్యూటీ డాక్టర్ విధుల్లో లేక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు వైద్య సేవలు అందించడం వైద్యుల ముఖ్య విధి అని విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యులు ఉదయం 9 గంటలకే ఆసుపత్రిలో ఉంటూ రోగులకు సేవలందించాలని ఆదేశించారు. ఆసుపత్రి గదులు, అవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అలాగే సీజనల్ వ్యాధులకు సంబంధించిన అన్ని సౌకర్యాలు ఆసుపత్రిలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండల అధికారులు అప్పుడప్పుడు తనిఖీలు నిర్వహించాలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పక్రీయ తీరును పరిశీలించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టడంలేదని పాఠశాల ప్రధానోపాధ్యాయునిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల పట్ల సహృదయంతో మెలగాలని కలెక్టర్ పేర్కొన్నారు. నాలుగవ తరగతిలో ఏకలవ్య పాఠం గూర్చి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి ఉపాధ్యాయుల బోధన తీరును సమీక్షించారు. ఇసుక స్లిప్పులు లబ్దిదారులకు మాత్రమే అందజేయాలని, అక్రమంగా ఇందిరమ్మ ఇళ్లకు చెప్పి వేరే చోటుకు ఇసుకను మల్లిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని తహసీల్దారుకు సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ నిర్మల, ఎంపిడిఒ రాంరెడ్డి, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.


## విద్యుత్ ప్రమాదాల నివారణే లక్ష్యం

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి:** పొలం బాట పట్టిన కర్షకులకు విద్యుత్ ప్రమాదాల నివారణపై జగిత్యాల డిఇ టెక్నికల్ సేఫ్టీ ఆఫీసర్ గంగారాం అవగాహన కల్పించారు. జగిత్యాల జిల్లాలోని బీమారం మండలంలో పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. డిఇ టెక్నికల్ సేఫ్టీ ఆఫీసర్ గంగారాం మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాల నివారణ వినియోగదారుల ప్రాణాల పరిరక్షణే లక్ష్యంగా పనిచేయాలనే సంకల్పంతో పొలం బాట ఎంచుకున్నామని స్పష్టం చేశారు. డిఇ , మన్నెగూడెం విద్యుత్ అధికారులు రైతులకు విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. మోటార్లకు ఫైబర్ స్టార్టర్ లు, బాక్సులు, కెపాసిటర్లను పెట్టుకోవాలని సూచించారు. తద్వారా విద్యుత్ ఆదా కావడంతో పాటు మోటారు ఎక్కువ కాలం వస్తుందని వివరించారు. కెపాసిటర్ పెట్టి ప్రాక్టికల్‌గా చూపించారు. డిఇ వెంట మన్నెగూడెం ఏఇ అశోక్, సబ్ ఇంజీర్ ఎక్కల్ దేవి హరిప్రసాద్, విద్యుత్ సిబ్బంది, గ్రామపెద్దలు రఘు, మనోజ్, రైతులు వినియోగదారులు పాల్గొన్నారు



## కొమురం భీం ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత

### ప్రవాహం పెరిగే అవకాశం, అధికారులు హెచ్చరికలు జారీ



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్** :ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కొమురం భీం ప్రాజెక్టులోకి వరదనీరు భారీగా వచ్చి చేరుతోంది. గురువారం అధికారులు ప్రాజెక్టులోని రెండు గేట్లు 0.2 మీటర్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం 237 మీటర్లకు చేరగా, పూర్తి సామర్థ్యం 243 మీటర్లుగా ఉంది. 850 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నీటిపారుదల మరియు కమాండ్ ఏరియా అభివృద్ధి శాఖ అధికారులు హెచ్చరించారు.

## భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

### మంత్రి జూపల్లి సూచన



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్** :కొమురం భీమ్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులకు ఆయన సూచించారు.ఈ మేరకు మంత్రి జూపల్లి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రేతో ఫోన్‌లో మాట్లాడారు. జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున జనజీవనానికి ఇబ్బందులు, ఆటంకాలు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీసు, రెవెన్యూ, ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా మంత్రికి వివరించారు.

## భూమి సమస్యను పరిష్కరించిన అధికారులు

ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/నర్సాపూర్:**తమ భూమిలోని సమాధులను కూల్చివేసి ఓ వ్యక్తి తన భూమిని కబ్జా చేశారని బుధవారం ప్రజాపక్షం దినపత్రికలో వచ్చిన క థనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. రెడ్డిపల్లి గ్రామానికి రెవెన్యూ అధికారులు ఆర్‌ఐ సిద్ధిరాంరెడ్డి తో పాటు సర్వేయర్ అభిలాష్, సిబ్బంది వెళ్లి భూమిని పరిశీలించారు. భూమిని ఆక్రమించిన ఎరుకల యాదయ్య , భూ బాధితురాలు పోచమ్మలను పిలిపించి ఇరువురిని ఒప్పించి భూ సమస్యను పరిష్కరించి బాధితురాలికి న్యాయం చేశారు. అదే విధంగా చెరువు పారకం కాలువను ధ్వంసం చేయడంతో కాలువ ను యాదయ్య చెత బాగు చేయించారు. తనకు న్యాయం జరిగేలా చూసిన ప్రజాపక్షం దిన పత్రికకు బాధితురాలు పోచమ్మ కృతజ్ఞతలు తెలియజేశారు.

## నేర రహిత సమాజమే లక్ష్యం

### పిడి యాక్ట్ అమలుకూ వెనుకాడం : ఏసిపి రవికుమార్



**ప్రజాపక్షం/మందమర్రి** :నేరాల నిర్మూలన, మత్తు పదార్థాలపై కఠిన చర్యలే మా ధ్యేయమని బెల్లంపల్లి ఎసిపి రవికుమార్ స్పష్టం చేశారు. అవసరమైతే పిడి యాక్ట్ కూడా అమలు చేస్తామని తెలిపారు. గురువారం మందమర్రి పట్టణంలోని విద్యానగర్, చెంచు కాలనీల్లో పాత నేరస్తులు, రౌడీషీటర్లు, సంఘవిద్రోహ శక్తులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేరాలకు పాల్పడి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై నిరంతర నిఘా కొనసాగుతుందని చెప్పారు. పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. గంజాయి రవాణా, వినియోగం వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిర్మూలన లక్ష్యంగా పని చేస్తున్నామని, ఎవరైనా మత్తు పదార్థాల వాడకాన్ని ప్రోత్సహించినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే పిడి యాక్ట్ ప్రకారం కేసులు కూడా నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఎసిపి స్వయంగా కాలినడకన కాలనీల్లోకి వెళ్లి షీటర్ల ఇంటివద్ద వారికి హితబోధ చేశారు. సమాజంలో మంచిగా జీవించండి అంటూ ప్రత్యక్షంగా వారితో మాట్లాడారు. అనంతరం, సిఐ శశిధర్ రెడ్డి నేతృత్వంలో పాత బస్టాండ్ వద్ద నాకాబందీ నిర్వహించారు. ఈ సమయంలో సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని వాహనాలు గుర్తించి సీజ్ చేశారు. బ్లాక్ ఫిల్మ్ ఉన్న వాహనాలపై జరిమానాలు విధించారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఐలు రాజశేఖర్ పటేల్ (మందమర్రి), ప్రవీణ్ (కాసిపేట), ఆంజనేయులు (దేవాపూర్), అదనపు ఎస్‌ఐ శ్రీనివాస్ (మందమర్రి), పోలీసు సిబ్బంది, ప్రత్యేక బలగాలు పాల్గొన్నారు.

## ఈ నెల 12న ఖానాపూర్‌లో మెగా జాబ్ మేళా



**ప్రజాపక్షం/జన్నారం** :ఖానాపూర్ నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పన లక్ష్యంగా ఈ నెల 12న ఖానాపూర్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు తెలిపారు. శనివారం ఖానాపూర్‌లోని ఎఎంకె ఫంక్షన్ హాల్‌లో ఈ మేళా బిఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ ఆధ్వర్యంలో జరుగనున్నది. ఈ నేపథ్యంలో బిఆర్‌ఎస్ జన్నారం మండల అధ్యక్షుడు రాజారాం రెడ్డి నాయకత్వంలో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ జాబ్ మేళా రాజకీయాలకు అతీతంగా నిర్వహించబడుతోంది. నిరుద్యోగ యువత తమ ప్రతిభను ప్రదర్శించి ఉద్యోగ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి. తమ లక్ష్యాలను చేరుకోవడంలో ఇది మంచి అవకాశంగా నిలుస్తుందని అన్నారు. ఈ సమావేశంలో బిఆర్‌ఎస్ నాయకులు సర్వర్ జనార్దన్, భారత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పొంగిన వర్ధా నది

### తీరప్రాంత ప్రజలకు అప్రమత్తత సూచన



**ప్రజాపక్షం / సిర్పూర్ (టి)** :మండలంలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వర్ధా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. హుడికిలి, వెంకట్రావుపేట గ్రామాల సరిహద్దులో నది నీటిమట్టం గణనీయంగా పెరిగి ప్రమాదకర స్థాయికి చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నదిలోకి వెళ్లకూడదని హెచ్చరికలు జారీ చేశారు. కొన్ని గ్రామాలకు రాకపోకలు అంతరాయం కలిగే అవకాశముందని అధికారులు పేర్కొన్నారు. పరిస్థితిని పర్యవేక్షిస్తూ, అవసరమైన సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నామని స్పష్టంచేశారు. ప్రజలు ఎలాంటి ఆందోళన లేకుండా అధికారులు ఇచ్చే సూచనలను పాటించాలని, అత్యవసర పరిస్థితుల్లో స్థానిక అధికారులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

## నిర్మాణంలో ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన



**ప్రజాపక్షం/నిజాంసాగర్:**నిజాంసాగర్ మండలంలోని బంజపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో లబ్దిదారులు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను నిజాంసాగర్ మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి గంగాధర్ గురువారం పరిశీలించారు. ఆయన లబ్దిదారులతో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని, బేస్‌మెంట్ త్వరగా పూర్తి చేసిన వారికి డబ్బులు ఇప్పించాలని పంచాయతీ కార్యదర్శి భీంరావును ఆదేశించారు. అదేవిధంగా వర్షాకాలం కావడంతో పారిశుధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు మురికి కాలువలు పూడికతీత, రోడ్లపై చెత్తా చెదారం లేకుండా శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శి భీంరావును ఆదేశించారు.

## ఐటిఐ శిక్షణతో విరివిగా ఉద్యోగ,ఉపాధి అవకాశాలు





సద్వినియోగం చేసుకోవాలని కోరిన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

కలెక్టర్‌తో కలిసి ప్రభుత్వ బాలుర ఐటిఐను ఎమ్మెల్యే సందర్శన

**ప్రజాపక్షం/ నిజామాబాద్ ప్రతినిధి** :విరివిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే పారిశ్రామిక శిక్షణ సంస్థలను నిరుద్యోగ, యువతీ యువకులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి హితవు పలికారు. కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డితో కలిసి ఆయన గురువారం పట్టణంలోని శివాజీనగర్‌లోని ప్రభుత్వ బాలుర ఐటిఐను సందర్శించారు. టర్నర్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, స్టెనో తదితర ట్రేడ్‌లకు సంబంధించిన వర్క్ షాప్‌లు తరగతులకు వెళ్లి నిశిత పరిశీలన జరిపారు. వివిధ ట్రేడ్‌లలో అందిస్తున్న శిక్షణ తీరుపై అందుబాటులోని యంత్ర పరికరాలపై ప్రిన్సిపాల్ యాదగిరిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఐటిఐలలో చేరిన వారికి మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా నాణ్యతతో కూడిన శిక్షణ అందించాలని ఎమ్మెల్యే సూచించారు. విద్యార్థులతో మమేకమై వారికందిస్తున్న శిక్షణ తీరుతెన్నులపై వాకబు చేశారు. స్కిల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఐటిఐ శిక్షణకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వీటికి అనుసంధానంగా నేటి పారిశ్రామిక అవసరాలకనుగుణంగా ఆధునాతన కోర్సులలో శిక్షణ ఇప్పించేందుకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను కూడా ప్రభుత్వం నెలకొల్పిందని గుర్తు చేశారు. ఐటిఐలలో శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి రైల్వే, బిడిఎల్, మిధాని వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలలో ఉద్యోగావకాశాలు లభించడమే కాకుండా, స్వంతగా పరిశ్రమలు స్థాపించుకునేందుకు ప్రైవేట్ రంగంలో ఆకర్షణీయ వేతనాలతో బహుళ జాతి పరిశ్రమలలో ఉద్యోగావకాశాలు పొందవచ్చని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన సాంకేతిక విద్యను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి యువతలో సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపర్చాలని కృతనిశ్చయంతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులు అయిన వారు నేరుగా ఐటిఐలలో ప్రవేశాలు పొంది తాము ఎంచుకున్న కోర్సులలో శిక్షణ పొంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కించుకోవచ్చని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ప్లేస్‌మెంట్ల కోసం టాటా వంటి ప్రముఖ కంపెనీలతో కూడా ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందని తెలిపారు. ప్రభుత్వ తోడ్పాటును విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఐటిఐలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, ఐటిఐ ఇన్‌స్ట్రక్చర్లు ఉన్నారు.

## గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు తప్పవు

### ఎస్‌పి జానకి షర్మిల..



**ప్రజాపక్షం/ఖానాపూర్** :ఖానాపూర్ నియోజకవర్గం పెంబి మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలైన అంకెన,కొలంగూడ ప్రాంతాల్లో గాంజా గస్తీ అవగాహన సదస్సులో భాగంగా పర్యటించిన నిర్మల్ జిల్లా ఎస్‌పి జానకి షర్మిల,ఎఎస్‌పి రాజేష్ మీనా గిరిజన ప్రజలు వీరిని వారి సంప్రదాయ నృత్యల మధ్య తమ గ్రామాలకు ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ గిరిజన గ్రామ యువత,ప్రజలు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మంచి మార్గం ఎంచుకోవాలని అన్నారు.గిరిజన గ్రామల్లో ప్రజలు నివాసం ఉంటున్న గృహాలను పరీక్షించి,వారి సమస్యలను తెలుసుకొని,ప్రభుత్వం ద్వారా సమస్యలు తీర్చే విధంగా చూస్తానని అన్నారు.గిరిజన గ్రామల్లో యువత,ప్రజలు గంజాయి,నాటు సారా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ,పంట పొలాలలో ఆహారానికి ఉపయోగపడే పంటలను మాత్రమే పండించాలని,గంజాయి వంటి మత్తు కలిగించే మొక్కలను సాగు చేయవద్దని ఎస్‌పి సూచించారు.ఎవరైనా మొక్కలను పంట పోలాల్లో పండిస్తే పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని అదే విధంగా మత్తు పదార్థాలను అమ్మిన కొన్న వెంటనే తమ దృష్టికి తేవాలని అన్నారు.గ్రామస్థులు తమ గ్రామాలు రావడానికి వంతెన,త్రీ పేస్ కరెంట్,రోడ్డు సౌకర్యం సరిగా లేవు అనిఎస్‌పికి తెలుపగా,కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం దిశగా కృషి చేస్తామన్నారు.అనంతరం గ్రామ ప్రజలకు నిత్యవసర సరుకులు,యువకులకు వాలీబాల్ కిట్‌లను ఎస్‌పి , ఎఎస్‌పి అందజేశారు.ఖానాపూర్ సిఐ అజయ్,ఖానాపూర్ సర్కిల్ పరిధిలో గల ఎస్‌ఐలు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులే యూనివర్సిటీకి బ్రాండ్ అంబాసిడర్లు : కలెక్టర్



**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి** :జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం బాసర ఆర్జీయుకేటి (రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జీ టెక్నాలజీస్) ని సందర్శించారు.ఈ సందర్భంగా ఉపకులపతి ఛాంబర్‌లో అధికారులు,బోధన సిబ్బందితో సమావేశమై,విద్యార్థులకు అందిస్తున్న బోధన వసతులపై సమీక్ష నిర్వహించారు.ప్రవేశాల ప్రక్రియ,అభివృద్ధి పనుల పురోగతిపై అధికారుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు.ప్రవేశాల ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.బోధనేతర సిబ్బంది సమర్థవంతంగా పనిచేయాలన్నారు.అనంతరం విద్యార్థులతో ముఖాముఖీ మాట్లాడిన కలెక్టర్,బాసర ఐఐఐటి దేశానికే గర్వకారణమని,విద్యార్థులే యూనివర్సిటీకి బ్రాండ్ అంబాసిడర్లు అని పేర్కొన్నారు.విద్యార్థులకు ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు.బోధన,భోదనేతర అంశాల్లో సమీక్షలు నిర్వహిస్తూ,సమస్యలు తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.వర్క్‌షాపుల స్థితి,అకడమిక్ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్,నైపుణ్యాభివృద్ధి ప్రధానంగా ఉండేలా విద్యా బోధన సాగాలన్నారు.గేట్,సివిల్స్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు డిజిటల్ లైబ్రరీ సహాయంతో కోచింగ్ అందిస్తున్నట్లు చెప్పారు.ఆగస్టులో భోజనశాలకు కొత్త గుత్తేదారు నియమిస్తామని,భోజనశాల విస్తరణతో పాటు పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.వసతి గృహాలు,తరగతి గదులు,మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని సూచించారు.అనంతరం యూనివర్సిటీ ప్రాంగణాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, విద్యార్థులకు అందిస్తున్న వసతులను పరిశీలించారు.మహిళా సంఘాల ఆధ్వర్యంలో రూ.3.20 లక్షల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ పనులను పరిశీలించి,విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా మంచి తినుబండారాలు అందించాలని సూచించారు.కార్యక్రమంలో ఉపకులపతి గోవర్ధన్,ఓఎస్ డి మురళి దర్శన్,ఇన్‌చార్జి డిఆర్‌డిఓ శ్రీనివాస్,ఆర్ డిఓ కోమల్ రెడ్డి,తహసీల్దార్ పవన్‌చంద్ర,ఎంపిడిఓ,విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

## దత్తాత్రేయ ఆలయంలో మంత్రి దామోదర్ గురుపూర్ణిమ పూజలు



**ప్రజాపక్షం/సంగారెడ్డిప్రతినిధి:** సంగారెడ్డి జిల్లా ఝరాస ంగం మండలం బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. వేడుకలకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు .అర్చకులు పూర్ణకుంభంతో వేద మంత్రాలు చదువుతూ స్వాగతం పలికారు. దత్తాత్రేయ స్వామి ఆలయంలో శ్రీ దత్తయజ్ఞం ప్రారంభించి పూర్ణాహుతిలో మంత్రి పాల్గొన్నారు. జ్యోతిర్లింగాలు దత్తాత్రేయ స్వామి పంచవృక్షాలు ,శనీశ్వర దేవాలయాల వద్ద పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆశ్రమ పీఠాధిపతులు అవదూతగిరి మహారాజ్ ,సిద్దేశ్వరానందగిరి మహారాజ్ ఆశీస్సులు తీసుకున్నారు. ఆశ్రమ పీఠాధిపతులు అవదూతగిరి మహారాజ్ సిద్దేశ్వ రానందగిరి మహారాజ్ ఆశీస్సులు తీసుకున్నారు. తర్వాత గంగా తరంగణి పుస్తకాన్ని ఆవిష్కరించారు. వైదిక పాఠశాల విద్యార్థులో ముచ్చటించారు. రాష్ట్ర ప్రజలందరికి మంత్రి దామోదర్ గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అద్యక్షులు హనుమంత్ రావు పాటిల్ నాయకులు రామ్ రెడ్డి సిద్దన్న పాటిల్ వేణుగోపాల్ రెడ్డి, రాఘవేంద్ర రాజస్వామి తదితరులు పాల్గొన్నారు. కాగా మంత్రి రాక సందర్భంగా జహిరాబాద్ డిఎస్పీ సైదా ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు గావించారు.

## కళ్ళకల్ గ్రామంలో పోలీసుల కార్డెన్ సర్చ్



**ప్రజాపక్షం/మనోహరాబాద్:**మనోహరాబాద్ మండలంలోని మే జర్ గ్రామపంచాయతీ కళ్ళకల్ గ్రామంలో మెదక్ జిల్లా ఎస్‌పి డీ.వి.శ్రీనివాస్ ఆదేశానుసారం డి.ఎ స్.పి నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలోముగ్గురుసిఐలు,15 మంది ఎస్‌ఐలు, సుమారు 150 మంది పోలీస్ సిబ్బందితో కలిసి గురువారం ఉదయం కార్డెన్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఇందులో భాగంగా పోలీసులు గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ వాహనాలను తనిఖీ లు చేయగా,సరైనధ్రువీకరణపత్రాలులేని82 బైకులు, ఒక కారు, ఒక ఆటోని సీజ్ చేశారు. అ లాగే పలు బెల్టు షాపుల్లో అక్రమంగా నిలువ ఉంచిన 285 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని సంబంధిత ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకున్నట్లు డిఎస్ పినరేందర్ గౌడ్ తెలిపారు.ఈ సందర్భంగా వా రు మాట్లాడుతూ ప్రజలకు అండగా పోలీసులు ఉన్నామని భరోసా కల్పిస్తూ, నేరస్తులకు గుండెల్లో భయం పుట్టించాలన్న ముఖ్య ఉద్దేశంతోనే కార్డెన్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించామన్నారు. అలాగే ఇంటి యజమానులు తప్పనిసరిగా కెమెరాలను బిగించాలని అన్నారు. నేర నియంత్రణలో కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో నర్సాపూర్ సిఐ జాన్ రెడ్డి, రామాయంపేట సిఐ వెంకట రాజా గౌడ్, తూప్రాన్ సబ్ డివిజన్ లోని అన్ని పోలీస్టేషన్ల ఎస్‌ఐలు, ఎఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్స్, మహిళ కానిస్టేబుళ్లు, హోం గార్డ్స్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ రిజిస్ట్రేషన్లు వాస్తవమే

ప్రజాపక్షం ఎఫెక్ట్

### తహసీల్దార్ ముందు నేరం అంగీకరించిన శీలం సుభాష్‌రెడ్డి

**ప్రజాపక్షం/రామాయంపేట:**బీడికార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన పట్టాలకు ప్రైవేటుగా రిజిస్ట్రేషన్లు అనే కథనంతో ప్రజాపక్షం పత్రికలో ప్రచురితమైన వార్తకు రెవెన్యూ అధికారులు స్పందించారు. గత కొద్ది రోజులుగా బీడికార్మికులు వివిధ రూపాల్లో ఆందోళనలు, నిరసనలు తెలుపడంతో తహసీల్దార్ రజినికుమారి మండల సర్వేయర్‌తో గురువారం స్థల సర్వే నిర్వహించారు. గొడవలు జరుగుతాయనే నెపంతో పోలీసుల బందోబస్తు మధ్య సర్వే చేశారు. ప్రభుత్వం ఇచ్చిన పట్టాలకు తిరిగి ఏ అధికారంతో బీడికార్మికుల ప్లాట్లకు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశావని తహసీల్దార్ శీలం సుభాష్‌రెడ్డిని ప్రశ్నించగా బీడికార్మికుల ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసింది వాస్తవమేనని అంగీకరించాడు. కార్మికుల కోరిక మేరకు నాపేరుమీద భూమి ఉండడంతోనే రిజిస్ట్రేషన్ చేశానని సర్ధిచెప్పే ప్రయత్నం చేయగా తహసీల్దార్ సుభాష్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇష్టానుసారంగా అమ్మడం అమ్మిన భూములను తిరిగి రిజిస్ట్రేషన్ చేయడం ఏమిటన్నారు. ఇదే విషయమై సర్వేలో పాల్గొన్న ముదిరాజ్, యాదవ సంఘం సభ్యులు, బీడికార్మికులు సుబాష్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమ రిజిస్ట్రేషన్లపై తహసీల్దార్‌ను వివరణ కోరగా పోలీసులు, గ్రామస్థుల సమక్షంలో జరిగిన విచారణలో ప్రభుత్వ పట్టాలకు రిజిస్ట్రేషన్ చేసినట్లు శీలం సుబాష్‌రెడ్డి ఒప్పుకున్నప్పటికి పూర్థిస్థాయి నివేదిక వచ్చాక ఉన్నతాదికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా తదుపరి చర్యలపై అధికారులు ఎలాంటి ప్రకటన చేయకపోవడం కొసమెరుపు.

## దిందా వాగులో యువకుడు గల్లంతు



**ప్రజాపక్షం/ చింతలమానేపల్లి** :మండలంలోని దిందా కేతిని గ్రామాల మధ్య ఉన్న వాగులో కేతిని గ్రామానికి సద్మేక తిరుపతి అమృత దంపతుల కుమారుడు సుమన్ (18) అనే యువకుడు గురువారం వాగులో గల్లంతయ్యాడు. మృతుడి గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమన్ తన ముగ్గురు మిత్రులతో కలిసి వాగులో నీటి ఉధృతి తక్కువ ఉన్న సమయంలో వాగు అవుతలి వైపు ఉన్న చేనుకు చూడడం కోసం వెళ్లారు. చేనును చూసి తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో మధ్యలో ఉన్నవాగు దాటే క్రమంలో నీటి ఉధృతి ఒక్కసారిగా పెరగడంతో సుమన్ గల్లంతు అయ్యాడు. తోటి మిత్రులు గ్రామస్థులకు, బంధువులకు సమాచారం అందజేయడంతో వెళ్లి గల్లంతైన యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం కావడంతో ఆయన ఆచూకి లభించలేదు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**గ్రామంలోవిషాద ఛాయలు**

సుమన్ మృతి పట్ల కేతిని గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సద్మేక తిరుపతి అమృత దంపతులకు ముగ్గరు కొడుకులలో సుమన్ పెద్దవాడు కావడంతో కుటుంబానికి తోడుగా ఉండేవాడని, చేనుకు వెళ్లి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరవుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా, వాగుపై వంతెన నిర్మించడంతో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో అన్ని వసతులు ప్రభుత్వమే కల్పిస్తుంది: కలెక్టర్ ప్రావీణ్య



**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి:** కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేదలకు పక్కా ఇండ్ల నిర్మాణం కోసం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన డబుల్ బెడ్ రూమ్ పథకాలలో పక్కా ఇల్లు నిర్మించి ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. గురువారం ప్రధాన మంత్రి కార్యాలయ అధికారిని మన్మిత్‌కౌర్ జిహెచ్‌ఎంసి కమీషనర్ ఆర్వి కర్ణన్ లతో కలసి కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులతో జరిగిన ముఖాముఖి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీలో ప్రభుత్వం నిర్మించి ఇచ్చిన రెండు పడక గదుల ఇండ్లను ప్రధాన మంత్రి కార్యాలయ అధికారిని మన్మిత్ కౌర్ కలెక్టర్ ప్రావీణ్య జిహెచ్‌ఎంసి కమిషనర్లు పరిశీలించారు. లబ్ధిదారులకు మెరుగైన వసతుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సమీపంలో బిఎస్‌ఎన్‌ఎల్ టవర్ ఏర్పాటు, బ్యాంక్ సౌకర్యాలు, పోస్ట్ ఆఫీస్ ,ప్రైమినీ ఇంటర్ సెంటర్ అంగన్వాడీ కేంద్రం, ప్రభుత్వం పాఠశాలు ఇతర సౌకర్యాలు వసతులను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. దీంతో పాటు మెరుగైన రవాణా వసతుల కల్పన కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. 2 బిహెచ్ కె కాలనీ నుండి హైదరాబాదులోని అన్ని ప్రాంతాలకు బస్సు రవాణా సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం సమీపంలో మహిళా సాధికారతలో భాగంగా ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను అధికారులు పరిశీలించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ చీఫ్ ఇంజనీర్ ఏం చైతన్య కుమార్ జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ జిల్లా సంక్షేమ అదికారి లలిత కుమారి , జిల్లా వైద్యాదికారిణి గాయత్రీదేవి, సంగారెడ్డి, ఆర్డిఓ రవీందర్‌రెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ కమీషనర్ గృహనిర్మాణ శాఖ అధికారులు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## దత్తాత్రేయ స్వామిని దర్శించుకున్న మెదక్ ఎంపి రఘునందన్



**ప్రజాపక్షం/హత్నూర:**గురు పౌర్ణమి సందర్భంగా హత్నూర మండల పరిదిలోన మధుర దత్తాత్రేయ స్వామిని మెదక్ ఎంపి రఘునందన్‌రావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ఎంపి రఘునందన్‌రావు కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని పాడి పంటలు మంచిగా పండి రైతన్నలు చల్లగా ఉండాలని ఆయన కోరారు. సభాపతులు ఆధ్వర్యంలో పూజలు చేసిభక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో హత్నూర మండలబిజేపి పార్టీ అధ్యక్షుడు నాగ ప్రభుగౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళి యాదవ్ మెదక్ జిల్లా బిజేపి పార్టీ అధ్యక్షుడు మల్లేశం గౌడ్, మాజీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాపగిరి రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

## ఇంగ్లండ్‌పై భారత అమ్మాయిలు తొలి సిరీస్ విజయం..



**భా**రత మహిళల క్రికెట్ జట్టు కొత్త చరిత్ర సృష్టించింది. నాలుగో టీ20లో చిరస్మరణీయ విజయంతో ఇంగ్లండ గడ్డపై తొలిసారి సిరీస్ విజేతగా అవతరించింది టీమిండియా. మ్యాచ్ ఆసాంతం ఆధిపత్యం చెలాయించిన హర్మన్‌ప్రీత్ కౌర్ సేన ఆతిథ్య జట్టును ఆరు వికెట్ల తేడాతో ఓడించి మరో మ్యాచ్ ఉండగానే 31తో సిరీస్ కైవసం చేసుకుంది. తెలుగమ్మాయి శ్రీచరణి (2/30), ఆల్‌రౌండర్ రాధా యాదవ్(2/15).. షఫాలీ వర్మ(32) భారత జట్టు అద్భుత విజయంలో కీలక పాత్ర పోషించారు.

ఇంగ్లండ్ గడ్డపై పురుషుల జట్టు సంచలన ప్రదర్శనతో ఔరా అనిపిస్తుంటే.. మహిళల టీమ్ సైతం అదరహో అనిపించింది. 2006లో చివరిసారిగా టీ20లో ఆతిథ్య జట్టును ఓడించిన భారత్.. 19 ఏళ్ల చరిత్రను తిరగరాసింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో వరుసగా రెండు విక్టరీలతో ఇంగ్లండ్‌కు షాకిచ్చిన టీమిండియా నిర్ణయాత్మక నాలుగో టీ20లోనూ పంజా విసిరింది.

తొలి వికెట్‌కు 56 మూడో టీ20లో గెలుపొందిన ఇంగ్లండ అదే జోరును కొనసాగించలేకపోయింది. స్పిన్నర్లు రాధా యాదవ్(2/15), శ్రీచరణి (2/30)లు తిప్పేయగా ప్రత్యర్థి 127కే పరిమితమైంది. స్వల్ప ఛేదనలో ఓపెనర్లు షఫాలీ వర్మ(32), స్మృతి మంధాన(31)లు ధనాధన్ ఆడారు. తొలి వికెట్‌కు 56 పరుగులు రాబట్టడంతో ఇంగ్లండ బౌలర్లు బిక్క మొహం వేశారు. వీళ్లిద్దరూ ఔటయ్యాక జెమీమా రోడ్రిగ్స్(24 నాటౌట్), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(26)లు జట్టును విజయతీరాలకు చేర్చారు. 'చరిత్రలో నిలిచిపోయే సిరీస్ విజయం పట్ల సంతోషంగా ఉన్నా. మా జట్టులోని ప్రతి ఒక్కరి ప్రదర్శన పట్ల నేనెంతో గర్వపడుతున్నా. ఇంగ్లండ పర్యటన కోసం బీసీసీఐ ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహించడం మాకు ఎంతో ఉపయోగపడింది. అత్యుత్తమంగా ఆడేందుకు ప్రతిఒక్కరం కష్టపడ్డాం. అనుకున్నట్టే మా వ్యూహాలను అమలుచేసి.. సమిష్టిగా రాణించాం. వచ్చే ఏడాది ఇక్కడే టీ20 వరల్డ్ కప్ ఆడబోతున్నాం. కచ్చితంగా ఈ సిరీస్ విజయం మాలో స్ఫూర్తి నింపుతుంది' అని మ్యాచ్ అనంతరం హర్మన్‌ప్రీత్ వెల్లడించింది. నామమాత్రమైన ఐదో టీ20 జూలై 12న జరుగనుంది. అనంతరం మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో ఇరుజట్లు తలపడనున్నాయి.



## తొలి సెషన్‌లో భారత బౌలర్ల జోరు..

**బ**ర్మింగ్‌హమ్‌లో భారత బౌలర్ల ధాటికి చేతులెత్తేసిన ఇంగ్లండ్ బ్యాటర్లు లార్డ్స్‌లోనూ తడబడ్డారు. లారడ్స్‌లో జరుగుతున్న మూడో టెస్టులో తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి విజృంభణతో ఆతిథ్య జట్టు ఆదిలోనే కష్టాల్లో పడింది.

### ఒకే ఓవర్లో ఓపెనర్లు పెవిలియన్ చేరిన వేళ..

లార్డ్స్ మైదానంలో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్‌కు ఊహించని విధంగా నితీశ్ రెడ్డి నుంచి ముప్పు ఎదురైంది. కొత్త బంతితో బుమ్రా, సిరాజ్, ఆకాశ్ దీప్‌లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఈ మ్యాచ్‌లో తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ 83 ఓవర్లలో 4 వికెట్లకు 251 పరుగులు చేసింది. జోరూట్(191 బంతుల్లో 9 ఫోర్లతో 99 బ్యాటింగ్) సెంచరీకి చేరువవ్వగా.. బెన్ స్టోక్స్(102 బం తుల్లో 3 ఫోర్లతో 39 బ్యాటింగ్) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. భారత బౌలర్లలో నితీష్ కుమార్ రెడ్డి(2/46) రెండు వికెట్లు తీయగా.. జస్‌ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా తలో వికెట్ తీసారు. భారత బౌలర్ల ధాటికి ఇంగ్లండ స్లోగా ఆడింది. తమ శైలికి భిన్నంగా బ్యాటింగ్ చేసింది.





## లార్డ్స్ మ్యూజియంలో సచిన్ చిత్రపటం

**లండన్:** లార్డ్స్ మైదానంలో ఉన్న ఎంసీసీ మ్యూజియంలో ఇవాళ లెజెండరీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఇంగ్లండ్, ఇండియా మధ్య మూడో టెస్టు జరుగుతున్న నేపథ్యంలో సచిన్ చిత్రపటాన్ని ప్రదర్శించారు. స్టువర్ట్ పియర్సన్ రైట్ ఈ చిత్రపటాన్ని వేశారు. 18 ఏళ్ల క్రితం తీసుకున్న ఓ ఫోటో ఆధారంగా ఆయిల్ పేయింట్స్‌తో దీన్ని వేశారు. ఈ ఏడాది చివరి వరకు మ్యూజియంలో సచిన్ చిత్రపటం ఉంటుంది. ఆ తర్వాత దీన్ని పెవలియన్‌కు మార్చనున్నారు. గతంలో భారత మేటి క్రికెటర్లు కపిల్‌దేవ్, బిషన్ సింగ్ బేడీ, దిలీప్ వెంగ్‌సర్కర్ల పోట్రేట్లను కూడా పియర్సన్ వేశాడు. లారడ్స్‌లో తన చిత్రపటాన్ని ఉంచడం గౌరవంగా భావిస్తున్నట్లు టెండూల్కర్ చెప్పాడు. 1983లో కపిల్‌దేవ్ వరల్డ్‌ప్ గెలిచిన సమయంలో.. తొలిసారి లారడ్స్ స్టేడియాన్ని చూశానని, ఆ సందర్భం తన కండ్లల్లో ఉండిపోయిందని, ఇప్పుడు తన చిత్రపటం లారడ్స్‌లో ప్రదర్శించడం .. తన క్రికెట్ కెరీర్‌ను గుర్తుకు తెస్తున్నట్లు సచిన్ తెలిపాడు. ఎంసీసీ క్లబ్‌లో ప్రస్తుతం మూడువేల ఫోటోలు ఉన్నాయి. దాంట్లో 300 వరకు పోట్రేట్లు ఉన్నాయి.

# ఫోకస్ వ్యవసాయం



## తగ్గుతున్న పత్తి ఉత్పత్తి

**దే**శంలో పత్తి ఉత్పత్తి క్రమంగా తగ్గడం ఆందోళన కలిగిస్తున్న అంశం. ఇదే విషయాన్ని చర్చించడానికి ఈనెల 11వ తేదీ, శుక్రవారం పత్తి రైతులతో కీలక సమావేశాన్ని నిర్వహించనున్నట్టు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రకటించడం సమస్య తీవ్రతకు అద్దం పడుతున్నది. ప్రపంచంలోనే అతి పెద్ద పత్తి ఉత్పత్తిదారులలో భారత్ ఒకటి. అయినప్పటికీ, గత కొంతకాలంగా పత్తి ఉత్పత్తిలో గణనీయమైన తగ్గుదల కనిపిస్తోంది. ఈ పతనం కేవలం వ్యవసాయ రంగానికే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా ప్రభావం చూపే స్థాయిలో ఉంది. పత్తి పంట అనేది దేశంలోని అనేక రాష్ట్రాల్లోని కోట్లాది రైతుల జీవనాధారం. ఇది కేవలం బట్టల తయారీకి మాత్రమే కాకుండా, పత్తి గింజలు, నూనె, పశువుల మేతకు కూడా ఉపయోగపడుతుంది. టెక్స్టైల్ ఇండస్ట్రీ ఆధారంగా ఉన్న భారతదేశం వంటి దేశంలో పత్తి ప్రధాన ముడి పదార్థంగా నిలుస్తుంది. ఇంతటి ప్రాధాన్యతను సంతరించుకున్న పత్తి ఉత్పత్తి మన దేశంలో గత దశాబ్దకాలంగా స్థిరంగా పడిపోతున్నది. 2019–20లో 360 లక్షల బేల్స్ పత్తి ఉత్పత్తి కాగా, 2024–25 సీజన్ నాటికి ఇది 295 లక్షల బేల్స్‌కు పడిపోయింది. ఇది సుమారు 18 శాతం తగ్గుదల. దేశంలోని పత్తి సాగు విస్తీర్ణం తగ్గడం, దిగుబడిలో క్షీణత, వాతావరణ మార్పులు, రైతుల నిరుత్సాహం వంటి అంశాలే దీనికి కారణాలు.

### పత్తి సాగులో సమస్యలు

పత్తి సాగు ఎక్కువగా ఖరీఫ్ కాలానికే పరిమితమవుతుంది. కానీ వర్షపాతం అసమానంగా రావడం, ఎండదెబ్బలు, వర్షాల పొడవైన విరామాలు పత్తి మొక్కల ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. గత కొన్ని సంవత్సరాలలో గులాబ్‌బాల్వార్మ్ అనే కీటకం పత్తి పంటపై తీవ్రంగా ప్రభావం చూపింది. ఇది బిటి పత్తికి కూడా సోకడంతో, రైతులు నష్టాలను ఎదుర్కొంటున్నారు. ఇదే సమయంలో జాతులు వ్యతిరేకించటానికి కొత్త కీటకాలతో పోరాడటం చాలా కష్టమవుతోంది. కొత్తగా అభివృద్ధి చేసిన విత్తనాల మీద ఆశలు పెట్టుకున్నా, అవి అన్నివేళలా ఆశించిన దిగుబడిని ఇవ్వడం లేదు. ఎరువులపై అధిక ఖర్చు పెట్టినా, తగిన ఫలితం రాకపోవడం వల్ల రైతులు నష్టాల్లో పడుతున్నారు. అంతే కాదు... మార్కెట్‌లో పత్తి ధరలు తక్కువగా ఉండటంతో, రైతులు సోయాబీన్, మొక్కజొన్న, జొన్న వంటి ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇవి తక్కువ కాలంలో దిగుబడి ఇవ్వడంతో పాటు తక్కువ పెట్టుబడితో సాగ వచ్చు. పెట్టుబడికి తగినంత లాభాలు రాకపోవడం మరో సమస్య. పత్తి సాగు చేయడానికి పెట్టుబడి ఎక్కువగా అవసరం అవుతోంది. కానీ పత్తికి ఇచ్చే కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) రైతు ఖర్చుకి సరిపడే విధంగా ఉండకపోవడం వల్ల రైతులు దీన్ని వదిలేసే పరిస్థితికి చేరుతున్నారు. పత్తి పంట సాగు కోసం అవసరమైన విత్తనాల సరఫరా, వ్యవసాయ సలహాల పరంగా సమర్థవంతమైన ప్రభుత్వ విధానాలు లేకపోవడం కూడా పెద్ద సమస్యగా మారింది. ఇలావుంటే, పత్తి ఉత్పత్తి తగ్గుదల నేరుగా వస్త్ర పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపుతుంది. దేశీయంగా ముడిపత్తి కొరత తలెత్తడం వల్ల టెక్స్‌టైల్ ఇండస్ట్రీ దిగుమతులపై ఆధారపడుతోంది. పత్తి పత్తి పరిశ్రమ అనుబంధ రంగాల్లో పనిచేసే కార్మికులకు ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయి. ఇది గ్రామీణ ఉపాధిపై దుష్ప్రభావం చూపుతుంది.

దీని వల్ల ధరలు పెరగడంతో పాటు ఎగుమతుల స్థాయి తగ్గుతోంది. పత్తి సాగు చేస్తూ నష్టపోతున్న రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే ప్రమాదం ఉంది.

### ప్రభుత్వ చర్యలు కీలకం

**ప**త్తి ఉత్పత్తి పెరగడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకోబోయే చర్యలు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయి. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సమస్యలు చర్చించడం మాత్రమేకాదు... పరిష్కార మార్గాలు చూపాలి. పత్తి రైతులకు కేంద్రం అండగా ఉంటుందని హామీ ఇవ్వాలి. ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. వివిధ వ్యాధులను తట్టుకునే విధంగా ఉత్తమ రకాల విత్తనాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కీటకాల తీవ్రతను తట్టుకునే నూతన విత్తనాలను అభివృద్ధి చేసి రైతులకు అందించాలి. వాతావరణ అనుకూల వ్యవసాయ సాంకేతికతలపై రైతులకు అవగాహన కల్పించాలి. డ్రిప్ ఇరిగేషన్, మల్చింగ్, ఖర్చు తక్కువ చేసే వ్యవస్థలపై శిక్షణ ఇప్పించాలి. కనీస మద్దతు ధర విధానాన్ని సరైన రీతిలో అమలు చేసి, రైతుల ఆదాయాన్ని భరోసా కల్పించాలి. రైతులు నష్టాల్లో పడకుండా పత్తిని ప్రభుత్వ రంగ సంస్థలు తక్షణంగా కొనుగోలు చేసే విధానం ఉండాలి. అదే విధంగా దేశంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, పరిశోధన కేంద్రాలు సంయుక్తంగా పని చేసి, రైతులకు అమలులో వుండే పరిష్కారాలను అందించాలి. యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోకపోతే, పత్తి ఉత్పత్తి తగ్గుదల దేశ ఆర్థిక రంగంపైన కూడా తీవ్ర ప్రభావం చూపడం ఖాయం. ఇది రైతు జీవనోపాధిపై, పరిశ్రమపై, దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నది. దీన్ని ఎదుర్కోవాలంటే ప్రధానంగా ప్రభుత్వ విధానాలు, పరిశోధన సంస్థలు, మార్కెట్ వ్యవస్థలు సమష్టిగా పని చేయాల్సిన అవసరం ఉంది. పత్తి పంటను ప్రోత్సహించడానికి సాంకేతికత, పీడకనిరోధక విత్తనాలు, సరైన ధరల విధానం వంటి అంశాలు కీలకంగా నిలుస్తాయి. గ్రామీణ రైతు సముదాయం సంక్షేమం కోసం పత్తికి కొత్త జీవం పోసే విధానాల్ని సాధించాల్సిన సమయం ఇది.

## 13, 14న సిపిఐ జిల్లా మహాసభలు

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రవీణ్‌కుమార్



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 5వ జిల్లా మహాసభలు ఈ నెల 13,14 న జరుగనున్నాయని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సోతుకు ప్రవీణ్ కుమార్ తెలిపారు. జిల్లా మండలంలోని వెలిశాలలో సిపిఐ నాయకులతో మహాసభల కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతూ 99 వసంతాలను పూర్తి చేసుకున్న భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా మహాసభలను రేగొండ ఎస్ఎల్ఎన్ గార్డెన్‌లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా మహాసభలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాస్‌రావు ముఖ్య అతిథిలుగా హాజరవుతున్నారని తెలిపారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి మహాసభలో చర్చించి భవిష్యత్ కార్యక్రమం రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా మహాసభలను ప్రజలు, మేధావులు, కార్మికులు, యువకులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు క్యాతరాజ్ సతీష్, మండల సహాయ కార్యదర్శి రేణికుంట్ల ప్రవీణ్, నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్, రత్న రమాకాంత్, బోయిని సంతోష్, అల్లకొండ పవన్, మధుకర్, సమ్మయ్య, హరికృష్ణ, కుమార్, రామన్, ప్రసాద్, విజయ్, మౌనిష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక హక్కుల రక్షణకు నిత్య పోరాటం

### విజయవంతమైన కార్మిక సమ్మె
### ఎఐటియుసి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు కంచర్ల జమలయ్య



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** కార్మికుల రక్షణకు నిత్య పోరాటాలు చేయాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కంచర్ల జమలయ్య అన్నారు, కొత్తగూడెంలోని శేషగిరి భవన్‌లో గురువారం ఎఐటియుసి ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో జమలయ్య మాట్లాడుతూ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొన్న కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు. కేంద్రంలో కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన సార్వత్రిక సమ్మె జిల్లాలో విజయవంతమైందన్నారు. 44లేబర్ చట్టాలను 20కు కుదించి నాలుగు లేబర్ కోడ్లుగా విభజించి కార్మికుల హక్కులను కాలవస్తున్న కేంద్రప్రభుత్వం కార్మికుల నిరసనతో ఇప్పటికైనా తన మొండివైఖరిని వదులుకోవాలన్నారు. కార్మికుల 8 గంటల పని దినాలను 10 గంటలకు పెంచే యోవచనలో ప్రభుత్వం ఉందని అది కార్మిక చట్టాలకు వ్యతిరేకమన్నారు. కార్పొరేట్ రంగానికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వరంగాలను ప్రైవేటుపరం చేసేయోచనలు కేంద్ర ప్రభుత్వం ఉందన్నారు. కార్మికుల సమాన పనికి సమాన వేతనం అందించాలని కోరారు. అన్ని రంగాల కార్మికులు సమ్మెలో పాల్గొని నినాదాలతో కేంద్రానికి నిరసన వ్యక్తం చేశారన్నారు. రైతు కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దదించే వరకు పోరాటాలు చేస్తూనే ఉండాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేసి వారి భవిష్యత్తుకు భరోసా అందించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో బుధవారం కొత్తగూడెం జిల్లాలో బిజెపి మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన సార్వత్రిక సమ్మెలో వేలాదిమంది కార్మికులు ఉద్యోగులు, సింగరేణి పారిశ్రామిక కార్మికులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, బ్యాంకు, ఎస్ఐసి, పోస్టల్,టెలికం తదితర రంగాల కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొని సమ్మెను విజయవంతం చేసిన కార్మిక వర్గానికి, ట్రేడ్ యూనియన్ల నాయకులకు జమలయ్య అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రం ప్రవేశపెడుతున్న లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకునే వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. ఈ ఉద్యమంలో కార్మిక వర్గం మొక్కవోని దీక్షతో పాల్గొని మోదీ ప్రభుత్వ విధానాలను వెనక్కి తిప్పి కొట్టడానికి మరో పోరాటానికి సిద్ధం కావాలని జమలయ్య పిలుపునిచ్చారు. సమావేశంలో ఎఐటియుసి కార్మిక సంఘాల నాయకులు, ప్రతినిధులు గెద్దాడ నగేష్, వాసిరెడ్డి మురళి, గోనె మని,వీరాస్వామి, రమణ మూర్తి, తోట రాజు, క్రిస్టఫర్, కృష్ణయ్య ,రాజు, పాషా, తదితరులు పాల్గొన్నారు.

## నస్పూర్‌లో 50 పడకల ఆసుపత్రి ఏర్పాటు

### ఎఐటియుసి నాయకుల వినతి

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** కార్మికుల చికిత్సకు నస్పూర్‌లో 50 పడకల ఆసుపత్రిని తక్షణమే ఏర్పాటు చేయాలని ఎఐటియుసి నాయకులు వినతి పత్రం అందజేశారు. గురువారం శ్రీరాంపూర్ డివిజన్ పర్యటనకు వచ్చిన సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్‌ను యూనియన్ ప్రతినిధులు మర్యాదపూర్వకం గా కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నస్పూర్ డిస్పెన్సరీ కు ఆనుకొని సింగరేణికి చెందిన స్థలంలో ఆసుపత్రి నిర్మాణం చేస్తే కార్మికులకు ఆరోగ్య సేవలు అందించేందుకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో చర్చల ప్రతినిధి బద్రి బుచ్చయ్య, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ ప్రధాన కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ఏరియా కార్యదర్శి మూడ సుధాకర్, ఫిట్ కార్యదర్శి విజయలక్ష్మి , సత్తయ్య పాల్గొన్నారు.



## విద్యాసంస్థల సమీపంలో సిగరెట్, గుట్కా విక్రయాలు నిషేధించాలి

### ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఫహీమ్ దాదా వినతి



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** విద్యాసంస్థల సమీపంలో గుట్కా, సిగరెట్, పాన్ పరాగ్, కైని లాంటి వాటిని విక్రయించకుండా చూడాలని కొత్తగూడెం డిఎస్‌పికి అఖిల భారత యువజన సమైక్య ఆధ్వర్యంలో గురువారం .వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కే.ఫహీమ్ దాదా మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారిని తరిమి కొట్టాలని యువజన, విద్యార్థులకు పిలుపునిచ్చారు. విద్యాసంస్థల సమీపంలో సిగరెట్స్, గుట్కా పాన్ పరాక్ వంటి మత్తు ద్రవ్యాలు విక్రయించడం వల్ల విద్యార్థులు తెలిసి తెలియని వయసులో వాటికి ఆకర్షితులై జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా విద్యాసంస్థల సమీపంలో షాపుల నిర్వహణ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇష్టానుసారంగా బస్తీలలో బెల్ట్ షాపులు విపరీతంగా పెరిగిపోయాయని 24 గంటలు బెల్టు షాపుల్లో మద్యం విక్రయిస్తూ యువత జీవితాలతో చెలగాటం ఆడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దేశ భవిష్యత్తు విద్యార్థులు, యువకులేనని వారిని చెడు మార్గంలో పోనియకుండా ఆపే బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజా సంఘాల వారిపై ఉందనిన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఖయ్యూమ్, ఉపేందర్, సురేష్, రణధీర్, బానోత్ శ్రీను, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్ల బిల్లు ఆమోదించాల్సిందే

### బిసి హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమారస్వామి

**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** స్థానిక సంస్థల్లో బిసిరిజర్వేషన్ల బిల్లును మోదీ ప్రభుత్వం వెంటనే ఆమోదించాలని, లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని బిసి హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి డిమాండ్ చేశారు. వరంగల్ తమ్మెర భవన్‌లో జరిగిన ఖిలా వరంగల్ మండల కమిటీ సమావేశానికి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఓర్సు రాజుతో కలిసి కుమారస్వామి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం గత శాసనసభలో చేసిన స్థానిక సంస్థలలో 42శాతం బిసి బిల్లును గవర్నర్ ఆమోదించి కేంద్రానికి పంపించినప్పటికీ మోదీ ప్రభుత్వం ఈ బిల్లును ఆమోదించకుండా తాత్సారం చేస్తున్నారని, ఇప్పటికైనా వెంటనే స్థానిక సంస్థల బిల్లును ఆమోదించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలలో ప్రైవేటు పరిశ్రమలలో నూటికి 90 శాతం బిసిలే పనిచేస్తున్నారని, కార్మికులుగా, అసంఘటిత కార్మికులుగా, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ బేసిక్ ఉద్యోగులుగా పనిచేస్తున్న బిసిలను అణగదొక్కడానికి వారి శ్రమను దోపిడీ చేయడానికి మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందన్నారు. అగ్రవర్ణాల పెట్టుబడిదారుల ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేస్తున్న మోదీ ప్రభుత్వం పని చేస్తూ కార్మికుల ఎస్సీ, ఎస్టీ, బిసిల శ్రమను దోచుకోవడానికి 8నుంచి 10 గంటల పనిదినాన్ని కొత్త చట్టంలో చేర్చారన్నారు. హక్కులు కాల రాస్తున్న మోదీ కుట్రలను కార్మికులు, బిసిలు గమనించాలన్నారు. బిసి కులగణన చేయకుండా విద్య, ఉద్యోగ స్థానిక చట్టసభలలో బిసిల వాటా ఇవ్వకుండా మభ్యపెడుతూ 2028 వరకు కుల గణన పూర్తి చేస్తామని చెప్పుతున్నారంటే, రాబోయే ఎన్నికల్లో బిసిలకు వెన్నుపోటు పొడుస్తూనే తిరిగి 2029లో జరిగే జనరల్ ఎన్నికలలో లబ్ధి పొందడానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేసిన చట్టాన్ని తక్షణమే ఆమోదించాలనీ జూలై 15న రాష్ట్ర వ్యాప్తంగా, జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు జరిగే బిసిల ధర్నాలో బిసిలు అధిక సంఖ్యలో పాల్గొనాలనిఆయన కోరారు. సమావేశంలో మౌటం కుమారస్వామి, మండల కార్యదర్శి నల్లతీగల కుమార్, పద్మ, రజని, దివ్య, రమేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు



## కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు వెనక్కి తీసుకునే వరకు ఉద్యమం



### ఎఐటియుసి మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి సురేష్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్‌కోడ్‌లను వెనక్కి తీసుకునే వరకు ఉద్యమం కొనసాగుతుందని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి సురేష్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి కార్యాలయంలో కార్మిక సంఘాల జాయింట్ సమావేశం జరిగింది. సమావేశంలో సురేష్ మాట్లాడుతూ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం మహబూబ్ నగర్ జిల్లాలో జరిగిన సభలు, ర్యాలీలలో పెద్ద ఎత్తున అన్నిరంగాల కార్మికులు పాల్గొని బిజెపి మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారన్నారు. దేవరకద్ర, జడ్చర్ల, మహబూబ్ నగర్ పట్టణం, నియోజకవర్గ కేంద్రా ల్లో వేలాదిమంది కార్మికులు, ఉద్యోగులు, పారిశ్రామిక కార్మికులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఉద్యోగులు, బ్యాంకు, ఎస్ఐసి, పోస్టల్ టెలికం తదితర రంగాల కార్మికులు సార్వత్రిక సమ్మెలో స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేశారన్నారు. సమ్మెలో పాల్గొన్న కార్మిక వర్గానికి ట్రేడ్ యూనియన్ల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకునే వరకు ఉద్యయం కొనసాగుతుందని, ఈ ఉద్యమంలో కార్మిక వర్గం మొక్కవోని దీక్షతో పాల్గొని మోదీ ప్రభుత్వ విధానాలను వెనక్కి కొట్టడానికి మరో పోరాటానికి సిద్ధం కావాలని సురేష్ పిలుపునిచ్చారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు, సిఐటియు జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, టియుసిఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సి.వెంకటేష్, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు రాములు యాదవ్, టియన్‌టియుసి జిల్లా నాయకులు డి.రాములు తదితరులు పాల్గొన్నారు.

# స్థానికం

REGIONAL NEWS



వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## ఇందిరమ్మ ఇంటికి ముగ్గు పోసిన కోమ్మాలు

**ప్రజాపక్షం/గూడూరు:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమంలో భాగంగా మహబూబాబాద్ .ఇల్లా గూడూరు మండలం కేంద్రంలో గుండమల్ల కవిత వినోద్ ఇంటికి మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వాంకుడోత్ కోమ్మాలునాయక్ గురువారం భూమిపూజ చేసి చేశారు. ఈసందర్భంగా కోమ్మాలు నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.200 యూనిట్లు వరకు ఉచిత కరెంట్ హామీలకు ఉచిత బస్ సౌకర్యం 500 రూపాయలకే వంట గ్యాస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన 6 గ్యారెంటీలతో పాటు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదన్నారు.ఈకార్యక్రమంలో మండల జిల్లా నాయకులు బీరం శ్రీపాల్‌రెడ్డి ఇందిరమ్మ కమిటీ సభ్యులు చంటి స్వామి రాసమల్ల యాకయ్య ఎండి రసూల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరెకటికల అభివృద్ధికి కృషి చేస్తాం

ఆరె కటిక గురువు శ్రీధర్మ వ్యాదుడి విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎంపి కడియం కావ్య



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఆరెకటికల అభివృద్ధికి కృషి చేస్తామని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. అలంకార్ జంక్షన్ 11వ డివిజన్ లో ఆరె కటిక గురువు శ్రీ శ్రీ శ్రీ ధర్మ వ్యాదుడి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్యఅతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపి డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ ఐకమత్యంగా ఉంటేనే ఏదైనా సాధించవచ్చని అన్నారు. ఆరెకటికలు ఐకమత్యంగా ఉండి వారి సంఘం బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రభు త్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నదని తెలిపారు. ఆరెకటికలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. ఆరె సంఘం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి సురేందర్, మాజీ కార్పొరేటర్ మిరియాల్కర్ దేవేందర్, విష్ణువర్ధన్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఆరెకటిక సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళ మెడలోంచి బంగారు గొలుసు చోరీ

**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** ఓ మహిళ మెడలోంచి గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన సంఘటన గురువారం మండలంలో కలకలం సృష్టించింది. ఈ సంఘటనపై స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నిడిగొండ గ్రామంలో జాతీయ రహదారి పక్కనే ఉంటున్న పెద్దగోని సుజాత అనే మహిళ ఉదయం తన ఇంటి ముందు గడ్డి తీస్తుండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమె మెడలోని రెండు తులాల బంగారు గొలుసును తెంపుకుని పారిపోయారు. దీంతో బాధితురాలు లోబోధిబోమంటూ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. దీంతో సంఘటన సమాచారం తెలుసుకున్న జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ నరేష్ యాదవ్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. దీనిపై కేసు నమోదుచేసుకుని ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## బాలికపై అత్యాచారం

**ప్రజాపక్షం/పాలకుర్తి:** మైనర్ బాలికపై అత్యాచారం చేసిన ఘటనలో యువకునిపై ఫోక్సో కేసు నమోదు చేసిన ఘటన మండల పరిధిలో జరిగింది. ఎస్ఐ దూలం పవన్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రానికి చెందిన 16 ఏళ్ల మైనర్ బాలికపై తీగారం గ్రామానికి చెందిన యువకుడు దండంపల్లి ప్రణయ్ ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి గర్భవతిని చేశాడు. గత కొంత కాలంగా బాలికపై అత్యాచారం చేస్తున్నాడు. ప్రస్తుతం మైనర్ బాలిక 6 నెలల గర్భవతి అని తేలింది. దీంతో బాలికకు గర్భస్రావం నిమిత్తం టాబ్లెట్లు ఇవ్వడంతో బాలిక వేసుకోగా రక్తస్రావం జరిగింది. గమనించిన కుటుంబ సభ్యులు బాలికను నిలదీయగా అసలు విషయం బయటపడింది. ప్రస్తుతం బాలికను హన్మకొండలోని ప్రభుత్వ మెటర్నిటీ ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు యువకునిపై ఫోక్సో, అత్యాచారం కేసులు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## ఆర్‌టిసి బస్సును ఢీకొని యువకుడు మృతి

**ప్రజాపక్షం/పాలకుర్తి:** అతివేగంతో మోటార్ సైకిల్‌పై వెళ్తూ ఆర్టీసి బస్సును ఢీకొన్న ఓ యువకుడు మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ దూలం పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం రాయపర్తి మండలంలోని మైలారం గ్రామానికి చెందిన గాడిపెల్లి రంజిత్ అనే యువకుడు హైదరాబాద్‌లోని ఓ వైన్ షాపులో తన సోదరునితో పాటు చేసనిచేస్తున్నాడు. తన సొంత పని మీద పాలకుర్తి మీదుగా హైదరాబాద్‌కు మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా జనగాం నుంచి పాలకుర్తి వచ్చి బస్టాండ్ లోపలికి వెళ్తున్న టీఎస్‌ఆర్టీసి బస్సును మోటార్ సైకిల్‌పై వెళ్తున్న రంజిత్ ఢీకొట్టగా రక్తపు మడుగులో పడిఉన్న అతన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా 108 వాహనం ద్వారా జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా మృతిచెందినట్లు తెలుస్తుంది. కేసు నమోదుచేసి ధర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## గ్రామ తరలింపుపై ధర్నా చేస్తే కేసులు పెడతారా?



**ప్రజాపక్షం/గణపురం:** గణపురం మండలంలోని సింగరేణి ఓసి త్రీ మూలంగా దుమ్ము ధూళితో తీవ్ర ఇబ్బందులు పడుతుంటే పరుశురాం పల్లి గ్రామస్తులు అందరం కలిసి ధర్నాలు చేస్తే కేసులు పెడతారా అంటూ భూ నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం గణపురం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసులు నమోదు అయిన ఉడుత నాగరాజు, కనుకుంట్ల సమ్మక్క,ఉడుత సుమత, చిన్నబోయిన కృష్ణ, హనుమండ్ల రాజు, చిన్నబోయిన రాజు, మాట్లాడుతూ, గత 20 సం॥ లుగా పరుశురాం పల్లి గ్రామం సింగరేణి ఓసీ త్రీ మూలంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. దుమ్ము,ధూళి,నీళ్లు లేక బాంబు బ్లాస్టింగ్ లతో ఇంటి గోడలు పగుళ్లు ఏర్పడి ఇండ్లు కూలుతున్నాయన్నారు. దుమ్ము ధూళితో అనారోగ్య పాలై, ఊపిరితిత్తులు దెబ్బతింటున్నాయన్నారు. ఊపిరితిత్తుల వ్యాధులతో చాలా మంది మృతి చెందారన్నారు. గ్రామంలో 90 పంట పొలాలు తీసుకున్నారని దీంతో గ్రామాల్లో పనులు లేక వలసలు పోతున్నారన్నారు. దీంతో గ్రామస్తులు అందరం కలిసి మార్చి 10న సింగరేణి ఓసి త్రీ ముందు ధర్నా చేశామన్నారు. ధర్నా వద్దకు వచ్చిన సింగరేణి జిఎం నెల రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని సీఎండీతో మాట్లాడతానని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించామన్నారు. నెల రోజులైనా సమస్య పరిష్కారం కాకపోవడంతో ఊరంత కలిసి ఏప్రిల్ 8 న సమీ క్ష సమావేశం నిర్వహించుకొని ఏప్రిల్ 9న సింగరేణి లు పోలిస్ యంత్రంగా మా గ్రామస్తులను పిలిచి ధర్నా చేయకండి అని చెప్పారన్నారు. ఏప్రిల్ 10న గ్రామస్తులందరం కలిసి పెద్దఎత్తున ధర్నా చేశామన్నారు. అంతే కాక కేంద్ర బొగ్గు గల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని కలిసి మెమోరాడం అందించామన్నారు. అనంతరం సింగరేణి సిఎండి బలరాం నాయక్ కు ఊరి సమస్యపై వివరించామన్నారు. వీరితో పటు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క,మంత్రి శ్రీధర్ బాబు కు కూడా గ్రామ సమస్యలు వివరించామని తమ గ్రామాన్ని నూరు శాతం తరలిస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ ఏమైందో తెలియదు 6 గురి పై కేసులు పెట్టారని వివరించారు. తమపై ఎన్ని కేసులు పెట్టినా ఊరుకునేది లేదని తమ గ్రామం తరలించే వరకు ఈ పోరాటం ఆగదని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూ నిర్వాసితులు పాల్గొన్నారు.

# అభ్యాసన సామర్థ్యంలో జనగామ జిల్లా భేష్

అభినందనలు తెలిపిన జిల్లా కలెక్టర్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** విద్యార్థుల అభ్యాసన సామర్థ్యంలో జనగామ జిల్లాకు చోటు దక్కింది. దేశంలోని 50జిల్లాలో జనగామ ఉండడంతో జిల్లా కలెక్టర్‌తో పాటు విద్యాశాఖ అధికారులు హర్షం వ్యక్తం చేశారు. జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ విద్యాశాఖ అధికారులను అభినందించారు. దేశ వ్యాప్తంగా 3,6,9వ తరగతిలో అభ్యాసన సామర్థ్యాలపై నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే ఎన్ఎఎస్ 2024 ఫలితాలను కేంద్రం విడుదల చేసింది. ఇందులో జనగామ జిల్లా ఉండడం హర్షనీయం. దేశవ్యాప్తంగా గత డిసెంబర్‌లో ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో 3,6,9 తరగతి విద్యార్థులపై సర్వే చేశారు. ఎన్ఎఎస్‌లో పేరు సంపాదించడం కోసం గత ఆగస్టు మానం సుండే జనగామ జిల్లాలో కార్యాచరణ అమలు చేయడం మొదలు పెట్టారు. ఎస్‌సిఈఆర్‌టి రాష్ట్ర విద్యాశాఖ సహకారంతో నిర్ణయించిన కార్యక్రమాలకు తోడు జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించారు. జిల్లాలో ప్రతి నెల ఎంఇఓ ఆధ్వర్యంలో మండల స్థాయి, కాంప్లెక్స్ స్థాయి సమీక్షలు నిర్వయించారు. ఎన్ఎఎస్ ప్రశ్నపత్రాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. జిల్లా రిసోర్స్ పర్సన్ ద్వారా రూపొందించిన ప్ర శ్న పత్రాలతో జిల్లాలో పరీక్షలు నిర్వయించారు. ఇలా జిల్లాలో ప్రత్యేక మోడల్ టెస్టులు, గ్రాండ్ టెస్టులు నిర్వయించి విద్యార్థులను సిద్ధం చేశారు. దీనితో జిల్లా దేశంలోనే పేరు నిలబెట్టుకుంది.

## ములుగు మార్కెట్ కమిటీ కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రేగ కళ్యాణి, పాలక మండలి సభ్యులు గురువారం జిల్లా కేంద్రంల్లో లీలా గార్డెన్‌సలో ప్రమాణ స్వీకారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క, ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం రేగ కళ్యాణి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మంత్రి సీతక్క, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్‌లకు ధన్యవాదాలు తెలిపారు. మార్కెట్ కమిటీ సభ్యులు రసపుత్ సీతారాంనాయక్, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** భూపాలపల్లి మండలం ఎస్ఎం కొత్తపల్లిలో విద్యుత్ షాక్‌తో అంకేశ్వరపు వెంకటస్వామి (45) అనే ప్రైవేటు హెల్పర్ విద్యుత్ శాఖతో మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే భూపాలపల్లి మండలం ఎస్ఎం కొత్తపల్లి 33 బై 11 కెవి సబ్ స్టేషన్ మరమ్మత్తు రిపేర్ పనులు జరుగుతుండగా దూత్ పల్లి గ్రామానికి చెందిన ప్రైవేట్ హెల్పర్ గా పనిచేస్తున్న అంకేశ్వరపు వెంకటస్వామి విద్యుత్ షాక్ తో మృతి చెందాడు. మృతునికి కొడుకు, కూతురు, భార్య ఉన్నారు. సంఘటన స్థలానికి భూపాలపల్లి పోలీసులు చేరుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతుని పోస్టుమార్టం నిమిత్తం వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

## బొజ్యనాయక్ తండాను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి

వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**ప్రజాపక్షం/ నర్సంపేట :** భోజ్యానాయక్ తండను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. నర్సంపేట మండలంలోని బొజ్య నాయక్ తండాలో గతంలో కొన్ని కారణాలవల్ల మూసివేయబడిన ప్రభుత్వ మండల పరిషత్ పాఠశాలను గురువారం జిల్లా కలెక్టర్ పునః ప్రా రంభించారు. భోజన నాయక్ తండాలో పాఠశాల పునః ప్రారంభానికి కృషి చేసిన బొజ్య నాయక్ తండా వారియర్స్ యువకులు, తండావాసులకు పాఠశాలలో స్వచ్ఛందంగా తరగతులు నిర్వహిస్తున్న యువకులకు కలెక్టర్ అభినందించారు. బొజ్యానాయక్ తండలో నూతన ప్రభుత్వ పాఠశాల గదుల నిర్మా ణం కోసం ప్రభుత్వం నిధులు కేటాయించగా గురువారం జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి సందర్శించారు. కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉండాలని ఉద్దేశంతో పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నదని, నూతన భవనం నిర్మాణం కోసం చర్యలు తీసుంటామని కలెక్టర్ అన్నారు. గంగాదేవి పల్లి, మరియాపురం గ్రామాలతో పోటీపడి బొజ్జ నాయక్ తండాను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని, అందుకు కావలసిన ప్రణాళికలు రచించినచో ప్రభుత్వం పరంగా సహకారం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటించి వారికి గణిత శాస్త్రం, ఆంగ్లంలో పలు ప్రశ్నలు వేసి జవాబు రాబట్టారు. విద్యార్థులు ఇష్టపూర్వకంగా చదివి భావి భారత పౌరులుగా కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, ఎంఇఓ సారయ్య, తహసీల్దార్ రవిచంద్ర రెడ్డి, ఎంపిడిఓ శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య సిబ్బంది పనితీరు పర్యవేక్షణ బాధ్యత జవాన్లదే

బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** క్షేత్ర స్థాయిలో పారిశుధ్య సిబ్బంది పనితీరు పర్యవేక్ష ణ బాధ్యత జవాన్ల దే అని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. నగర పరిధిలోని 4, 5, 6 డివిజన్‌ల పరిధిలోని టైలర్ స్ట్రీట్ కుమార్ పల్లి మార్కెట్ రెడ్డిపురం పెగడపల్లి డబ్బాలు ప్రాంతాల్లో గురువారం కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి సానిటేషన్ నిర్వహి తీరును అధికారులను అడిగి తెలుసుకొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించిన కమిషనర్ హాజరు లో నమోదు చేసిన సిబ్బంది ఏరియాలో ఎక్కడ పని చేస్తున్నారో తనిఖీ చేశారు. ఏరియాలో ఎంత మంది జవాన్‌లు విధులు నిర్వహిస్తున్నారు? జవాన్‌లకు సిబ్బందికి సమన్వయం ఉందా? లేదా? తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. జవాన్‌లకు సిబ్బంది విధులను నిరంతరం పర్యవేక్షించాలని స్వచ్ఛ ఆటోలు, ట్రాక్టర్‌లు ప్రతి రోజు ఎన్ని ట్రిప్పులు వేస్తున్నారో పరిశీలించాలని, ఆయా ప్రాంతాల్లో డ్రైన్‌లను ఎన్ని సార్లు శుభ్రం చేస్తున్నారో అవగాహన ఉండాలని సిబ్బంది విధి నిర్వహణ విషయంలో తప్పుడు సమాచారం అందిస్తే సంబంధిత జవాన్ల ను సస్పెండ్ చేయడం జరుగుతుందని శానిటేషన్ తదుపరి ట్రేడ్ కలెక్షన్ వసూలు చేసే బాధ్యత జవాన్ల దే నని జవాన్ల కు కేటాయించిన డివిజన్ లలో 100 శాతం గృహాల నుండి చెత్త సేకరణ తడి పొడి చెత్తను వేరు చేసి సేకరించాలని స్వచ్ఛ ఆటో లకు తడి పొడి చెత్త ను వేయడానికి వీలుగా వేరు వేరు కంపార్ట్‌మెంట్‌లు ఉండాలని జవాన్లకు కేటాయించిన ఏరియా లో ట్రేడ్ లైసెన్స్ లేకుండా దుకాణాలు నడిపితే సంబంధిత జవాన్ పెనాల్టీ చెల్లించాలని కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సిఎంహెచ్‌ఓ డా॥ రాజారెడ్డి సానిటరీ సూపర్ వైజర్ నరేందర్, ఎఓ హరికుమార్, సానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు అనిల్, ప్రకాశ్, జవాన్‌లు తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో తల్లి, కొడుకు మృతి





**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** జనగామ పట్టణంలోని గిర్నిగడ్డ ప్రాంతానికి చెందిన చారబుడ్డి ఆహాల్యదేవి (80), చారబుడ్డి దయాకర్‌రెడ్డి (55) గురువారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఒకే సమయంలో ఇద్దరు మృతి చెందడం అనుమానాలు తావిస్తుండగా ఆహాల్య దేవి పెద్ద కుమారుడు దయాకర్‌రెడ్డి సోదరుడు వాసుదేవ రెడ్డి మాత్రం అనారోగ్య సమస్యతో బాధపడుతున్నారని, మృతిపై ఎలాంటి అనుమానం లేదని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. చారబుడ్డి దయాకర్‌రెడ్డి జనగామ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఈయన తండ్రి లక్ష్మారెడ్డి రిటైర్డ్ టీచర్ గతంలోనే మృతి చెందగా తల్లి ఆహాల్యదేవికి వచ్చే పింఛన్‌పైనే జీవనం సాగిస్తున్నారు. ఆహాల్యదేవికి స్పైన్ ఆపరేషన్ కాగా దయాకర్‌రెడ్డి సైతం మెడకు స్పైన్ సర్జన్ అయ్యింది. ఇద్దరు ఒకే ఇంట్లో ఉంటున్నారు. కాగా దయాకర్‌రెడ్డి గత కొద్ది రోజులుగా ఆనారోగ్యంతో బాధపడుతున్నారు. ఉదయం 8 గంటల సమయంలో బయటకు వెళ్లిన దయాకర్ రెడ్డి బయట సేవించేందుకు జొన్న గటక కొనుగోలు చేసి తీసుకెళ్లినట్లు తెలుస్తుంది. 9 గంటలకే ఇంటి పక్కవారు చూడడంతో ఆహాల్య దేవి కింద పడి, దయాకర్‌రెడ్డి కుర్చీలోనే చనిపోయి ఉన్నారు. వెంటనే సోదరుడు వాసుదేవరెడ్డికి పోన్ చేయడంతో హుటాహుటిన జనగామకు వచ్చారు. ఇద్దరు ఒకేసారి మృతి చెందడంపై అనుమానాలు ఉన్నా తన సోదరుడు వాసుదేవరెడ్డి మాత్రం ఎలాంటి అనుమానం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. జనగామ సిఐ దామోదర్‌రెడ్డి, ఎస్ఐ రాజేష్‌లు పరిశీలించారు. పంచనామ కోసం హాస్పటల్ తరలించారు. కేసు నమోదు చేసి ధర్యాప్తు చేయనున్నట్లు సిఐ దామోదర్‌రెడ్డి తెలిపారు.

## కాజీపేట ఆర్‌ఓబి పనులను త్వరగా పూర్తి

హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్



**ప్రజాపక్షం/హనుమకొండ:** కాజీపేట ఆర్‌ఓబి నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. గురువారం కాజీపేట ఫాతిమా నగర్ సమీపంలో కొనసాగుతున్న ఆర్‌ఓబి నిర్మాణ పనుల పురోగతిని అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన ఆర్‌ఓబి నిర్మాణ పనులను, ఇంకా పూర్తి చేయాల్సిన పనులను గురించి ఆర్ అండ్ బి శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్ బాబును కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. 72 మీటర్ల బోస్ట్రింగ్ గడ్డర్స్ ఒకవైపు పూర్తయిందని, మరొకవైపు పనులు పురోగతిలో ఉన్నాయని ఈఈ సురేష్ బాబు కలెక్టర్ కు వివరించారు. కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ఆర్‌ఓబి పనులను మరింత వేగవంతం చేయాలన్నారు. ఆర్‌ఓబి నిర్మాణ పనులు పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. హనుమకొండ ఆర్‌డిఓ రాథోడ్ రమేష్, కాజీపేట తహసీల్దార్ భావు సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## స్థిరమైన ఆదాయం.. ఆయిల్ పామ్ సాగుతోనే సాధ్యం

ఉద్యానవన పట్టు పరిశ్రమ జిల్లా అధికారి మరియన్న



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** ఆయిల్ పామ్ సాగుతో అధిక ఆదాయం అభిస్తుందని, ఎకరానికి నూనె రూపంలో రెండువేల కిలోలు దిగుబడి వస్తుందని జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న రైతులకు సూచించారు. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లాలో గురువారం 2వంద ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటే ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ మేళా పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మరియన్న మాట్లాడుతూ ప్రతి మనిషి ఆహారంలో వంట నూనె 25గ్రాములు ఉపయోగిస్తారని, అలా సొలీగా ఒక మనిషికి 10నుండి 12కెజిలు సంవత్సరాలనికి అవసరం ఉంటుందన్నారు. ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని వెచ్చించి ప్రతి ఏటా దిగుమతి చేసుకుంటోందని, వంట నూనెల ఉత్పత్తి పెంచే క్రమంలో ఆయిల్ ఫామ్ సాగు ప్రభుత్వం చేపట్టి పలు రాయితీను ఎకరానికి మొక్కలపై, బిందు సేద్యంపై, అంతర పంటల సాగుపై, యాజమాన్యానికి రూ.50,000 రాయితీ ప్రోత్సాహాలు అందిస్తోందన్నారు. అకాల వర్షాలు, గాలులు, వడగళ్ళు వల్ల వరిపంటకు జరిగే నష్టం ఈ ఆయిల్ పామ్‌కు ఉండదని ఆయన తెలిపారు. ఆయిల్ పామ్ తోటలకు చీడ బెడద కూడా తక్కువే ఉంటుందని, 5ఎకరాల వరకూ భార్య, భర్త కలిసి సాగు చేసుకోవచ్చని, కూలీలు కూడా అవసరం లేదని, పురుగు మందులు, ఎరువల వాడకం చాలా తక్కువగా ఉంటుందని, తద్వారా మేలైన వాతావరణం, కాలుష్య రహిత గాలి, నీరు, భూసారం, సేంద్రియ పదార్ధం పెరుగుతాయని మరియన్న తెలిపారు. ఈ మేళా కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి వ్యవసాయ అధికారి ఎ.శ్రీనివాస్, సహాయ వ్యవసాయ సంచాలకులు వి.విజయ్‌చందర్, జిల్లా ఆయిల్ ఫెడ్ ఇంచార్జి సిహెచ్ రాములు, వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, పిఎసిఎస్ అధ్యక్షులు, మార్కెట్ కమిటి చైర్మన్లు, డైరెక్టర్లుతో పాటు మండల వ్యవసాయాధికారులు, ఉద్యానవన అధికారులు, ఎంపిడిఓలు, తహసీల్దార్లు,ఐకెపి సహాయ ప్రాజక్టు మేనేజర్లు, ఉపాధి హామీ ఎపిఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఏఇఓలు, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ అధికారులు, బిందు సేద్యా ప్రతినిధులు, అభ్యుదయ ఆయిల్ పామ్‌రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలన అందరిబాధ్యత

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమా దేశ్ పాండే




**ప్రజాపక్షం / వేలేరు :** బాల్యవివాహా నిర్మూల అందరిబాధ్యత అని హనుమకొండ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే అన్నారు. గురువారం వేలేరు మండలకేంద్రంలోని గ్రామపంచాయితీ కార్యాలయంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు, 18 ఏళ్లలోపు బాలికలకు వివాహం చేయడం నేరమని అందుకు సహకరించిన ప్రతిఒక్కరూ చట్టప్రకారం శిక్షార్హులే అన్నారు. బాల్యవివాహాలు గ్రామీణ ప్రాంతాలలో ఎక్కడా జరుగుతున్నాయనేది పూర్తి సమాచారం అంగన్‌వాడి సిబ్బందికి, ఆశా కార్యకర్తలకు ఉటుంది కనుక మీరు తక్షణమే సఖీ సెంటర్‌కు 181,1930 ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలి లేదా అందుబాటులోని పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించడం వలన బాల్యవివాహాలను అడ్డుకోవడం జరుగుతోందని అలాగే మీకమ్యూనిటీలలోని కుల సంఘాలు. స్వచ్ఛంద సంస్థలు, యువకులు బాల్య వివాహాలపై అవగాహన సదస్సులను నిర్వహించుకోవాలని అన్నారు. బాల్యవివాహాలు చేసుకునే వారి వయసుదృవీకరణకు సంబంధించి ఆధార్ కార్డు లేదా, పాఠశాల స్టడీ సర్టిఫికెట్‌ను పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. 18ఏళ్లలోపు వయసు పిల్లలు వాహనాలు నడపకుండా, డ్రగ్స్ బారిన పడకుండా చూడాలన్నారు, ప్రస్తుత పరిస్థితులలో చిన్న పిల్లలు సెల్ ఫోన్ వాడకం మరోడ్రగ్ కంటే ప్రమాందగా మారిందని సోషల్ మీడియా రొంపిలో పడి అనేక మంది నష్టపోవడమేకాకుండా విలువైన ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. అనాథలు, ఎస్‌సి, ఎస్‌టిలకు సంబంధించిన వారు ఆర్థికంగా లేనివారికి సఖీ కేంద్రాల ద్వారా విద్యను అందించడంకోసం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, గురకుల పాఠశాలలలో విద్యను అందించడం జరుగుతోందని ఎవ్వరైనా నేరారోపణతో జైలు జీవితాలను అనుభవిస్తున్నవారికి ఉచిత న్యాయా సేవాధికరా సంస్థ ద్వారా సహాయసహకారాలను అందించడం జరుగుతోందని అన్నారు,బాల్య వివాహాలను అరికట్టడమేకాకుండా చిన్న పిల్లలకు సెల్ వాడకం వలన కలిగే నష్టాలపై వివరిస్తూ ప్రతిజ్ఞ చేశారు అనంతరం గ్రామపంచాయతీ సమీపంలో వనమహోత్సవం కార్యక్రమంలో బాగంగా మొక్కను నాటారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే,ఎంపిడిఓ లక్ష్మీ ప్రసన్న, ఎంఆర్‌ఓ కోమి, ఎంఇఓ చంద్రమౌళి, సఖీసెంటర్ నిర్వాహకులు హైమావతి, జిల్లా మహిళా అధికారి జయంతి, సిడిపిఓ విశ్వజ, ఎపిఎం జయసుధ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ విజయ,హెచ్ఎం జ్ఞానేశ్వర్,ఎస్సై సురేష్, గ్రామకార్యదర్శి రవికుమార్, అంగన్‌వాడి టీచర్లు,గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఎర్రబెల్లి పరామర్శ

**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండల కేంద్రానికి చెందిన కమ్మగాని శ్రీనివాస్ ఇటీవల మృతిచెందడంతో బాధిత కుటుంబాన్ని, వల్మిడి, ముత్తారం, పాలకుర్తి గ్రామాలలో బాధితులను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాస్ దేవరుప్పుల మండలంలో ఏపీవోగా విధులు నిర్వహించి అందరి మన్ననలను పొందాడన్నారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు పి నవీన్, సొసైటీ చైర్మన్ బి అశోక్‌రెడ్డి, నాయకులు ఎల్లయ్య, వేణు, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్, అశోక్, నాగన్న, సోమేశ్వర రావు, శ్రీనివాస్, బండి కిరణ్, రాములు, శ్రీనివాస్‌రెడ్డి, సురేష్, మహేందర్ నాయక్, కమ్మగాని మధు, పవన్, వెంకటేశ్వర్లు, నారాయణ, రాజేందర్, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/ కమలాపూర్:** ఎమ్మెల్సీ, టిపిసిసి ఉపాధ్యక్షుడు బల్మూరి వెంకట్ సహకారంతో మండలంలోని అంబాల గ్రామానికి చెందిన భోగిని రాజ్ కుమార్‌కి సిఎం సహాయం నిధి కింద రూ.30వేల చెక్కును జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామానికి చెందిన అనిల్‌కి రూ. 60వేల విలువ గల చెక్కులను కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దేశం ఐలయ్య గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సిఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్సీ వెంకట్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## 'నీట్'లో ర్యాంక్ సాధించిన విద్యార్థికి సన్మానం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని పెద్దతండాకు చెందిన లకావత్ నాగేశ్వరరావు, శారద కుమారుడు లకావత్ సాయి చరణ్‌సింగ్ ఆల్‌ఇండియా నీట్ ఎస్‌టీ క్యాటగిరిలో 1114వ ర్యాంక్‌ను సాధించాడు. ఆ విద్యార్థిని టిపిసిసి రాష్ట్ర క్యాంపెన్ కన్వీనర్, ఆల్‌ఇండియా బంజార సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ధరావత్ రామ్మూర్తి నాయక్ శాలువాతో సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరిన్ని మైలురాళ్లను దాటుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ధరావత్ భారతి ఉన్నారు.



## మత్స్య రైతుల అభివృద్ధికి చర్యలు
### అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మత్స్య రైతుల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా తగు చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి అన్నారు. జాతీయ మత్స్య రైతుల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్య రైతుల దినోత్సం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. మత్స్య రైతుల సాధకబాదకాలను సుదీర్ఘంగా చర్చించారు. మత్స్య రైతులకు బీమా, కిసాన్ క్రెడిట్ కార్డు మంజూరు, ఇతర సదుపాయాల కల్పన అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. భారతదేశంలో మూడేళ్లకు సరిపడా ఆహార ఉత్పత్తుల నిలువ సామర్థ్యం కలిగి ఉన్నాయన్నారు. రైతులు దేశానికి వెన్నెముక అని యువత కూడా రైతాంగం వైపు ఆసక్తి చూపాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా మత్స్య శాఖాధికారి శివప్రసాద్, సంబంధిత అధికారులు, మత్స్య రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** వాసవి క్లబ్ శివాలయం స్ట్రీట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఖమ్మం ఖాజీపుర పాఠశాలలో చదువుతున్న 80 మంది విద్యార్థులకు వాసవి క్లబ్ శివాలయం స్ట్రీట్ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ బాధ్యులు కె. రమేష్, రీజినల్ చైర్మన్ మోహన్‌దాస్, జోన్ చైర్మన్ ఎస్. శ్రీహరి, క్లబ్ అధ్యక్షుడు కె.భద్రయ్య, క్లబ్ కార్యదర్శి వల్లాల యుగంధర్, క్లబ్ కోశాధికారి పుల్లారావు, ధనుంజయ్, స్కూల్ అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని పిఆర్‌టియు ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు (వైవి) ప్రభుత్వాన్ని కోరారు. పిఆర్‌టియు ఖమ్మం అర్బన్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సభ్యత్వ నమోదు, సమస్యల సేకరణలో భాగంగా ఖమ్మం నగరంలోని రోటరీనగర్, పాండురంగాపురం, కైకొండాయిగూడెం, బల్లేపల్లి, పుట్టకోట, కొత్తగూడెం, వెలుగుమట్ల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా వైవి మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు వెంటనే చేపట్టాలన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దుపరిచి ఒపిఎస్ విధానాన్ని అమలు పర్చాలన్నారు. బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కెవి.రమణ, ఖమ్మం అర్బన్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు గుడిపూడి శ్రీనివాసరావు, రవికిరణ్, జిల్లా ఉపాధ్యక్షురాలు సుజాత, రామకృష్ణ, అచ్యుత్, మురళికృష్ణ, రంగారావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఖమ్మంలో మంత్రి తుమ్మల పర్యటన

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రెండు రోజులు ఖమ్మంలో పర్యటించనున్నారు. శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు ఖమ్మం నగరంలోని 55వ డివిజన్ బ్యాంక్ కాలనీ నందు సిసి రోడ్లు, డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం సాయంత్రం 5.30 గంటలకు 54వ డివిజన్ వీడియోస్ కాలనీలో ఆర్గానిక్ మార్కెట్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభిస్తారు. శనివారం ఉదయం 9.30గంటలకు రఘునాథపాలెం మండలం కెవి బంజర నందు బిటి రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేస్తారు. ఉదయం 10.30గంటలకు కొణిజర్ల మండలం అంజనాపురంలో మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొంటారు. అనంతరం రైతులతో జరిగే సమావేశంలో మంత్రి పాల్గొంటారు.

## మున్నూరు కాపులకు పార్టీ సముచిత స్థానం కల్పించాలి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జనాభాలో సింహ భాగంగా ఉన్న మున్నూరు కాపులకు రాజకీయ పార్టీలు సముచిత స్థానం కల్పించాలని మున్నూరు కాపు సంక్షేమ సంఘం సీనియర్ నాయకుడు గుండాల కృష్ణ తెలిపారు. గురువారం 27వ డివిజన్ మున్నూరు కాపు నూతన కమిటీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం శ్రీనివాసనగర్‌లో జరిగింది. ఈ సమావేశానికి గుండాల కృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మున్నూరు కాపులకు రాజకీయ పార్టీలు సముచిత స్థానం కల్పించాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలన్నారు. లేనియెడల తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు. కొత్తా సీతారాములు మాట్లాడుతూ మున్నూరు కాపులకు సముచిత స్థానం కల్పించిన వారికే తమ మద్దతు ఉంటుందన్నారు. మున్నూరు కాపులంతా ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మెంతుల శ్రీశైలం, మలిశెట్టి వెంకటేశ్వర్లు, కనకం జనార్ధన్, యర్రా అప్పారావు, తోట వీరభద్రం, రవి, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, నవీన్, కోశాధికారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనల ప్రకారం కోడిగుడ్ల టెండర్ నోటిఫికేషన్

### ఆగస్టు మొదటి వారంలోగా టెండర్ ఫైనల్ చేయాలి
### సమీక్షలో అదనపు కలెక్టర్ శ్రీజ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లు (రెసిడెన్షియల్ పాఠశాలలు), అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన కోడిగుడ్ల సరఫరాకు నిబంధనల ప్రకారం టెండర్ నోటిఫికేషన్ జారీ చేసి ఆగస్టు మొదటి వారంలోగా టెండర్ ఫైనల్ చేయాలని అదనపు కలెక్టర్ పి.శ్రీజ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ సంక్షేమ హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో కోడిగుడ్లు సరఫరా టెండర్ ప్రక్రియ, శిథిలావస్థలో ఉన్న భవనాల మార్పు, కామన్ డైట్ మెనూ అమలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం మినహాయించి మిగిలిన సంక్షేమ హాస్టళ్లు, కెజిబివి, అంగన్‌వాడీ కేంద్రాలు, ఇతర విద్యా సంస్థలకు జిల్లా స్థాయిలోనే అవసరమైన కోడిగుడ్లు కొనుగోలు చేసేందుకు కలెక్టర్ అధ్యక్షతన జిల్లా కొనుగోలు కమిటీకి అధికారాలు అప్పజెపుతూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీచేసిందన్నారు. జిల్లా కొనుగోలు కమిటీలో విద్యాశాఖాధికారి, ఎస్‌ఇ అభివృద్ధి అధికారి, బిసి అభివృద్ధి అధికారి, మైనార్టీ సంక్షేమ అధికారి, జిల్లా సంక్షేమ అధికారి, గిరిజన సంక్షేమ అధికారి, రెసిడెన్షియల్ విద్యా సంస్థల జిల్లా కోఆర్డినేటర్, పశు సంవర్థక శాఖాధికారి, అగ్‌మార్క్ అధికారులు సభ్యులుగా ఉంటారన్నారు. ఆగస్టు మొదటి వారంలోగా జిల్లాలో రెసిడెన్షియల్ విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన గుడ్లను స్థానికంగా సరఫరా చేసేందుకు టెండర్లను ఫైనల్ చేయాలన్నారు. టెండర్ ప్రక్రియ నిబంధనల ప్రకారం నోటిఫికేషన్ జారీచేయాలని ఆమె సూచించారు. నూతన టెండర్లు ఫైనల్ అయ్యే వరకు ప్రస్తుత సరఫరా ప్రక్రియ బ్రేక్ కాకుండా చూడాలన్నారు. జిల్లాలో శిథిలావస్థ భవనాల్లో ఉన్న హాస్టల్స్, అంగన్‌వాడీ కేంద్రాలను త్వరగా షిఫ్ట్ చేయాలన్నారు. హాస్టల్స్‌లో కామన్ డైట్ మెనూ అమలయ్యేలా చూడాలన్నారు.
ప్రతి బుధవారం జిల్లా అధికారులు క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేస్తూ నివేదికలు అందించాలన్నారు. పాఠశాలల్లో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన క్యాంపులు చేపట్టాలన్నారు. పిల్లలకు సేవింగ్స్ ఖాతా, డబ్బులు ఎలా జమచేసుకోవాలి, ఆర్థిక అంశాల గురించి వివరించాలన్నారు. జిల్లాలో ఆరవ తరగతి విద్యార్థులందరికీ బ్యాంకు ఖాతాలు ప్రారంభించి దానిని ఎలా వినియోగించుకోవాలో అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల సంక్షేమ అధికారులు కస్తాల సత్యనారాయణ, ఎన్.విజయలక్ష్మి, డాక్టర్ పురంధర్, సిఎంవో రాజశేఖర్, ఇన్‌చార్జి బిసి అభివృద్ధి అధికారి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## రామానుజవరం గ్రామ పంచాయతీని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే బాధ్యత నాది



### అభివృద్ధి పనుల శంకుస్థాపనలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/మణుగూరు :** మణుగూరు మండలంలోనే రామానుజవరం గ్రామ పంచాయతీని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే బాధ్యత నాది అని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హామీ ఇచ్చారు. గురువారం మణుగూరు మండలం రామానుజవరం గ్రామపంచాయతీలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ, సిసి రోడ్లకు శంకుస్థాపన పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ ప్రజల గుండెల్లో నిలిచిపోయేలా రామానుజవరం పంచాయతీలో ఇప్పటివరకు అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్నారు. ఇప్పటికీ ఇల్లు రాని లబ్ధిదారులకు రెండో విడతలో ఖచ్చితంగా ఇళ్లు కేటాయిస్తాం అన్నారు. ఈ పంచాయతీలో ప్రతి వీధికి, ప్రతి తండాకు సిసి రోడ్లు మంజూరు చేయిస్తాను అన్నారు. 2014లో తాను ఎమ్మెల్యే వున్నపుడు రామానుజవరం, స్కూల్ కొండాయిగూడెం, హరిజనవాడ, శ్రీకృష్ణపురం, అయోధ్యనగర్ గ్రామాలను కలుపుతూ తాను బిటి రోడ్డు వేయించానని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ రోడ్డు గుంటలు ఏర్పడి పాడవుతున్నందున 2025లో మరలా అట్టి బిటి రోడ్డు మంజూరు చేయించి త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం అన్నారు.
ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ, ఇఒఆర్‌డి, పిఆర్ ఎఇ, మండల కార్యదర్శి పేరినాకి నవీన్, మాజీ సర్పంచ్, తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షులు బాడీశ సతీష్, తరుణ్ రెడ్డి, సీతయ్య, నోముల రవి, తమ్మిశెట్టి సాంబ, కట్టా నరసయ్య, దేగల కృష్ణరావు, సాదిని శంకర్, దోనకాని రాములు, చీమల రాములుతో పాటు ప్రభుత్వ అధికారులు, యువత, రైతులు, గ్రామపెద్దలు, మహిళలు, యువకులు, రైతులు, ఎమ్మెల్యేను పూలమాలలతో, శాలువాలతో ఘనంగా సన్మానించి, తమ ప్రేమను, గౌరవాన్ని హృదయపూర్వకంగా తెలిపారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఎంపి వద్దిరాజు రవిచంద్ర పంపిణీ చేశారు. వివిధ అనారోగ్య కారణాలతో చికిత్సలు పొంది ఆర్థిక చేయూత కోసం రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర సిఫారసు మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఎంపి వద్దిరాజు రవిచంద్ర పంపిణీ చేశారు. 13 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పల వెంకటరమణ, శీలంశెట్టి వీరభద్రం, తోట రామారావు, పగడాల నరేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





**ఐఐటి సీటు సాధించిన ఆదర్శకు అభినందనలు**
ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి) చెన్నైయ్‌లో సీటు సాధించిన సామాజిక ఉద్యమ కారుడు లింగాల రవికుమార్ కుమారుడు లింగాల ఆదర్శను ఎంపి వద్దిరాజు రవిచంద్ర అభినందించారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించి చెన్నైయ్‌లో సీటు సాధించినందుకు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఎంపి వద్దిరాజు రవిచంద్రను లింగాల రవికుమార్ తన కుమారుడు ఆదర్శతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆదర్శను ఎంపి వద్దిరాజు రవిచంద్ర శాలువతో సత్కరించారు. మరిన్ని లక్ష్యాలను చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు.
**ఖమ్మం రూరల్ ...**
ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని వరంగల్ క్రాస్‌రోడ్‌కు చెందిన ఎర్ర కల్పనకు రూ.21,500ల విలువగల సిఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరు అయ్యింది. బాధితురాలు అనారోగ్య ఖర్చుల నిమిత్తం సిపిఐ పార్టీ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్ సహకారంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సిఫారసు ద్వారా లభించింది. దీనిని స్థానిక సిపిఐ ఆధ్వర్యంలో సిపిఐ నేత దండి రంగారావు నివాసంలో గురువారం లబ్ధిదారురాలికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సమితి సభ్యుడు వెంపటి సురేందర్, సిపిఐ 28వ డివిజన్ కార్యదర్శి వెంపటి రాము, 29వ డివిజన్ కార్యదర్శి లగిశెట్టి రమేష్, 29వ డివిజన్ కార్యదర్శి వెంపటి రాము, 30వ డివిజన్ కార్యదర్శి బియ్యాల రాజు, ఎఐవైఎఫ్ 28వ డివిజన్ కార్యదర్శి మిర్యాల నరుణ్‌తేజ్, 30వ డివిజన్ అధ్యక్షుడు దైథా జేమ్స్, ఆయా డివిజన్ల నాయకులు అక్కినపల్లి కర్ణచారి, కోట శ్రీనివాస్ రెడ్డి, బూరెల రాము, రంజిత్, చింతల ఉదయ్, మహిళా సమాఖ్య నాయకులు బుద్ధి అలివేలు, తమ్మనబోయిన మంజుల తదితరులు పాల్గొన్నారు.



## నిర్మాణంలోని పెట్రోల్ బంక్ పిండం పెట్టిన ఉద్యమకారులు

**ప్రజాపక్షం/దమ్మపేట :** దమ్మపేట ఆర్టీసి బస్టాండ్ ప్రాంగణంలో నిర్మిస్తున్న పెట్రోల్ బంక్‌కు వ్యతిరేకంగా చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 11వ రోజుకు చేరుకున్నాయి. అందులో భాగంగా 11 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నప్పటికీ అధికారులు స్పందించకపోవడంతో వినూత్నమైన రీతిలో ఉద్యమకారులు నిరసన తెలిపారు. గురువారం బస్టాండ్ ప్రాంగణంలో నిర్మిస్తున్న పెట్రోల్ బంకు నిర్మాణాల వద్ద వాటికి పిండ ప్రదానం చేసి నిరసన తెలిపారు. అధికారులు బస్టాండ్ ప్రాంగణంలో పెట్రోల్‌బంక్ నిర్మాణాన్ని నిలుపు వేస్తున్నామని అధికారికంగా తెలియజేసేంతవరకు ఉద్యమం ఆగదని, రోజురోజుకు ఉద్యమం మరింత ఉధృతంగా ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట ఆర్టీసి బస్టాండ్ పరిరక్షణ కమిటీ సభ్యులు సున్నం శ్రీను, ఎస్.కె రహీం, ఎస్‌కె.వలి, పాశం రవి, తంబళ్ల రవి, ఉడతనేని విశ్వేశ్వరరావు, నల్లగట్ల సత్యంబాబు, గొర్రెపాటి చిన్ని తదితరులు పాల్గొన్నారు.

## రేషన్‌కార్డుల కోసం దళారులను నమ్మి మోసపోవద్దు
### తహసీల్దార్ లూథర్‌విల్సన్



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తెలంగాణ ప్రభుత్వం ఆహార భద్రత కార్డు ఎలాంటి ఖర్చు లేకుండా అర్హులకు అందించేందుకు మార్గదర్శకాలు రూపొందించిందని, లబ్ధిదారులకు రేషన్ కార్డు జారీ విషయంలో దళారులను నమ్మి మోసపోవద్దని తహసీల్దార్ లూథర్‌విల్సన్ తెలిపారు. తిరుమలాయపాలెం మండల పరిధిలోని ప్రజలంతా రేషన్‌కార్డు కోసం మధ్యవర్తుల్ని సంప్రదించి ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని, నేరుగా మీ సేవలో ఆన్‌లైన్ చేసిన 20 రోజుల తర్వాత ఎంక్వయిరీ చేసి రేషన్ కార్డు అందిస్తామని ఆయన తెలిపారు. నూతన రేషన్ కార్డు అయిన పాత రేషన్‌కార్డులో కుటుంబసభ్యులు చేర్చాలన్న ఎవరికి డబ్బులు ఇవ్వకుండా నేరుగా మీ సేవా కేంద్రంలో ప్రభుత్వం నిర్ధేశించిన ఆన్‌లైన్ రుసుం చెల్లించి ఆన్‌లైన్ కాపీని తహసీల్దార్ కార్యాలయంలో ఇస్తే ఎంక్వయిరీ చేసిన అనంతరం 20రోజుల తర్వాత రేషన్ కార్డు అందిస్తామని ఆయన తెలిపారు. ప్రభుత్వం ఆహార భద్రత కార్డు కోసం పలు నిబంధనలను రూపొందించిందని, ఆహార భద్రత కార్డు పొందేవారికి 7.5 ఎకరాల మెట్ట, 5.5 ఎకరాల మాగాణి వ్యవసాయ భూమి ఉంటే రేషన్ కార్డుకి అర్హులు కాదని, దిగువ ఉన్న వారు అర్హులు అవుతారని తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్లకు శంకుస్థాపన





**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గురువారం మండల పరిధిలోని చింతగుర్తి గ్రామంలో పలువురు లబ్ధిదారులు ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమన్నారు. దశలవారీగా ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వం ఇస్తుందన్నారు. ప్రభుత్వమే ఐదు లక్షలు ఇంటి నిర్మాణానికి అందిస్తుందన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సారథ్యంలో పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావులకు కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ దిరిశాల చిన్నవెంకటేశ్వర్లు, మాజీ సర్పంచులు తమ్మిని నాగేశ్వరరావు, మెంటెం రామారావు, సొసైటీ చైర్మన్ తాతా రఘురాం, కాంగ్రెస్ మండల కన్వీనర్ వాంకుడోత్ దీప్లానాయక్, కొత్తా కొమరయ్య, హౌజింగ్ ఎఇ పుష్ప, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.
**ప్రజాపక్షం/ఎర్రుపాలెం :** మండల పరిధిలోని భీమవరం ఇందిరమ్మ కాలనీలో 8మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, గ్రామ కాంగ్రెస్ నాయకులు ఎర్రమల పూర్ణచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గురువారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామంలో యరమల పూర్ణచంద్రారెడ్డి వితరణతో ఏర్పాటు చేసిన ఆర్ఒ ఫ్రీ వాటర్ ప్లాంట్‌ను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. పూర్ణచంద్రారెడ్డిని పలువురు గ్రామస్థులు, మండల కాంగ్రెస్ నాయకులు అభినందించారు.
ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శీలం శ్రీనివాస్‌రెడ్డి, అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, చావా రామకృష్ణ, అనుమోలు వెంకట కృష్ణారావు, యరమల పూర్ణచంద్ర, బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి, సాంబశివరావు, తలుపురెడ్డి నాగిరెడ్డి, దేవరకొండ రాజీవ్‌గాంధీ, గుడేటి బాబురావు, చిన్నవెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మాయమవుతున్న మేడికుంట చెరువు

* రూ.కోట్ల విలువైన భూమి కబ్జాదారుల పాలు
* పట్టించుకోని అధికారులు
* ఇంటి నెంబర్లతో విద్యుత్ మీటర్లు
* పెద్ద మొత్తంలో చేతులు మారిన ముడుపులు
* తిలా పాపం తలాపిడికెడు చందం



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మేడికుంట చెరువు మాయమైపోతుంది. కోట్ల విలువైన భూమి కబ్జాకు గురవుతోంది. అక్రమార్కులు అందినకాడికి దోచుకొంటున్నారు. పెద్ద మొత్తంలో ముడుపులు చెల్లిస్తూ అధికారులను మచ్చిక చేసుకొంటున్నారు. తెరవెనుక సహాయ సహకారాలతో కబ్జారాయుళ్ళు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఈ కబ్జా వెనుక కొందరి పిడికెడి పాపం ఉన్నట్లు పుకార్లు షికారు చేస్తున్నాయి.
*** మట్టి పోసి చదును చేసి..** కబ్జాదారులు పక్కా ప్రణాళికతో మొదటగా చెరువు భూమిలో చెత్తా చెదారం వేస్తారు. కొద్ది కొద్దిగా గ్రావెల్‌ను డంప్ చేస్తారు. ఎవరూ పట్టించుకోకపోవటంతో రాత్రి వేళల్లా లారీ టిప్పర్లతో మట్టిని పోసి ట్రాక్టర్ డోజర్‌లతో చదును చేసి తమ ఆధీనంలోకి తెచ్చుకొంటారు. ఇదే తరహాలో తాజాగా కొద్ది రోజుల క్రితం నుండి లారీ అసోసియేషన్ హాల్ నుండి గొల్లగూడెం ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న సుమారు కోటికి పైగా విలువైన దాదాపు 400 గజాల విస్తీర్ణం కలిగిన మేడికుంట శిఖం భూమిలో కొందరు వ్యక్తులు టిప్పర్‌లతో మట్టిని నింపి తమకు అనుకూలమైన సమయంలో ట్రాక్టర్ డోజర్‌లతో చదను చేస్తున్నారు. కళ్ళెదుటనే జరుగుతున్నా ఇరిగేషన్ అధికారులు, రెవిన్యూ అధికారులు పట్టించుకోవటం లేదని తెలుస్తోంది.
*** సహచట్టంతో వెలుగుచూసిన అక్రమాలు :** సమాచారం హక్కు చట్టం ద్వారా వివరణ కోరగా పది మంది ఆక్రమించుకొన్నారని సంబంధిత అధికారులు తేల్చిచెప్పటం విశేషం. ఆక్రమించుకొన్నారని సమాచారాన్ని ఇచ్చిన సదరు అధికారులు చెరువును కాపాడటంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు అంటున్నారు.
*** గజం రూ.60వేల నుండి లక్ష వరకు :** జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న చెరువు సమీపంలో గజం భూమి ధర 60 వేల నుండి రూ.1లక్ష వరకు పలుకుతోంది. దీనితో కోట్ల విలువ చేసే 644 సర్వే నెంబర్‌లోని 2 ఎకరాల 9 కుంటలు విస్తీర్ణం కలిగిన మేడికుంట శిఖం భూమిపై కబ్జారాయుళ్ళ కన్ను పడింది. చెరువు తూర్పుభాగంలోని కట్టను, తూమును ధ్వంసం చేశారు. గత కాలపు ఆనవాళ్ళను చెరిపేస్తూ ఆక్రమించుకుని దర్జాగా పక్కా భవనాలు నిర్మించారు. మున్సిపాలిటీ అధికారులకు అప్పట్లో పెద్ద ఎత్తున ముడుపులు ముట్టజెప్పి ఇంటి నెంబర్‌లు తెచ్చుకొన్నారు. ఆ ఇంటి నెంబర్లు ఆధారంగా విద్యుత్ అధికారులు కరెంటు మీటర్లను సైతం ఇచ్చేశారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కబ్జాదారుల దగ్గర నుండి భారీ మొత్తంలో అధికారులు మడుపులు పుచ్చుకొని మౌనం వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై పలువురు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా ఈ తంతు గత దశాబ్ధ కాలంగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. కాగా కట్టమీద నిర్మించిన ఇళ్లకు ఇచ్చిన ఇంటి నెంబర్లను రద్దు చేయాలని కోరుతూ మున్సిపాలిటీ అధికారులకు లేఖలు సమర్పించినట్లు ఇరిగేషన్ ఇఇ అర్జున్ తెలిపారు.
*** నోటీసులిస్తాం - ఇరిగేషన్ ఎఇ - గురువేష్ :** మట్టి మురుపు పోసిన మాట వాస్తవమే. ఈ చర్యకు పూనుకున్న వాళ్లు ఎవ్వరో తెలుసుకుని వారికి నోటీసులు ఇస్తాం. ఇఇ అర్జున్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులకు లేఖరాసి హద్దులు నిర్ణయించాలని కోరుతాం, పోలీసులకు కూడా ఫిర్యాదు చేస్తున్నాం. నీటివనరుల చుట్టుపక్కల ప్రదేశాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టడానికి లేదు.
ఇదే ప్రాంతంలో మిషన్ భగీరధ వాళ్లు చెత్తా చెదారం పోస్తే చెప్పగానే తొలగించారు.
*** చర్యలు తీసుకొంటాం - తహశీల్దార్ - దారా ప్రసాద్ :** ఈ విషయంపై తహశీల్దార్ దారా ప్రసాద్ వివరణ కోరగా ఇంతవరకు మాదృష్టికి రాలేదు. ఆర్ఐతో విచారణ జరిపిస్తామన్నారు. దోషులపై కఠిన చర్యలు తీసుకొంటామని తెలిపారు.

# రీల్

## 13 నుంచి తనికెళ్ళ భరణి నాటకరంగ స్వర్ణోత్సవాలు




ప్రముఖ సినీ నటుడు, రచయిత తనికెళ్ళ భరణి జీవిత నాటక రంగ స్వర్ణోత్సవాలు ఈనెల 13, 14తేదిల్లో జరుగుతాయని తనికెళ్ళ భరణి తెలిపారు. రెండు రోజుల పాటు ఈ నాటకోత్సవాలు రవీంద్ర భారతిలో జరుగుతాయని అన్నారు. 13వ తేదిన సాయంత్రం ఈ నాటకాలు ప్రారంభమవుతాయని చెప్పారు. గోరహణం, కొకొరొక్కో, గార్దబంధం, చల్ చల్ గుర్రం, జంబుద్వీపం వంటి నాటకాలను ప్రదర్శిస్తామని ఆయన తెలిపారు. సినీ నటులు ప్రకాష్ రాజ్, తమ్మారెడ్డి భరద్వాజ, కేవి రమణాచారి, బొల్లినేని క్రిష్ణయ్య, వరప్రసాద్ రెడ్డి, ఝాన్సి అతిధులుగా హాజరవుతారని భరణి పేర్కొన్నారు.



## మహావతార్ నరసింహ ట్రైలర్ రిలీజ్

హోంబాలే ఫిలమ్స్ సమర్పణలో క్లీమ్ ప్రొడక్షన్స్ మహావతార్ సినిమా నుంచి నరసింహ అవతారం ట్రైలర్ రిలీజ్ చేశారు. హిరణ్యకశిపుడు బ్రహ్మ దేవుడి వరం కోసం ఘోర తపస్సు చేసే సీక్వెన్స్ తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం కట్టిపడేసింది. విష్ణువుపై భక్తితో ప్రహ్లాదుడు, తన నాస్తిక తండ్రి హిరణ్యకశిపుడి నుండి వ్యతిరేకతను ఎదుర్కొంటాడు. ప్రహ్లాదుడిని రక్షించడానికి దిగివచ్చిన విష్ణువు అవతారమైన మహావతార్ నరసింహుడి రాకతో ట్రైలర్ ఆసక్తి కలిగించింది. ఈ సందర్భంగా నిర్మాత శిల్పా ధావన్ మాట్లాడుతూ నరసింహ ఇతిహాస కథను ఆవిష్కరించడానికి సిద్ధంగా ఉన్నాము! ప్రతి ఫ్రేమ్, ప్రతి క్షణం, ప్రతి హార్ట్ బీట్ ఈ గొప్ప కథకు ప్రాణం పోసింది. నర్సింహా గర్జన వస్తోంది' అన్నారు ఈ చిత్రానికి దర్శకుడు అశ్వనీ కుమార్.ఈ చిత్రం 3డిలో ఐదు భారతీయ భాషలలో 2025 జులై 25న విడుదలవుతోంది.

## ధనుష్ డి54 షూటింగ్ ప్రారంభం




డాక్టర్ ఇషారి కె. గణేష్ నేతృత్వంలోని వెల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ బ్యానర్‌పై ధనుష్ హీరోగా నటిస్తున్న డి54 చిత్రం షూటింగ్ ప్రారంభమైంది ఈ చిత్రంలో జాతీయ అవార్డు గ్రహీత ధనుష్ ప్రధాన పాత్రలో నటించగా, మమిత బైజుతో కలిసి నటించారు. ఈ చిత్రంలో ధనుష్ తొలిసారిగా అతనితో జతకట్టారు. కెఎస్ రవికుమార్, జయరామ్, కరుణాస్, సూరజ్ వెంజరమూడు, పృథ్వీ పాండియరాజన్ వంటి ప్రముఖ నటులు కూడా ఉన్నారు.జాతీయ అవార్డు గ్రహీత స్వరకర్త జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. తేని ఈశ్వర్ సినిమాటోగ్రఫీ , శ్రీజిత్ సారంగ్ ఎడిటింగ్ పని చేస్తున్నారు.

## ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ కు ప్రభాస్ బర్త్ డే విషెస్



రాజాసాబ్ సినిమా షూటింగ్ సెట్‌లో నిర్మాత ఎస్ కేఎన్ కు రెబల్ స్టార్ ప్రభాస్ బర్త్ డే విషెస్ చెప్పారు తాజాగా ప్రభాస్‌ను రాజా సాబ్ సెట్ లో కలిశారు. ఈ సందర్భంగా ప్రభాస్‌తో తీసుకున్న ఫొటోను సోషల్ మీడియా ద్వారా షేర్ చేశారు ఈ ఫొటోలో ప్రభాస్ న్యూ స్టైలిష్ లుక్ వైరల్ గా మారింది. రాజా సాబ్ సినిమాకు క్రియేటివ్ ప్రొడ్యూసర్ వ్యవహరిస్తున్నారు ఎస్ కేఎన్. డిసెంబర్ 5న రాజా సాబ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.

## కార్తీ కొత్త సినిమా షురూ



తమిళ నటుడు కార్తీ హీరోగా మార్షల్ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. పూజా కార్యక్రమాలతో ఈ సినిమా షూటింగ్ ను ప్రారంభించారు. యాక్షన్ నేపథ్యంలో వైవిధ్యమైన కథతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. కార్తీ సరసన కళ్యాణీ ప్రియాన్ హీరోయిన్ గా నటిస్తుంది. ఇతర పాత్రల్లో సత్యరాజ్, ప్రభు, ఈశ్వరీరావు, మురళీ శర్మ తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని డ్రీమ్ వారియర్స్ పిక్చర్స్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు.



## ఆగస్టు 1న 'ఉసురే' విడుదల

యదార్ధ సంఘటనలతో రూపొందిన ఓ వైవిధ్యమైన గ్రామీణ ప్రేమకథగా 'ఉసురే' ఆగస్టు 1న థియేటర్స్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. టీజయ్ అరుణాసలం, జననీ కునశీలన్ హీరో, హీరోయిన్స్‌గా రూపొందుతోన్న ఈ చిత్రానికి నవీన్ డి.గోపాల్ దర్శకుడు. శ్రీకృష్ణ ప్రొడక్షన్స్ సమర్పణలో బకియా లక్ష్మి టాకీస్ పతాకంపై మౌళి ఎం రాధాకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నిర్మాణానంతర పనులు తుదిదశకు చేరుకున్నాయి. సీనియర్ హీరోయిన్ రాశి ఈ చిత్రంలో ముఖ్యపాత్రలో నటిస్తున్నారు. దర్శకుడు చిత్ర విశేషాలను తెలియజేస్తూ '' ఇదొక వైవిధ్యమైన ప్రేమకథ. ఎంతో రియలిస్టిక్ అప్రోచ్‌తో ఈ ప్రేమకథ అందరి హృదయాలకు హత్తుకుంటుంది. సమాజంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించాం. రొమాన్స్, కామెడి, డ్రామా గా రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రతి అంశం ఎంతో ఆస్తకికరంగా, ఉత్కంఠగా ఉంటుంది.కొత్తదనం కోరుకునే తెలుగు ప్రేక్షకులకు ఈ చిత్రం తప్పకుండా నచ్చుతుంది' అన్నారు.



## ఆగస్టు 22న యూనివర్సిటీ రిలీజ్


స్నేహ చిత్ర పిక్చర్స్ బ్యానర్ లో ఆర్ నారాయణ మూర్తి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం యూనివర్సిటీ (పేపర్ లీక్). ఈ చిత్రం ఆగస్టు 22న ప్రేక్షకుల ముందుకు వస్తున్న సందర్భంగా ప్రసాద్ ల్యాబ్ లో మీడియా సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్ నారాయణ మూర్తి, గోరేటి వెంకన్న, అద్దంకి దయాకర్, దేశపతి శ్రీనివాస్, అందెశ్రీ, జయరాజ్, నందిని సిద్దారెడ్డి, ప్రొఫెసర్ ఖాసీం తో పాటు పలువురు విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు. ఆర్ నారాయణ మూర్తి మాట్లాడుతూ: ఈ సినిమాలో 5 పాటలు ఉన్నాయి. కీర్తిశేషులు స్వర్గీయ గద్దర్ , జలదంకి సుధాకర్, వేల్పుల నారాయణ, మోటపలుకుల రమేష్ గొప్పగా రాశారు. ఈ చిత్రం కథాశం ఏమిటంటే గత కొన్నేళ్లుగా మన విద్యారంగంలో జరుగుతున్న పేపరు లీక్ లు గ్రూపు 12 లాంటి ఉద్యోగ ప్రశ్న పత్రాల లీకులు చూస్తుంటే ఈ చదువుల కేమైంది అని పిస్తుంది. ఇలా జరుగుతూ వుంటే విద్యార్థుల భవిష్యత్ ఏం కావాలి ? నిరుద్యోగుల జీవితాలు ఏమైపోవాలి ? కుంభకోణాలు జేస్తూ ఉంటుంటే రెక్కలు తెగిన జ్ఞాన పావురాలు విలవిల కోట్టుకుంటూ ఊపిరాడక నెల రాలుతుంటే కన్న తల్లితండ్రులు ఏమై పోవాలి. ప్రశ్న పత్రాలు లీకులు మాయం కాకూడదు. అందుకే విద్యను ప్రవేటు మాఫియా కబంధ హస్తాల నుంచి విముక్తి చేసి విద్యను జాతీయం చేయాలి. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి.అని చాటి చెప్పేదే ఈ యూనివర్సిటీ పేపర్ లీక్ చిత్రం. ఆగస్టు 22 న ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నాము అని అన్నారు.ఎడిటింగ్ మాలిక్, కెమెరా బాబూరావు దాస్ పని చేస్తున్నారు.



# నేతన్నలకు రుణమాఫీ నిధులు వారి ఖాతాలో వేసేలా చర్యలు

### అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్ : చేనేత కార్మికుల వ్యక్తిగత రుణాల పరిశీలనను స్వతరమే పూర్తిచేసి, వారి ఖాతాలలో రుణమాఫీ నిధులు తక్షణమే జమ చేయాలని వ్యవసాయ, చేనేత,జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధింత అధికారులను ఆదేశించారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పనీతీరుపై చేనేత జౌళిశాఖ అధికారులతో మంత్రి గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వచ్చే ఏడాదికి గాను ''అన్ని ప్రభుత్వ శాఖలు, కార్పోరేషన్ల నుండి అవసరమైన వస్త్రాల కోసం సెప్టెంబర్ నెలలోగానే ఆర్డర్లు తెప్పించుకోవడం ద్వారా నేత కార్మికులకు సంవత్సరం పొడవునా పని కల్పించాలని ఆదేశించారు. అదేవిధంగా ఇప్పటికే ఆర్ధర్లు ఇచ్చిన ప్రభుత్వ శాఖలకు దుస్తుల పంపిణీని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. టెస్కో నుండి సంఘాలకు వస్త్రాల ఉత్పత్తికి వర్క్ ఆర్డర్లను వెనువెంటనే అందచేసి, సకాలంలో వస్త్రాల ఉత్పత్తి జరిగేటట్టుగా చర్యలు తీసుకోవాలి.. స్వయం సహాయక సంఘాల మహిళలకు అందచేసే మహిళశక్తి చీరల ఉత్పత్తిని వేగవంతం చేయాలి. ఉత్పత్తి త్వరితగతిన పూర్తి చేయడానికి పర్యవేక్షణ కోసం ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు. టెస్కో షోరూంల పనితీరును మెరుగు పర్చి లాభాల బాటలో నడిపించడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నష్టాలలో ఉన్న టెస్కో షోరూంలను లాభాలలో ఉన్న షోరూంలలో విలీనం చేయాలని తెలిపారు. అదేవిధంగా తెలంగాణ హ్యాండీక్రాఫ్ట్స్ సంస్థలో మానవ వనరులను సక్రమంగా వినియోగించుకొని, సంస్థను అభివృద్ధి బాటలో నడిచేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టి)ని హైద్రాబాద్ నుండి యాదాద్రి జిల్లా పోచంపల్లిలో శాశ్వత ప్రాతిపదికన సంవత్సరంలోగా ఏర్పాటు చేయాలిఅంతకు ముందు జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ జౌళి శాఖలో అమలవుతున్న వివిధ పథకాల అమలు తీరు తెన్నులను మంత్రికి వివరించారు.



**చేనేత పురస్కారం- గ్రహీతలకు సన్మానం :**భారత ప్రభుత్వం చేనేత, జౌళి మంత్రిత్వ శాఖ ప్రకటించిన జాతీయ చేనేత పురస్కారం 2024 కి ఎంపికైన యాదాద్రి జిల్లా, సంస్థాన్ నారాయణపురం మండలం, పుట్టపాక గ్రామానికి చెందిన గజం నర్మద, గూడ పవన్ ను జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ జాతీయ చేనేత అవార్డుకు ఎంపికై చేనేత రంగంలో ఆదర్శంగా నిలిచి, తెలంగాణ రాష్ట్రానికి దేశవ్యాప్తంగా గుర్తింపు తేవడం గర్వకారణమన్నారు. ఈ సమావేశంలో చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి శైలజా రామయ్యర్, అడిషన్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి చోరవ చూపండి

### కూనంనేని సాంబశివరావుకు సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ ఆసోసియేషన్ వినతి

ప్రజాపక్షం/హైదరాబాద్ : సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం త్వరగా పరిష్కరించేలా చోరవ తీసుకోవాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ ఆసోసియేషన్ నాయకులు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి , ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావుకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు గురువారం హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ కూనంనేని సాంబశివరావుకు వినతి పత్రం అందజేశారు. సింగరేణి విశ్రాంత కార్మికులకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు గాను హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మిస్తామని, సింగరేణి ఛైర్మెన్ సి.ఎం.డి బలరాం ప్రకటించారని ఇది త్వరగా కార్యరూపం దాల్చేలా కృషి చేయాలని కూనంనేనికి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా తక్కువ పెన్షన్ పొందే విశ్రాంత ఉద్యోగులకు తెల్ల రేషన్ రేషన్ కార్డులు మంజూరు, ఉచిత అపరిమిత వైద్య సౌకర్యం కల్పించడంతోపాటు కనీస పెన్షన్ రూ.10 వేలు చెల్లించే విధంగా ప్రభుత్వాలతో చర్చించి పై సమస్యల పరిష్కరించాలని కోరారు.



## హరించే కుట్ర

**(మొదటి పేజీ తరువాయి)**

వ్యక్తం చేశారు. అనేక సవాళ్లతో కూడిన పరిస్థితుల్లో రాజ్యాంగాన్ని, దేశాన్ని కాపాడి ముందుకు తీసుకుపోవాల్సిన బాధ్యత లౌకిక, ప్రజాస్వామ్య, వామపక్ష శక్తులపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 9వ తేదీన కార్మిక, ఉద్యోగ దేశవ్యాప్త సమ్మె విజయవంతమైందని, ఇలాంటి ఉధృతమైన పోరాటాలను దేశ ,కార్మికవర్గ, పేదల ప్రయోజనాల కోసం భవిష్యత్తులో కొనసాగించాల్సిన అవసరముందన్నారు. కుల, మత రహిత సోషలిస్టు సమాజ నిర్మాణం కమ్యూనిస్టుల లక్ష్యమని, ఆ లక్ష్యం కోసం, మెరుగైన భారత దేశం కోసం కమ్యూనిస్టులు నిరంతరం పోరాడుతామని ఉద్ఘాటించారు.

**విప్లవోద్యమ నిలయం మఖ్దూంభవన్**

పునర్‌నిర్మితమైన సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్ కేవలం పార్టీ కార్యాలయం కాదని, ఇది తెలంగాణ రాష్ట్రంలో విప్లవోద్యమానికి నిలయమని, విప్లవ పోరాట కార్యక్రమాలకు, విప్లవోద్యమ సాహిత్యానికి నిలయమని, ఇక్కడికి వచ్చిన కమ్యూనిస్టు శ్రేణులు పోరాట స్ఫూర్తితో ముందుకు వెళతారని రాజా అన్నారు. కమ్యూనిస్టులు అంటే ఒక జీవన విధానం అని, మానవతావాదులని, ఒక సిద్ధాంతం, ఒక సంస్కృతి అని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు లౌకిక, ప్రజాస్వామ్య శక్తులలో సిపిఐకి మంచి గుర్తింపు ఉండడం అభినందనీయమని ఆయన అన్నారు.

**వర్గ దోపిడీ కొనసాగినంత కాలం కమ్యూనిస్టులు ఉంటారు : సురవరం సుధాకర్ రెడ్డి**

ప్రపంచంలో వర్గ దోపిడీ కొనసాగినంత కాలం కమ్యూనిస్టులు ఉంటారని సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సువరం సుధాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రపంచ వ్యాపంగా నేడు తీవ్ర సంక్షోభంతో పాటు యుద్ధ వాతావరణం నెలకొందన్నారు. అమెరికా అధ్యక్షులుగా డోనాల్డ్ ట్రంప్ ఎన్నికైన తర్వాత యుద్ధ ప్రమాదాలు మరింత తీవ్రతరమయ్యాయని తెలిపారు. ఫలితంగా నిరుద్యోగం పెరిగి ప్రజల జీవితాలు దుర్భరంగా మారుతుండగా, మరోవైపు కార్మికులు, యువత తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ దోపిడీ కొనసాగుతోందన్నారు. ఆ క్రమంలో ప్రపంచంలో పలు దేశాల్లో కమ్యూనిస్టులు అధికారంలోకి వస్తుండగా, భారతదేశానికి ఉత్తరాన ఉన్న నేపాల్, దక్షిణాన ఉన్న శ్రీలంకలో కమ్యూనిస్టులు అధికారం చేపట్టడం హర్షనీయమన్నారు. దేశంలోప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో ఫాసిస్టు పాలన కొనసాగుతుందని, ఇది పూర్తి ఫాసిజమా, పాక్షిక ఫాసిజమా అని చర్చ జరుగుతోందని, అయితే ఈ ప్రభుత్వం మాత్రం ఫాసిజం వైపు వెళుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు నిరసిస్తూ బుధవారం జరిగిన సార్వత్రిక సమ్మెలో 25 కోట్ల మంది పాల్గొని నిరసన వ్యక్తం చేశారని, శ్రామిక వర్గానికి తన విప్లవ జేజేలు అని అన్నారు. ప్రజా సమస్యలపై వర్గ పోరాటం చేసి ఎంతో మంది అమరులయ్యారని, ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న విజయాలను నిలబెట్టేందుకు పోరాటాలను మరింత ముందుకు తీసుకువెళ్ళాలన్నారు. తాము విద్యార్థి నాయకులుగా ఉన్న సమయంలో నిర్మించిన మఖ్దూంభవన్‌ను 50 ఏళ్ల తర్వాత పునర్ నిర్మితం చేసిన భవనాన్ని తాను ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.





## సమయం దొరుకుతుందా?

**(మొదటి పేజీ తరువాయి)**

వహించవచ్చని తెలిపింది. ఘనా, ట్రినిడాడ్, టోబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియా దేశాల పర్యటన తర్వాత ప్రధాని మోదీ గురువారం ఉదయం భారతదేశానికి తిరిగి వచ్చారు. ఈ పర్యటనలో, బ్రెజిల్‌లోని రియో డి జనీరోలో జరిగిన 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి కూడా మోదీ హాజరయ్యారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ మాట్లాడుతూ 'భారతదేశం తన సూపర్ ప్రీమియం ఫ్రీక్వెంట్ ఫ్లైయర్ ప్రధానమంత్రిని తిరిగి స్వాగతిస్తోంది, అతను మరోసారి విదేశాలకు వెళ్లడానికి ముందు బహుశా మూడు వారాల పాటు దేశంలో ఉంటారని భావిస్తున్నారు' అని అన్నారు. ఇప్పుడు ఆయన దేశంలో ఉన్నారు కాబట్టి, రెండేళ్లకు పైగా ప్రజలు ప్రధాని రాక కోసం ఎదురుచూస్తున్న మణిపూర్‌ను సందర్శించడానికి ఆయనకు సమయం దొరికింది; పహల్గామ్ ఉగ్రవాదులను ఇంకా ఎందుకు శిక్షించలేదో సమీక్షించండి; ఆయన సొంత రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కుప్పకూలడం గురించి ఆలోచించండి; వరదలతో అతలాకుతలమైన హిమాచల్ ప్రదేశ్‌కు సహాయం మంజూరు చేయండి' అని రమేష్ అన్నారు. గుజరాత్‌లోని వడోదర జిల్లాలో నాలుగు దశాబ్దాల నాటి వంతెన కూలిపోవడంతో అనేక వాహనాలు మహిసాగర్ నదిలోకి పడిపోవడం వల్ల ఇద్దరు తోబుట్టువులు సహా 15 మంది మరణించిన విషయం తెలిసింది. సామూహిక వినియోగాన్ని ప్రోత్సహించడానికి జిఎస్‌టి సంస్కరణపై కూడా ప్రధానమంత్రి దృష్టి పెట్టవచ్చని, కొన్ని కంపెనీలు, అనుకూల పెద్ద వ్యాపార సమూహాలు కాకుండా ఇతర కంపెనీలు ప్రైవేట్ పెట్టుబడులను పెంచడానికి చర్యలు తీసుకోవచ్చని రమేష్ పేర్కొన్నారు. రానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశానికి ఎజెండాను నిర్ణయించడానికి ఆయన అఖిలపక్ష సమావేశానికి కూడా అధ్యక్షత వహించవన్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈనెల 21న ప్రారంభంకానున్నాయి. గత వారం, ఘనాతో ప్రారంభమయ్యే ఐదు దేశాల పర్యటనకు మోదీ వెళ్లారు. ఆ తరువాత ఆయన 3 నుండి 4 వరకు రెండు రోజుల పర్యటన కోసం ట్రినిడాడ్, టొబాగోకు వెళ్లారు. తన పర్యటనలోని మూడవ దశలో, మోదీ 4నుండి 5 వరకు అర్జెంటీనాను సందర్శించారు. తన పర్యటనలోని నాల్గవ దశలో, అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డ సిల్వా ఆహ్వానం మేరకు మోడీ బ్రెజిల్‌కు వెళ్లారు. ప్రధానమంత్రి 5 నుండి 8 వరకు బ్రెజిల్‌ను సం దర్శించి 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి హాజరయ్యారు. ఆ తర్వాత రాష్ట్ర పర్యటన చేశా రు. ఆ తర్వాత మోదీ భారతదేశానికి తిరిగి రాకముందు నమీబియాను సందర్శించారు.

## హమాస్ అంగీకారం

**(మొదటి పేజీ తరువాయి)**

శాంతి నెలకొంటుందని, ఈ కీలక ఆటంకాలు ఇంకా తొలగిపోలేదని తెలిపింది. ఈ రెండు సమస్యల పరిష్కారానికి సానుకూలదృష్టితో కృషి చేస్తామని ప్రకటించింది. ఒకవైపు వైట్‌హౌస్‌లో ట్రంప్–నేతన్యాహూ పరస్పర పొగడ్తల విజయభేరీ విందు సమావేశం, మరోవైపు దోహాలో ఖతార్, ఈజిప్టు మధ్యవర్తి దేశాల ద్వారా ఇజ్రాయెల్–హమాస్ పరస్పర షరతుల మధ్య పరోక్ష చర్చలు, ఇంకోవైపు గాజాలో భీకరమైన గగనతల దాడులు, హింసాత్మక చర్యల నడుమ గడచిన ఐదు రోజులూ సందిగ్ధంలో కొనసాగాయి. 60 రోజుల కాల్పుల విరమణకు రెండు దేశా ల నుండీ సంకేతాలు అందాయని ట్రంప్ ప్రకటించిన కొద్దిరోజులకు, నాలుగురోజుల పరోక్ష చర్చల తర్వా త బందీల విడుదలపై హమాస్ ప్రకటన వచ్చింది. ఏదోవిధంగా ఇజ్రాయెల్–హమాస్ మధ్య ఒప్పందం జరుగుతుందన్న వాతావరణాన్ని ట్రంప్ సృష్టించారు. హమాస్‌కు ఇదే అత్యుత్తమమైన, మేలైన చివరి అవకాశమని ట్రంప్ చెప్పిన మాటలకు హమాస్ సానుకూలంగా స్పందించినప్పటికీ చర్చల దగ్గరమాత్రం తుది నిర్ణయంపై ఊగిసలాడింది. బుధవారం మూడోరోజు చర్చల్లో రాత్రి పొద్దుపోయేవరకూ ప్రతిష్ఠంభన నెలకున్నది. ఇజ్రాయెల్ సైన్యాలు గాజాను ఖాళీచేసి వెళ్ళాలన్న హమాస్ షరతు దగ్గర చర్చలు ఆగిపోయాయి. ఇజ్రాయెల్ మొండిగా వ్యవహరిస్తున్న పరిస్థితుల్లో చర్చలు జరపలేమని పేర్కొన్న తర్వాత ఎట్టకేలకు 10 మంది బందీల విడుదలకు హమాస్ అంగీకరించింది. వీరితోపాటు మరో 18 మృతదేహాలను కూడా ముందుగా నిర్దేశించిన ప్రకారం స్వాధీనం చేయాల్సి ఉంటుంది. 2023 అక్టోబరు ఏడో తేదీన హమాస్ చేసిన దాడిలో 251మంది ఇజ్రాయెలీ పౌరులను బందీలుగా తీసుకుపోయింది. వీరిలో ఇంకా 49 మంది హమాస్ వద్దే ఉన్నారు. కానీ వీరిలో 27 మందిమరణించినట్లు భావిస్తున్నారు.

**వెస్ట్‌బ్యాంక్‌లో 50 మంది అరెస్టు :** ఇజ్రాయెల్ ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్ ప్రాంతంలో 50 మంది పాలస్తీనియన్లను ఐ డి ఎఫ్ సైనికులు గురువారంనాడు అరెస్టు చేశారు. మరోవైపు న్యాబెలస్, క్వాక్విల్యా, టుబ్రాస్, హెబ్రాస్, జెనిన్, బెత్లెహామ్, రమల్లా తదితర ప్రాంతాలలో ఇజ్రాయెల్ సైన్యం విచ్చలవిడి దాడులు కొనసాగించింది. ఆక్రమిత గాజాలో ఇళ్ళకూల్చివేత కార్యక్రమాన్ని శరవేగంగా కొనసాగిస్తోంది. యుద్ధం ప్రారంభమైనప్పటినుండీ 21 నెలల్లో ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో 1000 మంది పాలస్తీనయన్లను ఇజ్రాయెల్ సైన్యం హత్య చేసింది. గడచిన 50 యేళ్ళలో ఎన్నడూలేనంత ఎక్కువసంఖ్యలో ఇళ్ళను ఐ డి ఎఫ్ సైనికులు కూల్చివేస్తున్నారు. ఒకవైపు దోహాలో శాంతి చర్చలు జరుగుతుండగా మరోవైపు ఇజ్రాయెల్ బుధవారంనాడు 643 గాజాలో చేసిన గగనతల దాడుల్లో 40 మంది పాలస్తీనియన్లు మరణించారు. మృతుల్లో 17 మంది మహిళలు, 10 మంది పిల్లలు ఉన్నారు. ఒకే కుటుంబానికి చెందిన 10 మది మరణించారు. వీరిలో ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆ హార కేంద్రాలవద్ద ఐ డి ఎఫ్ చేసిన కాల్పుల్లో 750 మంది మరణించారు. ఈ ఏడాది మార్చి 18 నుండి ఇప్పటివరకూ గాజాలో 7,200 మంది పాలస్తీనియన్లు మరణించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com